thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 321 కరీంనగర్ మంగళవారం, 27 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహారా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్ర హాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నం తా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.

# ఢిల్లీలో కన్నులపండువగా 77వ గణతంత్ర దినోత్సవం..

## మిన్నంటిన సంబరాలు




ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవంలో దేశభక్తి అంబరాన్నంటింది. రాష్ట్రపతి జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమైన వేడుకలు కన్నులపండువగా సాగాయి. కర్తవ్యపథ్‌పై సైనిక దళాల కవాతు ఆద్యంతం ఆకట్టుకుంది. అంతకుముందు, భారత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ యుద్ధ స్మారకం వద్ద అమర సైనికులకు నివాళులు అర్పించారు. అనంతరం, వేదిక వద్ద ముఖ్య అతిథులు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లాయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాకు రాష్ట్రపతి ముర్ము స్వాగతం పలికారు. రాష్ట్రపతి భవన్ నుంచి సంప్రదాయక బగ్గీలో ముఖ్య అతిథులతో కలిసి వచ్చిన రాష్ట్రపతి ముర్ము.. కర్తవ్యపథ్ వద్ద వేదికపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ ప్రారంభమైంది. త్రివిధ దళాల పరేడ్‌తో గణతంత్ర దినోత్సవ కవాతు ప్రారంభమైంది. ఈ పరేడ్‌కు లెఫ్టినెంట్ జనరల్ భవ్‌నీశ్ కుమార్ నేతృత్వం వహించారు. సైనిక దళాల కవాతుతోపాటు ప్రచండ్ హెలికాప్టర్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే యూనిఫామ్‌తో అశ్వికదళం తొలిసారిగా పాల్గొనడం మరో ప్రత్యేకత. వందేమాతరం థీమ్‌తో సాగిన పరేడ్‌లో దేశ అభివృద్ధి, సాంస్కృతిక వైవిధ్యత, ఆపరేషన్ సిందూర్ గొప్పదనాన్ని చాటేలా పలు ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించారు. ఇక ఐరోపాకు చెందిన నలుగురు సైనిక అధికారులు తమ జెండాలతో జిప్సీ వాహనాల్లో పరేడ్‌లో పాలు పంచుకోవడం అతిథులను ఆకట్టుకుంటుంది. ఈ వేడుకల్లో తొలిసారిగా బ్యాటిల్ ఎరే ఫార్మాట్‌లో భారత ఆర్మీ కవాతును నిర్వహించింది. 61 కావల్రీ దళం, నిఘా కోసం ఉద్దేశించిన రీకానిసెన్స్ వాహనం, ఆపరేషన్ సిందూర్ జెండాతో ధ్రువ హెలికాప్టర్ విన్యాసం దేశసైనిక పాటవాన్ని చాటాయి. ఈ వేడుక ప్రారంభానికి ముందు భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా రాష్ట్రపతి చేతుల మీదుగా అత్యున్నత శౌర్య పురస్కారం అశోక్ చక్రను అందుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా అరుదైన గుర్తింపు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

**గణతంత్ర వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్స్ ఇవే..**

**ముఖ్య అతిథులు:** ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**యుద్ధ స్మారకం వద్ద నివాళి:** ప్రధాని నరేంద్ర మోదీ నేషనల్ వార్ మెమోరియల్?ను సందర్శించి, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు.

**రాష్ట్రపతి రాక:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ముఖ్య అతిథులతో కలిసి సంప్రదాయ 'రాష్ట్రపతి బగ్గీ'లో కర్తవ్య పథ్‌కు చేరుకున్నారు.

**జాతీయ జెండా ఆవిష్కరణ:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం, 21 గన్ సెల్యూట్‌తో గౌరవ వందనం సమర్పించారు.

**బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన:** పరేడ్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**అపాచీ హెలికాప్టర్ల గర్జన:** గగనతలంలో అపాచీ హెలికాప్టర్లు తమ విన్యాసాలతో వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

**ధనుష్ గన్ సిస్టమ్:** భారత సైన్యానికి వెన్నెముకగా నిలిచే ధనుష్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ పరేడ్‌లో భాగస్వామ్యం వహించింది.

**అశోక చక్ర ప్రదానం:** అంతరిక్ష యాత్రికుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాకు దేశ అత్యున్నత పురస్కారం 'అశోక చక్ర'ను రాష్ట్రపతి ప్రదానం చేశారు.

**యూరోపియన్ యూనియన్ బృందం:** తొలిసారిగా ఈ పరేడ్‌లో యూరోపియన్ యూనియన్ మిలిటరీ బృందం పాల్గొని గౌరవ వందనం సమర్పించింది.

**ఆపరేషన్ సింధూర్ :** ఇటీవల వార్తల్లో నిలిచిన 'ఆపరేషన్ సింధూర్' ఇతివృత్తంతో రూపొందించిన శకటం ప్రత్యేక గుర్తింపు పొందింది.

**61వ కావల్రీ:** ప్రపంచంలోనే ఏకైక క్రియాశీల గుర్రపు దళం అయిన '61వ కావల్రీ' పరేడ్‌లో తన రాజసాన్ని ప్రదర్శించింది.

**వందేమాతరం థీమ్:** ఈ ఏడాది పరేడ్ 'వందేమాతరం - 150 ఏళ్లు' అనే ప్రత్యేక థీమ్‌తో సాగింది.

**రాష్ట్రాల శకటాలు:** దేశ సంస్కృతిని ప్రతిబింబిస్తూ 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మరో 13 వివిధ మంత్రిత్వ శాఖల శకటాలు ప్రదర్శనలో నిలిచాయి.

**వికసిత్ భారత్ 2047:** 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంతో వేడుకలు జరిగాయి.

**కర్నల్ సోఫియా ఖురేషీకి గౌరవం:** ఆపరేషన్ సింధూర్‌లో కీలక పాత్ర పోషించిన కర్నల్ సోఫియా ఖురేషీకి 'విశిష్ట సేవా మెడల్' ప్రకటించారు.

**పద్మ అవార్డుల ప్రకటన:** గణతంత్ర వేడుకల సందర్భంగా 131 మందికి పద్మ పురస్కారాలను కేంద్రం ప్రకటించింది.

**ట్రాఫిక్ ఆంక్షలు:** పరేడ్ నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

**లైవ్ స్ట్రీమింగ్:** దేశ ప్రజలందరూ వీక్షించేలా దూరదర్శన్, యూట్యూబ్ ఛానళ్లలో వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

## శుభాన్షు శుక్లాకు అశోక చక్ర ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ, జనవరి 26: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్–4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్?లో 'యాక్సియమ్–4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం...




హైదరాబాద్, జనవరి26: తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు స్పీడ్ అందుకుంది. బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులకు సిట్ నోటీసులు జారీచేసి.. విచారించిన సంగతి తెలిసిందే. వారిరువురూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సంతోశ్ రావుకు నోటీసులు పంపిన సిట్.. మంగళవారం(జనవరి 27) ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇటీవల సుప్రీం కోర్టు సైతం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణపై దర్యాప్తు సంస్థను దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతించామని, ఇంకెంత కాలం విచారణ కొనసాగిస్తారని ప్రశ్నించింది. ఆయన విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును వేగవంతం చేశారు సిట్ అధికారులు.

# అన్నింటా అగ్రస్థానంలోకి తెలంగాణ రైజింగ్




## 77వ గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, జనవరి 26: భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

**ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానం..** మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు.

**ఉద్యోగాల భర్తీ..** భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్–1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు.

ITIలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు.

**మహిళలకు ప్రాధాన్యం...** మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అద్దె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు.

ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు.

**హిల్ట్ పాలసీతో...** తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్?లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. అంతకుముందు, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 77వ రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు.

సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

చురకలు






హైదరాబాద్: రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, సమానత్వం ప్రసాదించిందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు. భద్రతా బలగాల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. "ప్రజా ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్-2047ను ఆవిష్కరించింది. హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా దీన్ని రూపొందించింది. ఈ డాక్యుమెంట్ సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంది. రాష్ట్రాన్ని మూడు ఎకానమీ జోన్లుగా ప్రభుత్వం విభజించింది. మూడు కీలక రంగాల కోసం దీన్ని ఏర్పాటుచేస్తోంది. ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లు కేటాయించాం. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కింది. 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. సన్న వడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నాం. ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లు చెల్లించాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ.. దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. భూ వివాదాలు పరిష్కరించేలా భూభారతి చట్టం తీసుకొచ్చాం. గ్రూప్?-1, 2, 3 ఉద్యోగాల భర్తీని పూర్తి చేశాం. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు కల్పించింది" అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగంలో పేర్కొన్నారు.




హైదరాబాద్, జనవరి 26: 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్(సీపీ) సజ్జనార్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్లేట్లబురుజులోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీ.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు అత్యంత పవిత్రమైనదని, స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణ త్యాగం చేశారని గుర్తుచేశారు. దేశ భద్రత కోసం వేలాది మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

**బాధితులకు మొదటి ప్రాధాన్యం..** హైదరాబాద్?ను దేశంలోనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి చేస్తోందని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇందుకోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని వివరించారు. పోలీసింగ్?లో మానవీయ దృక్పథం ఉండాలన్న ఆయన.. విక్టిమ్, సిటిజన్ సెంట్రిక్ అప్రోచ్‌తో బాధితులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసే వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామని గర్వంగా పేర్కొన్నారు.

**నేరాల నివారణే లక్ష్యంగా..** మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు, 24/7 స్పందన ఉంటుందని తెలిపారు. యాప్ ద్వారా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని సజ్జనార్ వివరించారు. కేసులు నమోదు చేయడమే కాదు.. బాధితులకు న్యాయం అందేవరకూ పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేశారు.

నేరాల నివారణే లక్ష్యంగా Prevention is Better than Cure విధానాన్ని అనుసరిస్తు న్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు.

**చట్టం అందరికీ సమానమే..** హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి చేశామని.. ప్రాణ రక్షణే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు సీపీ. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా, వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలమని, శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచామని చెప్పారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమని ఆయన అన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువల పట్ల అందరూ నిబద్ధత చూపాలని తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయం అందరి హక్కు అని సజ్జనార్ స్పష్టం చేశారు.



## తెలంగాణ లోక్‌భవన్‌లో ఎట్‌హోం.. ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

**హైదరాబాద్ : రిపబ్లిక్ డే సందర్భంగా లోక్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. నేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే ఏకే సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్, బీఆర్ఎస్, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్‌ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు.**

## భాజపా కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్ : కేంద్రంలో 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన అన్ని సంక్షేమ పథకాలను ప్రస్తుత పాలకులు తొలగిస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని.. లౌకిక వాదానికి తూట్లు పొడిచే కుట్రలు చేస్తున్నారని ఆక్షేపించారు. గాంధీభవన్ లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ఆరోపించారు. "కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ సూచనలతో ముందుకెళ్తున్నాం. సీఎం రేవంత్ రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారు. కులగణన సర్వేతో దేశంలోని అన్ని రాష్ట్రాలూ తెలంగాణ వైపు చూస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి మేం కట్టుబడి ఉన్నాం. కులగణన బిల్లులను భాజపా అడ్డుకుంటోంది. ఆ పార్టీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి"అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే: రామచందర్‌రావు

హైదరాబాద్ : గణతంత్ర వేడుకల్లో భాగంగా భాజపా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వేముల అశోక్, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. "కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు. ఓటు చోరీ కాదు.. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అయింది. అమిత్ షా వ్యాఖ్యలను మార్ఫింగ్ చేసిన అంశంలో సీఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉంది. 'వీబీ జీ రామ్ జీ' పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే" విమర్శించారు.






చర్ల: ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలిక, ఐఈడీలు అమర్చినట్లు భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలి కాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హైఅలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్? నిర్వహించిన విషయం తెలిసిందే.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలి: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 26: మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్?మంటూ రైతుల అకౌంట్?లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

## జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జనవరి 26 : నగరంలోని జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గం నుంచి చదువుకున్న యువకుడిని నిలబెట్టి ప్రజలే గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యవస్థలో చాలా ముఖ్యమైనవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్?లో ఉన్న అన్ని రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్?లో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్?కు ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందని, అలాంటి నాయకుడితో కలిసి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో నవీన్ యాదవ్ పెద్ద స్థాయి నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంటే చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని అనుకున్నప్పటికీ, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని, పరిశ్రమలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉ ందని వెల్లడించారు. అలాగే కమలాపురి కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి.

## గణతంత్ర దినోత్సవం.. ఆ షాపులు బంద్..

హైదరాబాద్/అమరావతి, జనవరి 26: దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కాలేజీలు, స్కూళ్లలో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. మరోవైపు ఈ వేడుకల కారణంగా.. తెలుగు రాష్ట్రాల్లో మద్యం దుకాణాలు మూసివేశారు. ఈ నిబంధన దేశవ్యాప్తంగా అమలవుతోంది. బార్లు, పబ్‌లు, క్లబ్‌లు, రెస్టారెంట్లలో మద్యం విక్రయాలు ఈ రోజు నిలిచిపోయాయి. అలాగే మాంసం, చేపలు, కోళ్ల విక్రయాల దుకాణాలతోపాటు జంతు వధ శాలలను మూసివేశారు. నిబంధనలు ఉల్లంఘించి షాపులు తెరిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ఇక ప్రతీ ఏడాది జనవరి 26, ఆగస్టు 5, గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీన దేశవ్యాప్తంగా మద్యం దుకాణాలు మూసివేస్తారు. ఇవే తేదీల్లో మటన్, చికెన్ షాపులనూ మూసివేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తారు. మరోవైపు సోమవారం రిపబ్లిక్ డే సందర్భంగా షాపులు బంద్ అంటూ రెండ్రోజుల ముందుగానే మద్యం దుకాణదారులు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో మద్యం ప్రియులు ముందుగానే తమ కావాల్సిన సరుకును భారీ సంఖ్యలో కొనుగోలు చేశారు. అదీకాక.. ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడంతో శనివారమే మద్యం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మరోవైపు ఈ ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి రికార్డు స్థాయిలో మద్యం క్రయవిక్రయాలు జరిగిన సంగతి తెలిసిందే.



# అలనాటి మేటి నటి జమున - జనవరి 27...జమున వర్ధంతి



జనాభాయి అనే పేరు తెలిసిన వారు ఎవరూ ఉండక పోవచ్చు. అలాగే జూలూరి జమున గురించి కూడా ఎవరికీ తెలియక పోవచ్చు. ఈ రెండు పేర్లు తెలుగు సినిమా రంగానికి చెందిన ఒక అగ్ర శ్రేణి కథానాయకురాలికి సంబంధించినవే అంటే ఔరా అనిపించక మానదు. అంతే కాదు. ఆమె తెలుగు మాతృభాష కాకపోయినా తెలుగు నేలలో పెరిగి, తెలుగు చలన చిత్ర సీమలో అరుదైన కథానాయికగా గుర్తింపు పొందిన తార అంటే ఆశ్చర్యం కలుగ మానదు. ఆమే అర్ధ శతాబ్దం క్రితం సినీ రంగంలో కాలూని, వెండి తెరపై నడయాడి, ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన లిజెండ్, జూలూరి జమున లేదా జమునా రమణారావు లేదా జమునగా సుపరిచితురాలు అయిన ఒకనాటి తెలుగు మేటి సినీ నటి. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హీరోయిన్లుగా కొనసాగిన వాళ్లు చాలా మందే వున్నారు. కేవలం కొంతమంది మాత్రమే తమ నటనా ప్రతిభతో సుధీర్ఘ కాలం పరిశ్రమలో, ప్రేక్షకుల్లో తమదైన ముద్రలను వేసుకున్నారు. అలాంటి ప్రతిభ గల మేటి పారతరం తారల్లో జమున ఒకరు. జమున 1936 ఆగష్టు 30 న హంపీలో పుట్టారు. ఆమె తల్లి కౌసల్యాదేవి తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. బాల్యం గడిచింది గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. జమునకు ముందుగా పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం రీత్యా ఏదైనా నది పేరు ఉండాలని జ్యోతిష్కులు సూచించడంతో మధ్యలో 'ము' అక్షరం చేర్చి జమునగా మార్చారు. ఉత్తరాది వారు యమునను జమునగా పిలవడం నేపథ్యంగా ఆమెకు ఆ పేరు స్థిరీకరించారు. సినిమా కోసం ప్రత్యేకంగా ఆమె పేరు మార్చలేదు. సినీనటుడు జగ్గయ్యదీ అదే గ్రామం కావడం వల్ల జమున కుటుంబానికి జగ్గయ్యతో కొంత పరిచయం ఉంది. సహజంగా బెరుకు అంటూ లేని జమున స్కూలులో చదివే కాలంలో నాటకాల పట్ల ఆకర్షితురాలు కావడం జరిగింది. బాల్యంలోనే జమున సంగీతంలో కూడా శిక్షణ తీసుకున్నారు. ఆమె నటనకు ఎన్నో అవార్డులు సైతం లభించాయి. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం ' అనే నాటిక ప్రదర్శన కోసం ప్రత్యేకంగా జగ్గయ్య, జమునను ఎంపిక చేసుకుని తీసుకు వెళ్ళారు. ఆ నాటికలో మరో ప్రముఖ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. అలా నాటకాలలో ఆమె ప్రతిభ బహిర్గతమై నలుమూలలకూ తెలవడం వల్ల సినిమా అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. బి.వి.రామానందం తీసిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం. తరువాత అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, నందమూరి తారక రామారావు తదితర నటుల సరసన నాయికగా నటించారు. ఎన్ని పాత్రలలో నటించినా ఆమెకు బాగా పేరు తెచ్చింది సత్యభామ పాత్రే. ఆ పాత్రలో ఇప్పటికీ ఆమెను తప్ప మరొకరిని ఊహించు కోలేము అన్నట్టుగా అద్భుతంగా నటించారామె. వినాయక చవితి చిత్రంలో మొదటి సారి సత్యభామ పాత్రలో జమున కనిపిస్తుంది. ఆ తర్వాత శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో కూడా అదే పాత్ర వేశారు. ఈ సినిమాలో సత్యభామ ఆహార్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా లోని పాత్రే ఆమెకు గొప్ప పేరు తెచ్చింది. ప్రధానంగా "మీర జాల గలడా నా యానతి" పాటపై సత్యభామలోని అన్ని లక్షణాలు కలబోసుకుని చేసిన ఆమె అభినయం, ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. సత్యభామ అంటే ఇలాగే వుంటుంది అనే భావన కలిగించారు జమున. కళపై ఉన్న మక్కువతో నాటకాల్లో బుర్రకథ ఫేం నాజర్? దగ్గర శిక్షణ తీసుకోవటం తన నట జీవితానికి పట్టం కట్టిందని చెపుతారు. సినీ నటీమణుల్లో , రాజకీయాలలో ప్రవేశించి రాణించిన కథానాయికలలో ఆమె తమ స్థానాన్ని పదిల పరచుకొన్నారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అంటే ఉన్న అభిమానం, గౌరవం నన్ను రాజకీయాలలోకి లాక్కొచ్చాయి అని తన రాజకీయ జీవితం గురించి చెప్పేవారు జమున. ఆమె తెలుగు సినిమాలే కాక తమిళం, హిందీ సినిమాలలో కూడా నటించారు. ఆమె నటించిన మిస్సమ్మ, ఇల్లరికం, ఇలవేల్పు, లేత మనసులు, గుండమ్మ కథ చిత్రాలు విజయ వంతమై, రజతోత్సవాలు జరుపు కున్నాయి. జమున చిన్నతనం నుండే నాటకాలలో నటించే వారు. జమున తల్లి ఆమెకు శాస్త్రీయ సంగీతం, హార్మోనీయంలలో శిక్షణ ఇప్పించారు. మా భూమి నాటకంలో జమున ఒక పాత్ర పోషించగా, ఆమె అభినయం నచ్చి ఆమెకు పుట్టిల్లు (1953)లో నటిగా అవకాశం ఇచ్చారు. ఆ సినిమాతో సినిమాల లోకి తెరంగేట్రం చేశారామె. తెలుగు, దక్షిణ భారత భాషల్లో కలిపి ఆమె 198 సినిమాలు చేశారు. పలు హిందీ సినిమాలలో కూడా నటించారు. 1967లో ఆమె హిందీలో చేసిన మిలన్ సినిమా, 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు లభించింది. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారామె. 1980లలో కాంగ్రెస్ పార్టీలో చేరి రాజమండ్రి నియోజకవర్గం నుంచి 1989లో లోక్ సభకు ఎంపిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రాజకీయల నుండి తప్పుకున్నా, 1990వ దశకంలో భారతీయ జనతా పార్టీ తరపున ప్రచారం చేశారు. 1968లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మిలన్; 1964లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మూగ మనసులు; తమిళనాడు రాష్ట్ర చలన చిత్ర గౌరవ పురస్కారం 1999, 2008లలో ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారం పొందారు. 89ఏళ్ల జమున వృద్యాప్త సంబంధిత వ్యాధులతో బాధపడుతూ 2023 జనవరి 27న హైదరాబాద్?లోని స్వగృహంలో కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# సుదీర్ఘ రాజకీయ అనుభవ దాలి వెంకట్రామన్

## - జనవరి 27... దివంగత రాష్ట్రపతి వర్ధంతి




ఆర్. వెంకట్ రామన్ గా చిర పరిచితులయిన రామస్వామి వెంకట్రామన్, తమిళ నాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, న్యాయవాది, భారత మాజీ రాష్ట్రపతి (1987 నుండి 1992) 1910 డిసెంబర్ 4న తమిళనాడు లోని తంజావూరు సమీపంలోని పట్టుకొట్టైలో జన్మించారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్రం అభ్యసించి 1935లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. వెంకట్రామన్ 1950లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా తాత్కాలిక పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వెంకట్రామన్ 1952 నుండి 1957 వరకు మరియు 1977 నుండి లోక్ సభ సభ్యులుగా ఉన్నారు. 1957 నుండి 1967 వరకు తమిళనాడు రాష్ట్రానికి పారిశ్రామిక, కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. వెంకట్రా మన్ కేంద్ర ప్రభుత్వంలో చేరి ఆర్థిక, పరిశ్రమల శాఖ (1980-82) మరియు రక్షణ శాఖ మంత్రిగా (1982-84) పనిచేశారు. అయన? ఆర్థిక మంత్రిగా పని చేస్తూ, 1980 -81, 1981-82 ఆర్థిక సంవత్సరాలకు బడ్జెట్? ప్రవేశ పెట్టారు. 1984-87 లో భారత ఉప రాష్ట్రపతిగా పనిచేసిన తరువాత, 1987 జూలైలో రాష్ట్రపతి పదవికి ఎన్నిక కాబడ్డారు. జూలై 25, 1987 నుండి జూలై 25, 1992 వరకు దేశ ప్రథమ పౌరునిగా ఉన్నారు. 1987 - 92 మధ్య రాష్ట్రపతిగా పని చేసిన ఆర్ వెంకట్రామన్ హయాంలోనే సంకీర్ణ ప్రభుత్వాల పాలన మొదలైంది. రాజీవ్‌గాంధీ 1989 ఎన్నికల్లో పరాజయం పాలు కాగా వి.పి.సింగ్ ప్రధాని అయ్యారు. ఆయన ప్రభుత్వం పతనం కావడంతో చంద్రశేఖర్? ప్రభుత్వం ఏర్పాటు చేయడం విశేషం. ఆ ప్రభుత్వం కూడా పడిపోవడంతో 1991లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో పి.వి. నరసింహారావు ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. దక్షిణాది రాష్ట్రాల నాయకులు ఈ అత్యున్నత రాజ్యాంగ పదవిని అందుకుని తమ తమ ముద్రలు వేశారు. తమిళనాడు నుంచి ఏకంగా ముగ్గురు (సర్వేపల్లి రాధాకృష్ణన్?, ఆర్?.వెంకట్రామన్?, అబ్దుల్ కలాం) ఎన్నికయ్యారు. కేరళ నుండి కే. ఆర్.నారాయణన్ తొలి దళిత రాష్ట్రపతికి రాష్ట్రపతి భవన్ లో అడుగు పెట్టారు. కాగా ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ నుండి నీలం సంజీవరెడ్డి రెండు సార్లు దేశ అత్యున్నత పదవికి పోటీ చేసి ఒక్కసారి విజయం సాధించారు. వెంకట రామన్ రచనల్లో ప్రసిద్ధి చెందినది "మై ప్రెసిడెన్సియల్ ఇయర్స్". వెంకట రామన్ 98 సంవత్సరాల వయసులో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అవయవాల వైఫల్యం కారణంగా 2009 జనవరి 27న న్యూఢిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ హాస్పిటల్ లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ద్వైత మత బోధకులు మధ్వాచార్యులు

## - మాఘశుక్ల నవమి మధ్వాచార్య నిర్యాణ దినం



భారత దేశ నాగరికతకు మతము జీవకర్ర వంటిది. మతత్రయాచార్యులలో, వైష్ణవమత బోధకులలో అగ్రగణ్యులైన శ్రీమధ్వాచార్యులు ఒకరు. త్రిమతాచార్యులలో మూడవ వారై, హనుమంతుడు, భీముడు, అనంతరం వాయు దేవునకు తృతీయ అవతారంగా భావించే మధ్వాచార్యులు ద్వైత మత బోధకులు. ఆయన సాంప్రదాయా లను పాటించే వారిని మాధ్వులు లేదా మధ్వ మతస్తులు అంటారు. క్రీ.శ.1238 ఆశ్వయుజ మాస శుక్ల పక్ష దశమి (విజయదశమి) నాడు ఆయన కొంకణ - కేరళ మధ్యనున్న కనరా మండలంలోని ఉడిపి పట్టణ సమీపస్థ పాజక క్షేత్రంలో మధ్య గేహభట్ట, వేదవతి దంపతులకు జన్మించారు. ఉడిపిలోని అనంతేశ్వర స్వామిని చిరకాలం కొలిచిన ఫలితంగా జన్మించి నందున ఆయనకు వాసుదేవుడని తల్లిదండ్రులు పేరు పెట్టారు. అనంతర కాలంలో "పూర్ణప్రజ్ఞ, ఆనందతీర్థ, మధ్యాచార్య" అనే నామాలతో ప్రసిద్ధులైనారు. 8వ ఏట ఉపనయన సంస్కారియై, 10ఏళ్లకే సర్వ విద్యా పారంగతుడైనారు. 11ఏళ్ల వయసులో సన్యాసంవైపు ఆకర్షితులై, అచ్యుత ప్రజ్ఞ అనే యతివర్యులైన ఆధ్యాత్మిక గురువు వద్ద సన్యాసాశ్రమాన్ని స్వీకరించి, "పూర్ణబోధ" పేరు నంది అనే గొప్ప పండితుని ఓడించి "మధ్వ, పూర్ణ ప్రజ్ఞుడు" బిరుదులు పొందారు. వేదాంత విద్యా రాజ్య పట్టాన్ని పొంది "అనంద తీర్థులు నామాంచితులైనారు. యుక్త వయసు లోనే దక్షిణ భారతావనిలో కన్యాకుమారి, రామేశ్వరం, శ్రీరంగం తదితర క్షేత్రాలను సందర్శించారు. తాము పొందిన తత్వజ్ఞానాన్ని ఉపన్యాస రూపంలో ప్రజలకు వివరించారు. శ్రీశంకర భగవత్పాదుల ప్రస్థాన త్రయానికి ఒనర్చిన భాష్యాలను మధ్వాచార్య విమర్శించారు. దక్షిణ దిగ్విజయ యాత్ర గావిస్తూ, తమ ముఖ్య శిష్యుడైన సత్యతీర్థులతో కలిసి బదరి యాత్ర చేశారు. ఆ సందర్భంలోనే బ్రహ్మ సూత్రాలపై భాష్యాలను పూర్తి చేశారు. స్వదేశానికి తిరిగి వస్తూ రాజమహేంద్ర వరంలో శ్యామశాస్త్రి (నరహరితీర్థులు)ని మాయావాదం గురించి ఓడించి, ప్రచండవాదం గావించి, శిష్యుడిని చేసుకున్నారు. అలాగే అక్కడే శోభనభట్టు (పద్మనాభ తీర్థులు) అనే పండి తుడు శిష్యుడైనాడు. ఉడిపిలో భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యాలు రాసారు. రుగ్వేదంలోని 40 సూక్తాలకు,భారత భాగవతాలకు వ్యాఖ్యానాలు రచించారు. శ్రీకృష్ణామృత మహార్ణవం కర్మనిర్ణయం, మహా భారత తాత్పర్యం లాంటి అనేక గ్రంథ రచనలు గావించారు. తర్కంతో పాటు 37 గ్రంథాలను విరచించారు. జీవిత కాలంలో ఆనందానుభూతి పొందగల సులభతరమైన భక్తిమార్గాన్ని ఆయన బోధించారు. అందుకే ఆయనకు ఆనంద తీర్థులన్న నామధేయం బహుళ ప్రచారంలో ఉంది. భక్తి జ్ఞాన వైరాగ్యాలతోపాటు కర్తవ్య కర్మ ఆచరణ ద్వారా శ్రీచరణాలు చేరవచ్చునని మార్గదర్శనం చేశారు. "జీవుడు వేరు, బ్రహ్మము వేరు. జీవుడు మిథ్య కాదు. అలాగే జడ జగత్తు కూడా మిథ్య కాదు. ఈశ్వరుడు ఎంత సత్యమో జీవజగత్తులు కూడా అంత సత్యం. భక్తి ఒక్కటే ముక్తిదాయకం. అది జ్ఞానపురస్కృతమైన భక్తి అయి ఉండాలి. ముక్తి నాలుగు విధాలు:సాలోక్యం - జీవాత్మ భగవంతుని లోకంలో భగవంతునితోపాటు నివసించడం; సామీప్యం - భగవంతుని సన్నిధానంలో నివసిస్తూ కామితార్థాలను అనుభవించడం; సారూప్యం -భగవంతుని రూపం పొంది ఇష్టభోగాలు అనుభవిస్తూ ఆనందించడం; సాయుజ్యం -- భక్తుడు భగవంతునిలో లీనమైనా ఆయన కంటే వేరుగా ఉంటూనే ఆయన ఆనందంలో పాలుపంచు కోవటం. జగత్తు మాయా మాత్రమే. జీవితం ప్రత్యక్ష ప్రామాణికమే. పరమాత్మ సర్వస్వతంత్రుడు, జీవాత్మ అస్వతంత్రుడు. జీవోత్తముడు ఆచార్యుడు. ధర్మమార్గంలో, ఆచార్యుల అనుగ్రహం సంపాదించి, అర్థవైన ఆనందాన్ని అనుభవించమని ఆయన చెప్పిన సూక్తి ముక్తావళి మధ్వులకు శిరోధార్యం. మధ్వాచార్య ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి, ద్వైతమత విస్తృత ప్రచారం గావించి, వైష్ణవ మత వ్యాప్తికి, ప్రధానంగా కృష్ణభక్తి వ్యాప్తికి మధ్వమతం ద్వారా ఇతోధికంగా కృషి సల్పారు. భీమసేనుని అవతారమని భావించే ఆయన వృకోదరత్వాన్ని పలుమార్లు ప్రదర్శించి, విష్ణు మంగళ గ్రామాన 200 అరటి పళ్ళను ఆరగింప ప్రార్థితులై అలవోకగా తినివేశారు. ఇషుపాతమనే మరో గ్రామంలో 1000 అరటి పళ్ళు తెచ్చి ఇవ్వగా, అన్నింటినీ ఒకే ఊపులో ఆరగించారు. అడవి మార్గాన సంచరిస్తుండగా, పొదలనుండి వచ్చి, శిష్యుని మీద దూకిన పులిని ఒకే గుద్దుతో హత మార్చారు. కడూరా మండలంలోని ముద్ర గ్రామ సమీప తుంగభద్రా నదీ తీరాన అంబు తీర్థమనే ప్రదేశాన ఒడ్డునుండి నది లోనికి అడ్డంగా పడి ఉన్న పెద్ద బండరాయిని చూసి, విషయం కనుగొని, అవలీలగా ఒక్క చేతితో ఎత్తి అనుకున్న స్థలంలో అనువు పరిచారు. ఆయన అతిలోక బల సామర్థ్యానికి నిదర్శనంగా, ఆ బండ మీద (శ్రీ మధ్వాచార్యైరేక హస్తేన ఆనీయ స్థాపిత శిలా"అనే అక్షరాలు చెక్కబడినవై ఉన్నాయి. తమ 79వ ఏట క్రీ.శ.1817లో మాఘశుక్ల నవమి నాడు శిష్య సమేతులై బదరీ నారాయణుని దర్శించి, ఉత్తర బదరిని ఒంటరిగా చేరి, వ్యాస భగవానుని కైంకర్యాలలో నిమగ్నమైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# సాటిలేని మేటి... విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి

## - జనవరి 27...విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి జయంతి



ఆయన కంఠస్వరం సుమధురమైంది. స్వచ్ఛమైన ఉచ్చారణ ఆయన కంఠంలో ఒదిగి పోయింది. వేదవాఙ్మయ ఔన్నత్యాన్ని సుస్వరంగా , లయబద్ధంగా విశ్వానికి వ్యక్తీకరించిన సనాతన సాంప్రదాయ ప్రతీక ఆయన. నిత్య ప్రాతః స్మరణం చేసుకోవాల్సిన మహానుభావుడు, మహా పురుషుడు. "వేదం వింటే విధాత సమక్షంలో వినాలి, లేదంటే బ్రహ్మశ్రీ జగన్నాధ ఘనపాఠి నోట వినాలి" అంటూ శ్రీ శ్రీ శ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతులయిన శ్రీ మదభినవ విద్యాతీర్థస్వామి జగద్గురువులచే ప్రశంసింప బడిన కారణ జన్ములు. ఆయనే విద్యా వాచస్పతి, ఘనాలంకార, ఘనపాఠి చక్రవర్తి, వేద సమ్రాట్, విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి. ప్రముఖ వేద పండితులైన విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి... బ్రహ్మశ్రీ సుబ్బావధానులు, శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు విశాఖపట్నం జిల్లా, చోడవరం తాలూకా, చిన్ననందిపల్లి అగ్రహారంలో సౌమ్య పుష్య బహుళ విదియనాడు (జనవరి 27, 1910) జన్మించారు. రాజోలు సమీపంలోని నరేంద్ర పురంలో బ్రహ్మశ్రీ రాణి సుబ్బావధానులు దగ్గర కూడా కొంతకాలం శిష్యరికం చేసారు. ఆయన వేదం చెబుతుంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించేదని పలువురి ప్రశంసలు అందుకున్నారు. పిన్నవయస్సులోనే ఆదిభట్ల నారాయణదాసు దగ్గర లయబద్ధంగా వేదస్వస్తి చెప్పి, ప్రశంసలు అందుకున్నారు. ఎక్కడైనా వేదసభలు జరుగుతుంటే అందరితో కలసి జగన్నాధ ఘనపాఠి వేదస్వస్తి చెప్పేవారు. అక్కడున్న వేద పండితులంతా కనీసం ఒక ఘనా పనసైనా చెప్పాలని పట్టుబట్టేవారు. భారత తొలి రాష్ట్రపతి డా.బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా 1961 జూలై 2న "విద్యా వాచస్పతి" పురస్కారం అందుకున్న ఘనపాఠి. అలా ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆనాటి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డా జాకీర్ హుస్సేన్, వి. వి. గిరి, డా. శంకర్ దయాళ్ శర్మ, నాటి ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, పి. వి. నరసింహారావు అలాగే డా. కె.ఎల్.రావు వంటి ప్రముఖుల చేత సత్కారాలు పొందారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థులవారు "ఘనాలంకార" బిరుదుతో సత్కరించగా, శ్రీ శ్రీ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి చేతుల మీదుగా "ఘనపాఠి చక్రవర్తి" బిరుదుతో సన్మానం అందు కున్నారు. విజయ నగరం వేద పరిషత్ "వేద సమ్రాట్" బిరుదుతో సత్కారం చేయగా, సువర్ణ పతకంతో శృంగేరి శారదా పీఠాధిపతులు, సువర్ణ హారంతో కంచి కామకోటి పీఠాధిపతి సన్మానించారు. సువర్ణ గండ పెండేరంతో విశాఖ వేద శాస్త్ర పరిషత్ సత్కరించింది. రాజమహేంద్రవర పుర వాసులు 1964లో జగన్నాథ ఘనపాఠికి సువర్ణ ఘంటా కంకణ సన్మానం చేసారు. 1970లో పద్మ భూషణ్ ఉప్పులూరి గణపతి శాస్త్రి ఆధ్వర్యాన ఘనపాఠి షష్టిపూర్తి మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. 1975లో రాష్ట్ర ప్రభుత్వం నుండి "పండిత పురస్కారం" అందుకున్నారు. శ్రీ రామభక్త గానసభ ఆధ్వర్యాన బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠికి "కనకాభిషేకం" చేయగా, 1991 జనవరి 2న రాజమండ్రి పురపాలక సంఘం పౌర సన్మానం చేసి, గౌరవించింది. అదేరోజు ఘనపాఠికి "సహస్ర చంద్ర దర్శన మహోత్సవం" పురవాసులు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ లో నిర్వహించిన ప్రపంచ తొలి తెలుగు మహాసభలు జగన్నాధ ఘనపాఠి "వేదస్వస్తి" తోనే శుభారంభ మయ్యాయి. ఇందిరాగాంధి ప్రధానిగా వుండగా, పెద జీయర్ స్వామి డిల్లీలో నిర్వహించిన అఖిల వేదశాఖా సమ్మేళనంలో ఘనపాఠి పాల్గొని, లయబద్ధమైన వేద స్వస్తితో అందరి ప్రశంసలు పొందారు. రాజమండ్రి వేదశాస్త్ర పరిషత్ తో పాటు, విజయవాడ, టి టి డి వేద శాస్త్ర పరిషత్ లు నిర్వహించే పరీక్షలకు "పరీక్షాధికారి"గా వ్యవహరించారు . కాశీలో శ్రీ రాజేశ్వర శాస్త్రి ద్రవిడ అధ్యక్షతన జరిగిన వేద సభలలో పాల్గొని, వేద వాఙ్మయంలో ఓలలాడించారు. ఇక 1958 ఫిబ్రవరిలో శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఘన స్వస్తి ప్రారంభించి, 40 రోజుల పాటు నిర్వహించడవే కాక, పండితులందరికీ సువర్ణ కుండలాలతో సత్కారం చేయించిన ఘనత ఘనపాఠి వారిదే. బ్రహ్మశ్రీలు గుళ్ళపల్లి వెంకట నారాయణ ఘనపాఠి, చిట్టి సుబ్రహ్మణ్య ఘనపాఠి , శ్రీపాద శ్రీరామ నృసింహ ఘనపాఠి , ఈమని రామకృష్ణ ఘనపాఠి వంటి ఉద్దండులతో ఈ ఘన స్వస్తిలో జగన్నాధ ఘనపాఠి పాలుపంచు కున్నారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థుల వారితో కలసి "కాశ్మీర్ యాత్ర" సాగించారు. యావద్భారతదేశంలో పర్యటించి, వేద ప్రచారం గావించిన ఘనపాఠి వారికి ఎందఱో శిష్యులున్నారు. బ్రహ్మశ్రీలు గోలి కొండావధానులు, అయ్యల సోమయాజుల సుబ్బావధానులు, యడవల్లి రమణావధానులు వంటి వారంతా శిష్యగణంలో వారే. టిటిడి "వేద పారాయణ స్కీం పర్యవేక్షకుని"గా కొంతకాలం సేవలందించిన ఘనపాఠి 1994 ఆగస్టు27 శ్రావణ బహుళ షష్టి శనివారం తెల్లవారు ఝూమున మహాభి నిష్క్రమణం (మరణం) చేసారు. 2010, జనవరి 2వ తేదిన ఘనాలంకార బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి "శత జయంతి సభ" రాజమహేంద్రవరం టిటిడి కల్యాణ మంటపంలో నిర్వహించారు. ఆయన పేరిట వేద శాస్త్ర పరిషత్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతియేటా కృష్ణాష్టమికి వేదసభ నిర్వహించి, పండిత సత్కారం చేస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**







# అమరావతిలో గణతంత్ర వేడుకలు.. ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

అమరావతిలోని నేలపాడు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్? జెండా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రదర్శించిన శకటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# బడ్జెట్ విషయంలో అరుణ్ జైట్లీ నిర్ణయం గొప్పదేనా..?

ఫిబ్రవరి 1 అంటే దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక మైలురాయి. కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు. 2026, ఫిబ్రవరి 1 కోసం దేశం ఉత్కంఠతగా ఎదురుచూస్తోంది. ఎందుకంటే వరుసగా తొమ్మిదవసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. అయితే ఈ బడ్జెట్?లకు సంబంధించిన ఒక కీలక చరిత్రను తిరిగి గుర్తు చేసుకోవాల్సిన సమయం ఇదే. భారత బడ్జెట్ వ్యవస్థలో 92 ఏళ్లుగా కొనసాగిన ఒక సంప్రదాయానికి ముగింపు పలికిన ఘట్టం ఇదే. ఒకప్పుడు బడ్జెట్ అంటే రెండు రోజుల ఉత్సవం లాంటిది. మొదటి రోజు రైల్వే బడ్జెట్, రెండో రోజు సాధారణ బడ్జెట్. ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు అందరూ ప్రత్యేకంగా రైల్వే బడ్జెట్ కోసం ఎదురుచూసేవారు. టికెట్ ధరలు పెరుగుతాయా? తగ్గుతాయా? కొత్త రైళ్లు, కొత్త లైన్లు, స్టేషన్ అభివృద్ధులు ఏవి వస్తాయన్న ఆసక్తి దేశవ్యాప్తంగా ఉండేది. రైల్వే బడ్జెట్ అనేది కేవలం ఆర్థిక ప్రకటన మాత్రమే కాదు.. సామాన్యుడి నిత్యజీవితానికి నేరుగా సంబంధించిన అంశం.

**బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయం..** ఈ సంప్రదాయం 1924లో మొదలైంది. బ్రిటిష్ పాలన కాలంలో రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండేది. భారీ పెట్టుబడులు, విస్తృత నెట్?వర్క్, లక్షలాది ఉద్యోగాలు–ఇవన్నీ రైల్వే చుట్టూనే తిరిగేవి. అందుకే అప్పట్లో రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ అవసరమని భావించారు. ఆ రోజు నుంచి స్వాతంత్ర్యం తర్వాత అదే పద్ధతి కొనసాగింది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా రైల్వే బడ్జెట్ సంప్రదాయం మాత్రం అలాగే నిలిచింది. కానీ కాలం మారింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపం మారింది. రైల్వే ఒక్కటే అభివృద్ధికి కేంద్రం అన్న భావన క్రమంగా తగ్గింది. రోడ్లు, విమానయానం, ఐటీ, పరిశ్రమలు వంటి అనేక రంగాలు సమానంగా ఎదిగాయి. ఈ నేపథ్యంలో రైల్వేను ప్రత్యేకంగా వేరు చేసి చూడాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్న మొదలైంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చర్చ మరింత బలపడింది.

**2017 రెండు బడ్జెట్లు విలీనం..** 2017లో ఆ చర్చ ఓ కీలక నిర్ణయంగా మారింది. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయాలని కేంద్రం నిర్ణయించింది. దాంతో 92 ఏళ్ల చరిత్రకు తెరపడిం ది. ఆ ఏడాది పార్లమెంట్?లో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఒకే ప్రసంగంలో దేశ ఆర్థిక అంశాలతో పాటు రైల్వే ప్రణాళికలను కూడా ప్రకటించారు. ఇది భారత బడ్జెట్ చరిత్రలో ఒక మలుపు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ ఉద్దేశాలు మాత్రమే కాదు, పరిపాలనా సౌలభ్యం కూడా ఉంది. నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు ఈ మార్పు జరిగింది. రైల్వే కూడా దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక భాగమే కాబట్టి, దాన్ని వేరుగా చూడడం వల్ల లాభం లేదన్నది వారి వాదన. రెండు బడ్జెట్?ల వల్ల విధానాల్లో గందరగోళం, వనరుల కేటాయింపులో సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది.


**భిన్నమైన అభిప్రాయాలు..** అరుణ్ జైట్లీ తీసుకున్న ఈ నిర్ణయం అప్పట్లో మిశ్రమ స్పందన తెచ్చుకుంది. సంప్రదాయాన్ని కోల్పోయామనే భావన కొందరిలో కనిపించగా, సమగ్ర ఆర్థిక దృష్టికోణానికి ఇది సరైన అడుగని మరికొందరు ప్రశంసించారు. కాలక్రమేణా ఈ మార్పు సాధారణమైపోయింది. ఇప్పుడు కొత్త తరం బడ్జెట్ అనగానే ఒకే రోజు, ఒకే ప్రసంగం అనే ఆలోచనకు అలవాటు పడింది. ఈ నేపథ్యంలో చూస్తే, అరుణ్ జైట్లీ చేసిన ఈ నిర్ణయం కేవలం ఒక సంప్రదాయానికి ముగింపు కాదు. అది భారత ఆర్థిక పాలనలో మారుతున్న దృక్పథానికి ప్రతీక. పాత పద్ధతులకు గౌరవం ఇస్తూనే, కాలానికి అనుగుణంగా మారాల్సిన అవసరాన్ని గుర్తించిన ఘట్టంగా ఇది చరిత్రలో నిలిచిపోయింది.

# తెలంగాణ తొలి తరం ఉద్యమ కారుడు కేశవరావు జాదవ్ - జనవరి 27... కేశవరావు జాదవ్ జయంతి



కేశవరావు జాదవ్ (జనవరి 27, 1933 - జూన్ 16, 2018) తెలంగా ణ ప్రత్యేక రాష్ట్ర తొలి ప్రతిపాద కులలో ఒకరైన ప్రముఖ సీనియర్ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కేశవ రావు జాదవ్. తెలంగాణ సాయుధ పోరాటం, ముల్కీ ఉద్యమం, జై తెలంగాణ పోరాటంతో పాటు తెలంగాణ తొలి, మలి దశ ఉద్య మాలలో చురుగ్గా పాల్గొన్న నిఖార్సయిన నాయకుడు. తొలి తరం తెలంగాణ ఉద్యమ కారుని గా, అణగారిన వర్గాల పక్షపాతిగా, పౌరహక్కుల సంఘం నేతగా గుర్తింపు పొందాడు. పత్రికా రచయితగా, సంపాదకునిగా, చరిత్రకారుని గా, కవిగా, హక్కుల ఉద్యమకారునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా, 'లోహియా విచార్ మంచ్' స్థాపకు నిగా, 'సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి' స్థాపకునిగా, సోషలి స్టు ఉద్యమ నాయకునిగా ఆయన కృషి, పట్టుదల, అకుంఠిత కార్య దీక్ష, రాజీలేని పోరాట పటిమ మరవ లేనివి. కేశవరావు జాదవ్ 1933, జనవరి 27న శంకర్?రావు, అమృత దంపతులకు హైదరాబాదు పాత బస్తీ లోని హుస్సేనీ ఆలంలో జన్మించాడు. ఎమర్జెన్సీలో హైదరాబాద్?లో మొట్ట మొదటి అరెస్టు జాదవ్? దే కావడం గమనార్హం. 1952 నాన్? ముల్కీ గో బ్యాక్? ఉద్యమాన్ని నిర్వహించిన వారిలో ప్రముఖుడైన కేశవరావు 1975 ఎమర్జెన్సీ సమయంలో 18 నెలలపాటు జైలు జీవితాన్ని అనుభవించాడు. తెలం గాణ పోరాటంలో 1960, 70 దశకా ల్లో విశేషమైన పాత్ర పోషించిన ఆయన, తెలంగాణ ప్రజలకు జరిగి న అన్యాయాన్ని ఎత్తి చూపుతూ, ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను సంఘటితం చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ స్థాపించాడు. ఒలింపస్' అనే పత్రికను తెలంగాణ ఉద్యమానికి, విద్యార్థుల కార్యక్రమాలకు బాసటగా నిలుస్తూ వెలువరిం చాడు. 1969 ఉద్యమంలో క్రియా శీలకంగా పని చేశాడు. 1952 ముల్కీ ఉద్యమం నుంచి పోరాటం మొదలై, ఉపాధ్యాయ ఉద్యమా లలో భాగస్వామి అయినాడు. 2006లో తెలంగాణ జన ఐక్య కార్యాచరణ సమితి, 2008లో తెలంగాణ జన పరిషత్?లో కీలక పాత్ర పోషించాడు. టు వర్ల్స్? మ్యాన్? కైండ్? (ఇంగ్లీషు), యువ పోరాటం (హిందీ) పత్రికలను నడి పాడు. భాషా సమస్య, మార్క్స్– గాంధీ– సోషలిజం (ఇంగ్లిష్), లోహి యా ఇన్ పార్లమెంట్ పుస్తకాలను వెలువరిం చాడు. నక్సల్స్? కు, ప్రభు త్వానికి మధ్య జరిగిన చర్చలలో కీలక భూమిక పోషించాడు. అట్ట డుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్?కు కేశవరావు నాయ కత్వం వహించాడు. తెలంగాణ మలి దశ ఉద్యమం లోనూ జేఏసీ ద్వారా జయశంకర్?, కోదండ రామ్?తో కలిసి కేశవరావు జాదవ్? పని చేశాడు. ఆయన పౌరహక్కుల సంఘం అధ్యక్షునిగా, తెలంగాణ జన పరిషత్? కన్వీనర్?గా బాధ్యత లు నిర్వర్తించాడు. సోషలిస్టు నాయకుడు లోహియా అనుచరు డిగా జాదవ్?కు గుర్తింపు ఉంది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీషు విభాగంలో ప్రొఫెసర్?గా పనిచేసి పదవీ విరమణ చేసిన కేశవరావు జాదవ్ ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశాడు. తెలంగాణ ప్రజలకు జరిగిన సవతి తల్లి ప్రేమను ఎదిరించాడు. నిరసించాడు. ఒకనాడు నైజాం ఏలుబడిలో ప్రాంతీయులకు ఇంగ్లీష్? భాష రాదని ఇక్కడ ఉద్యోగాలు చేయడానికి మద్రాసీ, బెంగాలీ, ఉత్తర భారతీయులను వేల సంఖ్యలో తీసుకువచ్చి ఉద్యోగాలు ఇవ్వడం, ఈ తతంగం ఆంధ్రప్రదేశ్? ఏర్పడ్డాక కూడా కొనసాగిన నేప థ్యంలో... కేశవ రావు తన నిరసన గళాన్ని ఎత్తి వినిపించాడు. "మొద టి భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్?లో ప్రజలకు తెలుగు అర్థమవు తుందని, తెలుగు రాయ గలరనీ, చదవ గలరనీ, అట్లాంట ప్పుడు అడ్మినిస్ట్రేషన్? ఇంగ్లీష్?లో ఎందుకు సాగాలనీ? అంతా ఇంగ్లీష్? లోనే సాగాలి అనుకున్నప్పుడు భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యం ఏమిటని ప్రశ్నించా డు. రమీజాబీ ఉదంతానికి నిరసన గా ఉద్యమాలు నిర్వహించాడు. 1968 నుంచి చనిపోయే నాటి వరకూ తెలంగాణ ఉద్యమంతో మమేకమయినాడు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా జరగాల్సిన పనుల గురించి గొంతు వినిపిస్తూనే ఉన్నాడు. చెన్నారెడ్డి లాంటి నాయకులతో విభేదించాడు. చెన్నారెడ్డికి పోటీగా 'సంపూర్ణ తెలంగాణ ప్రజా సమితి' అనే పార్టీని స్థాపించిన వారిలో జాదవ్? కూడా ఒకరు. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా, పీయూసీఎల్? జాతీయ కార్యవర్గ సభ్యునిగా, పౌర హక్కుల సంఘం అధ్యక్షునిగా, తెలంగాణ జనపరిషత్? కన్వీనర్? గా, సోషలిస్టు నాయకుడు లోహియా అనుచరు డిగా గుర్తింపు పొందాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కేశవరావు 2018, జూన్ 16న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి పోతుకూచి - జనవరి 27...పోతుకూచి సాంబశివరావు జయంతి



పోతుకూచి సాంబశివరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. పద్య వచన గేయ కవిగా, రచయితగా, న్యాయవాదిగా, అనువాదకునిగా, పత్రికా రచయితగా, నటునిగా, నాటక కర్తగా, లఘు కవితా ప్రక్రియ ప్రారంభకునిగా, సాహితీ సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా, మహా సభల నిర్వాహకునిగా, జర్నలిస్టుగా, సంపాదకునిగా...ఇలా చెప్పుకుంటూ పోతే...అసమాన ప్రతిభ కనబరిచి, బహుముఖీన, అగణిత సేవలు అందించిన ప్రతిభా శాలి ఆయన. తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు గ్రామంలో పోతుకూచి నరసింహమూర్తి, సూరమ్మ దంపతులకు 1927, జనవరి 27 వ తేదీన జన్మించాడు. ప్రాథమిక విద్య కోటిపల్లి, ఆలమూరు గ్రామాలలో, ఉన్నత పాఠశాల విద్య రామచంద్ర పురంలో, కళాశాల విద్య కాకినాడలో చదివాడు. హైదరాబాదులో ఎల్.ఎల్.బి. చదివి న్యాయవాదిగా వృత్తిని కొనసాగించాడు. కథా రచయితగా దాదాపు 350 కథలు వ్రాశాడు. అయన కథలు ఆంధ్రపత్రిక, కిన్నెర, యువ, ఆంధ్రప్రభ, పుస్తకం, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, అనామిక, చిత్రగుప్త, భారతి, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలలో ప్రచురింప బడ్డాయి. ఈ కథలు సాంబశివరావు కథలు (6 సంపుటాలు), శేఖరం కథలు, ఏడుప్రశ్నలు, కొత్త విలువల బ్రతుకు, పోతుకూచి కథలు, ఎదురు ప్రశ్నలు, నవకథంబం, మందారాలు, విక్రమ, వేదప్రియ, హైదరాబాదులో, బ్రతుకుల పతనం పేర్లతో పుస్తక రూపంలో వెలువడ్డాయి. అయన కథలు హిందీ, కన్నడ, తమిళ, రష్యన్, జర్మనీ, ఆంగ్ల భాషల్లోకి అనువదించ బడ్డాయి. ఇతని కథలపై చలం ప్రభావం కనిపిస్తుంది. అయన ఐదు నవలలు వ్రాశాడు. "అన్వేషణ" నవలకు మద్రాసు తెలుగు భాషాసమితి నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఆధునికాంధ్రుల సాంఘిక జీవితాన్ని ఈ నవల చక్కగా చిత్రించింది. దీనిని మద్రాసు విశ్వవిద్యాలయం బి.ఎ.లో "ఉపవాచకం"గా నిర్ణయించింది. "ఉదయ కిరణాలు" నవల 1956లో ఆంధ్ర సచిత్రవార పత్రిక నడిపిన పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ నవల 1967లో రష్యన్ భాషలోకి అనువదించ బడింది. ఏడురోజుల మజిలీ శృంగార రసప్రధానమైన నవల. చలమయ్య షష్టిపూర్తి, నీరజ ఆయన ఇతర నవలలు. పోతుకూచి సాంబశివరావు స్వయంగా నటుడు. నాటకకర్త కూడా. అయన వ్రాసిన హంతకులు నాటకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీచే ఉత్తమ నాటకంగా ఎంపిక కాబడింది. "పల్లె కదిలింది" నాటకం ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించ బడింది. దొంగ–దొర, ఇదీ తంతు, ఏడు సున్నాలు, ప్రతి ధ్వనులు, పెళ్ళి పిలుపు, రెండు నాలికలు, అద్దెకొంపలో ఒక నెల, ఒన్ టూ త్రీ ఫోర్, ఏం ప్రేమలో ఏం గొడవలో, అంతరించే అంతరాలు, దీన్ దయాళ్?గారి దేవుడిలో, సరిహద్దుల్లో, చుట్టాల రభస, అంత్య క్రియలు మొదలైనవి ఇతడు వ్రాసిన ప్రసిద్ధమైన నాటకాలు/నాటికలలో కొన్ని. ప్రతిధ్వనులు అనే నాటికల సంపుటి ప్రచురించాడు. పద్యకవిగా, వచనకవిగా, గేయకవిగా ప్రసిద్ధుడైనాడు. మొదటి పద్య రచన కాలేజీ పోటీలలో బహుమతి గెలుచుకొంది. రాసి–సిరా, అనురాగం - అను - రాగం, సామ్బశివానందలహరి, పోతుకూచీయం, శిఖరాలు, అగ్నినాదాలు, చైతన్య కిరణాలు మొదలైన కవితా సంపుటాలు పదికి పైగా వెలువరించాడు. అనేక కవితా సంకలానాల్లో, కవి సమ్మేళనాల్లో ఆయన పాల్గొన్నాడు. అనేక పత్రికల్లో కవితలు వెలువడ్డాయి. ఇతర భాషా సాహిత్య కవితలను తెలుగులోనికి అనువాదం చేశాడు. చుక్కలు అన్న నూతన "లఘు కవితా ప్రక్రియ"ను ప్రారంభించిన గొప్పతనం ఆయనదే. అనువాదకుడిగా గొప్ప కృషి చేశాడు. ఆలిండియా రేడియో నిర్వహించిన "జాతీయ కవి సమ్మేళనం", గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన కవి సమ్మేళనాలలోని ఆంగ్ల కవితలు, కొంకణి, కన్నడ, ఒరియా, మరాఠి, హిందీ, నేపాలీ కవితలు అనేకం తెలుగులోకి అనువదించాడు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన "ఆలిండియా అనువాదకుల వర్క్‌షాప్"లో ప్రముఖ పాత్ర వహించాడు. దక్షిణ భారత భాషలకు సంబంధించి సాహిత్య అకాడమీ నిర్వహించిన అనువాదకుల వర్క్?షాప్?లలో కూడా పోతుకూచి ప్రముఖంగా నిలిచాడు. అమెరికా రీజనల్ ఆఫీస్ (మద్రాస్?) వారికి సంబంధించిన 'వాట్? డూ యు నో అబౌట్? లేబర్?' అన్న పుస్తకాన్ని తెలుగులోనికి అనువాదం చేశాడు. నేషనల్? బుక్?ట్రస్ట్? వారి ఆంగ్ల బాల సాహిత్యాన్ని ఎక్కువ శాతం మేరకు తెలుగు లోకి అనువాదం చేసిన ఘనత ఆయనదే. కన్నడ రచయిత సి.కె.నాగరాజారావు రాసిన ప్రముఖ కన్నడ నాటకం 'సంకోలు బసవన్న' కూడా ఆంధ్రీకరించాడు. హిందీ భాషలో భీమసేన్? నిర్మల్? వ్రాసిన 'హిందీకి– అచ్ఛీ– కహా నియా'కు అనువాదం వెలువరించాడు. వచన కవితా రీతులను అనువాదాలతో సహా 1977లో ప్రచురించాడు. సాంబశివరావు కార్యక్రమాల నిర్వాహకుని గా పేరు తెచ్చుకున్నాడు. హైదరాబాదు సాహిత్య సంస్థ నిర్మాణ దక్షుడిగానే కాకుండా "నవ్య సాహితీ సమితి, ఆంధ్ర విశ్వసాహితి" అనే సంస్థలను నెల కొల్పాడు. "అఖిల భారత తెలుగు రచయితల మహాసభ"లను తొలిసారిగా 1960లో హైదరాబాదులో, 1963లో రాజమండ్రిలోన, 1967లో తిరుపతి, 1969,1971లలో తిరిగి హైదరాబాదులోను ఘనంగా నిర్వహించాడు. 1965లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలు హైదరాబాదులో నిర్వహించాడు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు కార్యదర్శిగా పనిచేసి ఆసంస్థ వజ్రోత్సవాలు విజయ వంతంగా నడిపాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులలో ఒకడిగా ఉన్నాడు. ఇతనికి ఇతర సాహిత్య సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ సభ్యుడిగా, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం సలహా సంఘ సభ్యుడిగా, ఆంధ్ర మహిళాసభ సాహిత్య నిర్వాహక మండలిలో సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా సంఘ సభ్యుడిగా సేవలను అందించాడు. 1959లో బరోడాలో జరిగిన అఖిల భారత రచయితల మహాసభలలో పాల్గొన్నాడు. 1961లో మద్రాసులో యునెస్కో ఏర్పాటు చేసిన సదస్సులో దక్షిణ భారతదేశం తరఫున పాల్గొన్నాడు. మారిషస్ దీవులలోని ఆంధ్రుల గురించి తెలుసు కోవడానికి, వారితో సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పడానికి మారిషస్ సందర్శించాడు. సంపాదకునిగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర వేశాడు. విశ్వ రచన, విశ్వ, యూనిలిట్ మొదలైన పత్రికలను నడిపాడు. యువ కవులను, రచయితలను ప్రోత్సహించాడు. దక్కన్? క్రానికల్ ఆంగ్ల దినపత్రికలో 'ది తెలుగు వరల్డ్' అనే శీర్షికతో తెలుగు సంస్కృతి సాహిత్యాలపై అనేక వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రతిక (దినపత్రిక) లో 'న్యాయం', 'చట్టం' గురించి సామాన్యులకు అర్థమయ్యేలా అందరికీ న్యాయం అనే శీర్షికతో పలు వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ ప్రచురించే నాట్యకళ మాస పత్రికకు సహాయ సంపాదకత్వం వహించాడు. ఏ.పి.టైమ్స్? ఆంగ్ల పత్రికలో దాదాపు సంవత్సరం పైగా వివిధ సాహిత్య విషయాలు, సభలు, సమావేశాలు గురించి రిపోర్టింగ్ చేశాడు. 'సిటిజన్స్ ఈవినింగ్' అనే పత్రిక ద్వారా వారం వారం జ్యోతిష ఫలితాలు ఆంగ్లంలో ప్రచురించాడు. అనేక సాహిత్య సంస్థలు ఆయన కృషిని గుర్తించి సత్కరించాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి కళాప్రపూర్ణ (1993), అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (భూపాల్) నుంచి సరస్వతి సమ్మాన్ పురస్కారం, భారతీయ లేఖక్ నికాయ్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, పోలిశెట్టి పర్వతరాజు స్మారక అవార్డు, జూలూరి నాగరాజరావు స్మారక అవార్డు తదితరాలు పొందారు. సాహితీ చైతన్య, సాహితీ భీష్మ, సాహితీ చైతన్య సంవర్ధక,విశ్వ ఆంధ్రా సంధాత, యువజన మిత్ర, కళారత్న మొదలైన బిరుదులు సొంతం చేసుకున్న ప్రతిభా శాలి. నిత్య సాహిత్య కార్యశీలి అలరారిన పోతుకూచి సాంబశివరావు తన 91వ యేట 2017, ఆగష్టు 6వ తేదీన మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# పిలిస్తే పలికే దేవుడు...హంసల దీవి శ్రీ వేణుగోపాలుడు - మాఘ శుద్ధ నవమి నుండి ... హంసల దీవి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా హంసల దీవిలో వెలసిన శ్రీవేణు గోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా మాఘ శుద్ధ నవమి నుండి బహుళ పాడ్యమి వరకు నిర్వహిస్తారు. అందులో భాగంగా స్వామివారి కళ్యాణోత్సవం మాఘ పూర్ణిమ ఫిబ్రవరి 1న ఘనంగా నిర్వహిస్తారు. కృష్ణానది సముద్రంలో కలిసే పవిత్ర సంగమం ప్రదేశం హంసల దీవి. దాదాపు వెయ్యేళ్ల క్రితం నిర్మించిన కృష్ణా జిల్లా కోడూరు మండలం హంసల దీవి గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి నిత్య పూజలందుకుంటు, భక్తులను అనుగ్రహిస్తున్న వేణు గోపాల స్వామి దేవాలయం ప్రత్యేకతను సంతరించుకుంది. వేణుగోపాల స్వామికి నెలవై, పవిత్రమైన పుణ్య క్షేత్రంగా, పవిత్ర స్థలంగా భావించ బడుతున్న ఆలయాన్ని దగ్గరలో ఉన్న సాగరంలో కృష్ణా నది క్షేత్రంలో స్నానం ఆచరించి న అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించు కుంటారు. హంసల దీవికి సంబంధించి ఓ పురాణ కథనం ప్రచారంలో ఉంది. పాపులకు సంబంధిం చిన పాపాలను ప్రక్షాళన చేస్తున్న కారణంగా గంగానది మలినమై పోయి, తన దుస్థితిని శ్రీహరికి విన్నవించు కోగా, విష్ణుమూర్తి గంగాదేవిని కాకి రూపంలో సకల పుణ్య తీర్థాలలో స్నానమాచరించ మనీ, ఏ క్షేత్రంలో తను హంసగా మారుతుందో అది మహోన్న**తమైన దివ్యక్షేత్రమై అలరారుతుందని, హంసగా మారాక తిరిగి ఎప్పటిలానే పవిత్రతతో** ప్రవహించమని వైకుంఠ నాథుడు చెప్పినట్లు పురాణ కథనం. సకల పుణ్య తీరాలలో స్నానం చేస్తూ వెళుతున్న కాకి కృష్ణవేణి సాగర సంగమం చేసే ప్రదేశంలో మునిగి లేవగానే హంసగా మారి పోయింది. అందుకే ఇది హంసల దీవిగా పేరుపొందిం దని స్థలపురాణం ద్వారా తెలుస్తోంది. అద్భుత శిల్పకళకు అద్దం పడుతున్న వేణు గోపాలస్వామి ఆలయాన్ని సముద్రపు ఆటు పోట్లు తట్టుకునే విధంగా నిర్మించారు. శ్రీవేణు గోపాల స్వామి ఆలయాన్ని దేవతలు నిర్మించారని స్థల పురాణం ఆధారం. ఒక్క రాత్రిలోనే నిర్మాణం పూర్తిచేసే సంకల్పం తో, నిర్మాణం చేపట్టి గోపురం నిర్మిస్తుండగా తెల్ల వారడం వలన దేవతలు వెళ్లి పోయా రని, అందుకే గాలిగోపురం కాలేదని చెపుతారు. తరువాత ఇక్కడ అయిదు అంతస్తుల గాలి గోపురం నిర్మించారు. పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే 1977లో అది ప్రారంభించ బడింది. శ్రీవేణుగోపాలస్వామి ఆలయం మౌర్య చక్రవర్తుల పాలనా కాలంలో నిర్మాణం పూర్తయి ఉండవచ్చని చరిత్రకారుల భావన. ఆలయ ముఖ మండప స్తంభాల మీద అనేక శాసనాలు ఉన్నాయి. ఇక్కడ మాఘ పౌర్ణమి నాడు ప్రత్యేకమైన పూజలు, మహోత్సవాలు, అన్నదాన విశ్వక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలోని శ్రీవేణు గోపాల స్వామిని పిలిస్తే పలుకు తాడని భక్తులు విశ్వసిస్తారు. కాకర పర్తి గ్రామంలో బయటపడిన శ్రీవేణుగోపాల స్వామిని హంసల దీవికి తెచ్చి ప్రతిష్ఠించారు. అయితే ప్రపంచంలో ఎక్కడా కనిపించని విధంగా ఈ విగ్రహం నీలమేఘ ఛాయలో ఉండడం విశేషం. దేవాలయ కుడ్యాలపై అందంగా చెక్కిన రామాయణ సంబంధ ఘట్టాలు భక్తులను ఆకట్టు కుంటాయి. కళ్యాణోత్సవం ముందు రోజు ఉదయం స్వామి వారిని శాస్త్రోక్త పద్ధతిలో పెళ్లి కుమారుని చేస్తారు. భారతీ ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెల్ల వారి ఉదయం శ్రీ లక్ష్మమ్మ అమ్మ వారికి కుంకుమ పూజను, రాత్రికి స్వామి వారి కళ్యాణం నిర్వ హిస్తారు. పౌర్ణమినాడు రథోత్సవం మరునాడు చక్రస్నానం ఆదిగా సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ప్రథమ పౌరుల ప్రగతి కార్యాచరణ

కొడిమ్యాల : ఎన్నికల వేళ ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు.. తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.. మాట తప్పకుండా ప్రగతి కార్యాచరణ ప్రారంభించారు.. పంచాయతీల్లో రెండేళ్ల ప్రత్యేకాధికారుల పాలన అనంతరం గత నెలలో నూతన పాలకవర్గాలు కొలువుదీరాయి. మాట ఇచ్చినట్లుగానే కొందరు సర్పంచులు ప్రధాన సమస్యల పరిష్కారానికి కదిలారు.. కొడిమ్యాల మండలానికి చెందిన పలువురు గ్రామ ప్రథమ పౌరులపై స్ఫూర్తిదాయక కథనమిది..

**చిలుకవాగులో తొలగిన దుర్గంధం**

కొడిమ్యాల మండల కేంద్రంలోని చిలుకవాగు కాలువ పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయింది. దోమల బెడద పెరగడంతో పాటు దుర్గంధంతో స్థానిక ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్పంచి గడ్డం జీవన్రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చిలుకవాగులోని పిచ్చిమొక్కలు తొలగించారు. ఆయన చొరవతో ఇరువైపులా శాశ్వతంగా రిటైనింగ్ గోడల నిర్మాణంపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. అలాగే మండల కేంద్రంలోని 11, 13 వార్డుల్లో కొన్నేళ్లుగా నీటి సమస్య తీవ్రం కాగా కొత్త పైపులైన్ వేసి పరిష్కరించారు.



**తీరిన తాగునీటి కష్టాలు**

చెప్యాల గ్రామంలోని ఎర్రకుంట, ప్రభుత్వ పాఠశాల, ఊర చెరువు కొనకట్ట ప్రాంతాల్లో స్థానికులు కొన్నేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో సమస్య మరింత ఎక్కువవుతోంది. ఇటీవల సర్పంచిగా ఎన్నికైన వుట్కూరి శ్రీలత ఈ మూడు ప్రదేశాల్లో బోరుబావులు తవ్వించి సమస్య పరిష్కరించారు.

డబ్బుతిమ్మయ్యపల్లె గ్రామం నుంచి నాచుపల్లి-హిమ్మత్రావుపేట తారు రోడ్డు వరకు మట్టి రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. సీసీ రోడ్డుకు గతంలోనే నిధులు మంజూరైనా పనులు జరగలేదు. సర్పంచి సురకంటి లావణ్య చొరవతో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించడంతో స్థానికుల అవస్థలు తీరాయి.

**పలకరించిన ఆర్టీసీ బస్సు**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. సర్పంచి షాబొద్దీన్ చొరవతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు వేయించారు. కరీంనగర్ నుంచి నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె వరకు వేసిన బస్సును ఇటీవల ఎమ్మెల్యే ప్రారంభించారు.

# పారిశుద్ధ్యంపై పట్టింపు లేదా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న వాహనాలకు ఇంధనం కొరత ఏర్పడింది. గత కొన్ని నెలలుగా తరచూ డీజిల్ లేక నిలిచి పోతుండగా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ట్రాక్టర్లకు మాత్రమే డీజిల్ పోస్తుండగా, మిగతా వాహనాలకు విడతల వారీగా లేదంటే మొత్తమే వదిలేస్తుండటంతో రోజుల తరబడి మూలకు పడుతున్నాయి. దాంతో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా సాగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం కనిపిస్తోంది.

**15 రోజులుగా స్వీపింగ్ బంద్**

నగరంలోని ప్రధాన రహదారులను శుభ్రంగా ఊడ్చేందుకు అయిదు వాహనాలు ఉన్నాయి. ఇందులో రెండు మేడారం జాతరకు పంపించారు. మిగతా మూడు వాహనాలు డీజిల్ లేక గత 15 రోజులుగా నిలిపి వేయడంతో స్వీపింగ్ కూడా బంద్ అయింది. రోజుల తరబడి వాహనాలు వినియోగించుకోకపోతే బ్యాటరీలు పాడయ్యే ప్రమాదముంది. మేడారానికి వెళ్లిన వాహనాలు కూడా మొరాయిస్తున్నట్లు తెలుస్తోంది. చెత్త డబ్బాలు తీసుకెళ్లడానికి వినియోగించే కంప్యాక్టర్ వాహనాలు ఆగిపోయాయి.

**ఎందుకింత జాప్యం**

పారిశుద్ధ్య వాహనాలకు సంబంధించి పెట్రోల్ బంకులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో బంకు యజమానులు పోయడం లేదు. రెండు కూడా ప్రభుత్వ బంకులే అయినా పేరుకుపోతున్న బకాయిలతో కొన్ని వాహనాలకు డీజిల్ పోస్తుండగా, మరి కొన్నింటికి పోయడం లేదు. బిల్లులు తయారు చేసేందుకు, బంకుల దగ్గరికి వెళ్లడం, చెక్కులు తయారు చేసి ఆమోదం తీసుకోవడం వరకు ఒకరికే బాధ్యతలు ఇవ్వడంతో ఆలస్యం జరుగుతున్నట్లు సమాచారం.



**నడవకపోతే బిల్లులు తగ్గినట్లే**

నగరపాలికలోని శానిటేషన్ వాహనాలను సగం మేర నడిపించకుండా ప్రతినెలా పక్కన పెడుతున్నారు. ఆ వాహనాలకు ఇంధనం పోయడం లేదు. వాహనాలు తిరగకపోతే బిల్లులు తగ్గినట్లే. బిల్లులు తగ్గించామనే విషయాన్ని చెప్పుకోవడానికి కొన్ని వాహనాలు నిలిపి వేస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ఇంకేముంది పారిశుద్ధ్య పనులపై ప్రభావం చూపుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

ఒకట్రెండు రోజుల్లో పరిష్కారం

సమస్యను ఒకట్రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఈ విషయంపై పెట్రోల్ బంకుల ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు నగరపాలక తరపున కలెక్టర్కు లేఖ రాయాలని కమిషనర్ ఆదేశించారు.

దిలీప్కుమార్, సహాయ కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# ఎంఎంటీఎస్.. మెట్రో స్టేషన్లను కలిపేలా స్కైవేలు




హైదరాబాద్ : నగరంలో ఎంఎంటీఎస్ సేవలతో ఆర్టీసీ, మెట్రో సేవలను అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా మెట్రోస్టేషన్లు, బస్టాప్లతో అనుసంధానం చేసేందుకు పలు ప్రాంతాల్లో స్కైవేలు నిర్మించేందుకు చర్యలు చేపట్టనుంది. మెట్రో స్టేషన్ నుంచే ఎంఎంటీఎస్ స్టేషన్లలోకి చేరుకునేలా వీటిని ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ఎంఎంటీఎస్ స్టేషన్ల సమీపానికి బస్టాండ్లను తరలించనున్నారు. ఈమేరకు హెచ?ండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్పోర్టు అథారిటీ (ఉమ్టా) పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. సికింద్రాబాద్ నార్త్, సౌత్, బేగంపేట, నాంపల్లి, భరత్నగర్, మలక్పేట, ఖైరతాబాద్లాంటిచోట్ల ఎంఎంటీఎస్, మెట్రోస్టేషన్లు పక్కపక్కనే ఉన్నాయి. ఒకటి, అరచోట తప్ప స్టేషన్లలోకి స్కైవేలు లేవు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఎంఎంటీఎస్, సమీప బస్టాప్లను అనుసంధానం చేసేలా త్వరలో స్కైవేను నిర్మించనున్నారు.

**స్టేషన్లలోకి సులువుగా వెళ్లేలా..**మొత్తం 51 ఎంఎంటీఎస్ స్టేషన్లలో 21 మాత్రమే బస్టాప్లకు కూతవేటు దూరంలో ఉన్నాయి. మిగతావన్నీ దూరంగా ఉండటంతో ప్రయాణికులు వినియోగించుకోవడం లేదు. బస్టాప్లను ఎంఎంటీఎస్ స్టేషన్లకు దగ్గరగా మార్చితే ప్రయాణికులు సులువుగా స్టేషన్లలోకి చేరుకునేలా రోడ్లు, స్కైవాక్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. బస్టాప్లు స్టేషన్ల దగ్గరకు తరలించలేని పరిస్థితి ఉంటే ప్రయాణికులను తరలించేందుకు తక్కువ రుసుంతో ప్రయాణం సాగించే బ్యాటరీ వెహికల్స్ ఏర్పాటు యోచన ఉందన్నారు.

మొత్తం ఎంఎంటీఎస్ స్టేషన్లు.. 51
బస్టాప్లకు 500 మీటర్ల దూరంలో ఉన్నవి.. 21
500 మీటర్ల నుంచి 1 కి.మీ.లో ఉన్నవి.. 12
కిలోమీటర్ దాటి ఉన్నవి.. 18
నగరంలో ప్రజారవాణా (రోజుకు)
ఆర్టీసీ బస్సుల్లో.. 25 లక్షలు
మెట్రోలో.. 5 లక్షలు
ఎంఎంటీఎస్లో.. 40-50 వేలు
వ్యక్తిగత వాహనాలపై.. 70 లక్షలు

# డ్రైవింగ్ లైసెన్స్ చిరునామా మార్చుకోండిలా




హైదరాబాద్: ఏపీకి చెందిన చాలామంది ఉద్యోగ, వ్యాపారాల రీత్యా హైదరాబాద్లో స్థిరపడ్డారు. గతంలో సొంతూరిలో నివసించినపుడు డ్రైవింగ్ లైసెన్సు(డీఎల్)పై అప్పటి చిరునామాని పొందుపరుస్తారు. ప్రస్తుతం నివసించే చిరునామాతో డీఎల్ తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు చిరునామా మార్పు విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. ప్రస్తుత చిరునామాతో డీఎల్ ఉంటే గుర్తింపు పత్రంగా లైసెన్సు రెన్యువల్కు ఉపయోగపడుతుంది. రవాణా శాఖ పరిధిలోని పౌరసేవలు కేంద్రం ఆన్లైన్ ద్వారా సులభతరం చేసింది. ఇప్పుడు చిరునామా మార్పు సులభమే.

**ఎలా నమోదు చేసుకోవాలి?**

ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ప్రస్తుతం ఉంటున్న చిరునామా ధ్రువీకరణ పత్రాలు (ఆధార్, ఓటర్ ఐడీ, విద్యుత్తు, గ్యాస్ బిల్లులు) అవసరం.వయస్సు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికేట్ (ఫాం 1-ఎ) తప్పనిసరి.

ముందుగా కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ వెబ్సైట్ parivahan.gov.in వెబ్సైట్లోకి వెళ్లాలి.

ఆన్లైన్ సర్వీసెస్లోకి వెళ్లి 'డ్రైవింగ్ లైసెన్స్ రిలేటెడ్ సర్వీసెస్', తర్వాత 'తెలంగాణ' ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి.

అనంతరం 'అప్లై ఛేంజ్ ఆఫ్ అడ్రస్'లోనికి వెళ్లాక.. డీఎల్ నంబరు, పుట్టిన తేదీని పొందుపర్చాలి. 'గెట్ డీఎల్ డిటెయిల్స్'ని ఎంచుకోవాలి. 'ఛేంజ్ ఆఫ్ అడ్రస్' ఆప్షన్ ద్వారా తెలంగాణలో ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా పొందుపరచాలి.

దరఖాస్తు సబ్మిట్ చేసిన తర్వాత నిర్ణీత రుసుము ఆన్లైన్లోనే చెల్లించాలి. అనంతరం దగ్గరలోని ఆర్టీవో కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనకు తేదీని (స్లాట్) బుక్ చేసుకోవాలి.

ఆర్టీవో కార్యాలయానికి వెళ్లినప్పుడు సంబంధిత ఒరిజినల్ పత్రాలను తీసుకెళ్తే.. వాటిని చూసి అధికారులు ఆమోదిస్తారు. అనంతరం ప్రస్తుత చిరునామాతో కూడిన స్మార్ట్కార్డు లైసెన్సు ఇంటికే పోస్టు ద్వారా వస్తుంది.

# కలుషితం కా'నీరు'




హైదరాబాద్ : మహానగరంలో 1.3 కోట్లమందికి తాగునీరు సరఫరా చేస్తున్న జలమండలి నీటి నాణ్యతపై బహుముఖ కార్యాచరణను అమలు చేయనుంది. నగరంలో ఏ ప్రాంతంలోనూ కలుషిత జలాలకు అవకాశం లేకుండా వివిధ చర్యలు చేపట్టనుంది. నగరంలో కలుషితజలాలకు సంబంధించి ఫిర్యాదులు అత్యధికంగా వస్తున్న ప్రాంతాల్లో పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనుంది. నీటి నాణ్యత పరీక్షలు పెంచనుంది. జలమండలి చేయాల్సిన పనులతో పాటు వినియోగదారులు దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన కలిగించనుంది. కలుషిత జలాలను గుర్తించేందుకు ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఏఐ, రోబోటిక్ సాంకేతికతను ఉపయోగిస్తున్న జలమండలి దీన్ని మరింత విస్తృతం చేయనుంది. ఇండోర్ నగరంలో నీటి కాలుష్యం నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. పైపులైన్ల లీకేజీలపై అప్రమత్తంగా వ్యవహరించాలని, మేనేజర్ల నుంచి అన్ని స్థాయిల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**అత్యాధునిక సాంకేతికత**

జలమండలి నీటి సరఫరా కోసం వేసిన పైపులైన్లు 30 ఏళ్లు అంతకంటే పాతవి కావడంతో చాలా చోట్ల పాడై పోయి ఉన్నాయి. రక్షిత మంచినీటిని సరఫరా చేయాల్సిన పైపులైన్లలో మురుగునీరు చేరి సరఫరా కావడం ఇతర రసాయనాలు, వ్యర్థాలు కలవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దెబ్బతిన్న పైపులైన్లను గుర్తించి మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ ద్వారా నీటి పైపుల్లోకి కెమెరా పంపి పైపులైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తిస్తారు. ఆధునిక విధానంతో తక్కువ సమయంలో లీకేజీని గుర్తించడమే కాకుండా లీకేజీ ఎక్కడ ఉందని స్పష్టంగా గుర్తించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. ఆ ప్రాంతంలో దెబ్బతిన్న లేదా పాడైన పైపులను మారుస్తారు.

**నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా**

ప్రమాదకరమైన ఈకోలీ, కోలీఫాం బ్యాక్టీరియాను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను జలమండలి వినియోగిస్తోంది. ఇప్పటికే ఆధునికీకరించిన ఏడు ప్రయోగశాలల్లో 24 గంటల్లో బ్యాక్టీరియాను గుర్తించేలా మెంబ్రేన్ ఫిల్టరేషన్ టెక్నిక్ విధానానికి శ్రీకారం చుట్టింది. టీడీఎస్, పీహెచ్, టర్బిడిటీ, నీటికాఠిన్యం సహా నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షల సంఖ్య పెంచనున్నారు. క్లోరిన్ నిర్దేశించిన పరిమాణంలో ఉండేలా చూస్తారు.

**జీఐ పైపులు మార్చుకోవాలి**

1997కు ముందు తాగునీటి సరఫరాకు జీఐ పైపులు వాడారు. ఈ పైపులు 15 ఏళ్ల తర్వాత వివిధ కారణాలతో పాడైపోయేందుకు అవకాశాలున్నాయి. వాటిని మార్చుకోవడం ద్వారా కలుషిత జలాలకు అవకాశం లేకుండా చేసుకోవచ్చని వినియోగదారులు ఈ అంశంపై దృష్టి సారించాలని అవగాహన కలిగించనున్నారు.

# నలువైపులా వడివడిగా ప్రయాణం

మల్లాపూర్ : రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్హెచ?ఐ) టెండర్లు పిలిచిన నాలుగు మార్గాల్లో మూడు జగిత్యాల కేంద్రంగా వెళ్లనుండటం విశేషం. నిర్మల్-జగిత్యాల మార్గంలో మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. ఏళ్ల తరబడి ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడగా సువిశాలమైన దారులతో పాటు వాహనాల పార్కింగ్కు స్థలాలను కేటాయించనున్నారు. దీంతో ప్రమాదాల నివారణ, సరకు రవాణాలో వేగం పెంచాలనే ఉద్దేశంతో కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది. **అయిదేళ్లలోగా పూర్తయ్యేలా..**ఎన్హెచ?ఐ ప్రాజెక్టు ఎప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీస్(పీఏటీఎస్సీ), పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్య ఎప్రైజల్ కమిటీ(పీపీపీటీఏసీ)లు సైతం ఆమోదం తెలపడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. జగిత్యాల-కరీంనగర్, జగిత్యాల-మంచిర్యాల, జగిత్యాల-ఆర్మూర్, మహబూబ్నగర్-గూడెబల్లూర్ మార్గాల్లో మొత్తం 271 కిలోమీటర్లకు రూ.10,034 కోట్లతో హైవేల నిర్మాణానికి కేంద్రం సిద్ధమవుతోంది. వచ్చే మూడేళ్ల నుంచి అయిదేళ్లలోపు పనులు పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

# ఎప్పుడింకా.. బృహత్ ప్రణాళిక

సిరిసిల్ల : సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో రోజురోజుకూ పెరుగుతున్న పట్టణ జనాభా, వాహనాల రద్దీకి ఇప్పుడున్న రహదారులు సరిపోని పరిస్థితి నెలకొంది. రాబోయే 30 ఏళ్లలో పట్టణాల విస్తరణకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సి ఉంది. దీనికోసం ఈ రెండు పట్టణాలను అమృ 2.0లో ఎంపిక చేశారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం డ్రోన్ను ఉపయోగించి సర్వే చేశారు. భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ప్రణాళికలను రూపొందించింది. రెండు పట్టణాల్లో ఇప్పటికి మూడుసార్లు సమావేశాలు జరిగినా.. ప్రణాళిక అమలుపై ఇంకా స్పష్టత రాలేదు.

**పన్నుల రాబడిపై ప్రభావం**

సిరిసిల్ల పట్టణంలో మాస్టర్ ప్లాన్ కోసం 14 సర్వే నంబర్లలో దాదాపు వంద ఎకరాలను పరిశ్రమల జోన్గా గుర్తించారు. జిల్లా ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతానికి సమీపంలో కలెక్టరేట్ నిర్మాణం జరిగింది. రెండు బాహ్య వలయ రహదారులకు కూడలిగా ఉండటంతో నివాస గృహాలు విస్తరిస్తూ వస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలకు పురపాలికలో దరఖాస్తు చేసుకున్నారు. పరిశ్రమల జోన్ కావడంతో పురపాలిక అనుమతులు ఇవ్వడంలేదు. రాబోయే కొత్త ప్రణాళికలో



పరిశ్రమల జోన్ను పెద్దూరులో ఏర్పాటుకు నిర్ణయించారు.

మాస్టర్ ప్లాన్ రికార్డులన్నీ డిజిటల్లో ఉంటాయి. గృహాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు ఇలా వేటి నిర్మాణాలకైనా పురపాలికల నుంచి అనుమతులు ఇవ్వడంలో పారదర్శకత ఉంటుంది. అమలు జాప్యం జరుగుతుండటంతో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు, వాటి ద్వారా పురపాలికలకు వచ్చే ఆదాయంపై ప్రభావం చూపుతోంది.

**సర్వీసు రహదారులకు మ్యాపింగ్**

సర్వేలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, నివాస, వాణిజ్య సముదాయాలు, ఉద్యానవనాలు, ఆట స్థలాలు, వైకుంఠధామాలు ప్రధాన, అంతర్గత, జాతీయ రహదారులు అనుసంధానం చేసే నెట్వర్క్ వ్యవస్థను చిత్రీకరించారు. పట్టణ కేంద్రాల గుండా వెళ్లే జాతీయ రహదారులకు ఇరువైపులా సర్వీసు రోడ్లను సైతం మ్యాపింగ్ చేశారు. ఈ మొత్తం వివరాలను సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో పట్టణాల డిజిటల్ పటాన్ని తయారు చేశారు. ఈ ప్రణాళిక నివేదికలకు ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉంది. వీటిపై అభ్యంతరాలను సరిచేశాక మార్పులు చేర్పులు చేసి మాస్టర్ ప్లాన్ను అమలు చేస్తారు.

# వందకు పది.. దందా ఇది

నల్గొండ: వడ్డీ వ్యాపారులు.. పేద, మధ్యతరగతి వర్గాల అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకొని అక్రమ వడ్డీ దందాను అడ్డూఅదుపు లేకుండా కొనసాగిస్తున్నారు. సామాన్యుల నడ్డి విరుస్తూ వారి జీవితాలతో ఆటలాడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ వసూలు చేయాల్సి ఉండగా అనధికారికంగా గరిష్ఠంగా 10 శాతానికి మించి విధిస్తున్నారు. గడువులోగా అసలు, వడ్డీ తిరిగివ్వకపోతే చంపేస్తామని, భౌతిక దాడులకు పాల్పడుతామని భయభ్రాంతులకు గురిచేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ఉద్యోగులూ చెలామణి** ప్రభుత్వ ఉపాధ్యాయులు, పోలీసులు, రెవెన్యూ, విద్యుత్తు సంస్థల ఉద్యోగులు సైతం జిల్లాలో వడ్డీ దందాలు చేస్తున్నారు. కొందరు 'పోలీస్? వడ్డీ వ్యాపారులు' ఏకంగా దాదాలుగా మారి దమ్కీలు ఇస్తూ వడ్డీలు తీసుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో మొత్తం 137 ఆటో జనరల్ ఫైనాన్స్ కంపెనీలుండగా.. 165 చిట్స్? సంస్థలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్నీ అనుమతులు తీసుకున్నాయి. ఇవీ కాకుండా అనధికారికంగా కొన్ని వందల మంది ఫైనాన్స్ వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ నిబంధనలు ఉల్లంఘించి వడ్డీలిస్తూ నానా హంగామా చేస్తున్నారు.

వాస్తవానికి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫైనాన్స్? విభాగంలో వ్యాపారులు తమ పేర్లతో రిజిస్ట్రేషన్? చేసుకోవాల్సి ఉంటుంది. ఆ గుర్తింపు పొందితే పేరు, రెవెన్యూ స్టాంప్లతోనే రూపాయి నుంచి రూపాయిన్నర మేరకు వడ్డీలు ఇవ్వాల్సి ఉంటుంది.కానీ అక్రమ ఫైనాన్స్? వ్యాపారులు కిరాణా దుకాణాల్లో, పోస్టాఫీసుల్లో దొరికే ప్రాంసరీ నోట్లు, రెవెన్యూ స్టాంపులను కొనుగోలు చేసి గరిష్ఠంగా రూ.10లతో వడ్డీ తీసుకుంటున్నారు. అప్పు తీసుకున్న వారి వివరాలేవీ లేకుండానే వారి సంతకం తీసుకుని జమానతుదారు, ఫైనాన్స్? వ్యాపారి సంతకాలతో ఒప్పందం కావాల్సిన సొమ్ము అందిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

సైదులు, ఎస్సై, నల్గొండ టూటౌన్

నల్గొండ గొల్లగూడకు చెందిన రావుల సాయి, ఎలక్ట్రికల్? వ్యాపారి నాగరాజులు రూ.24లక్షల అప్పును ప్రకాశం బజార్?కు చెందిన వడ్డీ వ్యాపారి బొడ్డుపల్లి సైదులు నుంచి తీసుకున్నారు. సక్రమంగా చెల్లింకపోవడంతో సైదులు వీరికి ఫోన్?లోనే బెదిరించారు. అందుకు సంబంధించి ఆడియో సాక్ష్యాలు ఉండటంతో సదరు వ్యాపారిపై మోసం, బెదిరింపులకు పాల్పడ్డారనే కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఇంకా ఎవరైనా బాధితులుంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. పోలీస్? సిబ్బంది వడ్డీల దందాలో ఉన్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# ఆ రోడ్లు.. నరకానికి నకళ్లు

ఉట్నూరు: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రాలకు అనుసంధానం చేస్తూ.. గతంలో నిర్మించిన రహదారులు నిర్వహణ లేక గుంతలు పడ్డాయి. ఈ అధ్వాన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారులను బాగు చేయించాల్సిన అవసరం ఉంది.ఏజెన్సీ డివిజన్?లోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూరు, గాదిగూడ, జైనూరు మండలాల్లోని ప్రజల సౌకర్యార్థం ఆదివాసీ గూడేలు, తండాలను కలుపుతూ.. కొన్నిచోట్ల మట్టి, మరికొన్ని చోట్ల బీటీ రహదారులను నిర్మించారు. కొంతకాలం బాగానే ఉన్నా.. ఇప్పుడు బీటీ ఊడిపోయి రోడ్డు అధ్వానంగా మారింది. అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. వాటి నిర్వహణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు భవనాల శాఖ, ఐటీడీఏ, పంచాయతీరాజ్? విభాగాలకు చెందిన ఇంజినీరింగ్? అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..అధ్వానంగా మారిన రహదారుల మరమ్మతులపై ఆర్?అండ్?బీ ఈఈ నర్సయ్యను వివరణ కోరగా.. రోడ్ల సమస్యలను ఇప్పటికే గుర్తించామన్నారు. రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.

చురకలు



# ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం




జగిత్యాల : త్వరలో జరిగే బల్దియా ఎన్నికల పోలింగ్? సజావుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో షెడ్యూలు విడుదల చేయనుండగా జగిత్యాలలో సంబంధిత కార్యక్రమాల అమలుపై దృష్టి సారించారు. కోడ్? అమలు లోకి వచ్చాక చేపట్టాల్సిన చర్యలు, పోలింగ్? నుంచి ఓట్ల లెక్కింపు వరకు విధుల నిర్వహణ కోసం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఎన్నికల సామగ్రి అవసరాలు తదితర అంశాలపై అంచనాకు వచ్చారు.

**మారిన వేదిక**

బల్దియా ఎన్నికల అనంతరం బ్యాలెట్? బాక్సులు భద్రపరచడం, ఎన్నికల షెడ్యూలు మేరకు ఓట్ల లెక్కింపు కోసం ప్రభుత్వ ఎస్?కెఎన్? ఆర్? డిగ్రీ కళాశాలను ఎంపిక చేశారు. గతంలో ఎన్నికలకు ముందు బ్యాలెట్? బాక్సులను శ్రీవివేకానంద మినీ స్టేడియం భవనంలోని విశాలమైన హాలులో భద్రపరచగా, పక్కనే ఉన్న ప్రభుత్వ కళాశాలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా వినియోగించారు. ప్రస్తుతం సభ్యత్వం తీసుకున్న క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతుండటంతో, ప్రత్యామ్నాయంగా ఎస్కెఎన్ఆర్ డిగ్రీ కళాశాలను వినియోగించు కోవాలని నిర్ణయించారు. కళాశాల ఆవరణలోనే డిస్ట్రిబ్యూషన్? కేంద్రానికి అవసరమైన స్థలం, ఓట్ల లెక్కింపునకు అనుకూలంగా విశాలమైన హాళ్లు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ కోసం స్థలం, రక్షణ ఏర్పాట్లకు అనుగుణంగా ప్రహరీ ఉండటంతో ఉన్నతాధికారులు అనుమతినిచ్చినట్లు తెలిసింది.

**179 బ్యాలెట్? బాక్సులు**

జగిత్యాల బల్దియా పరిధిలో మొత్తం 50 వార్డులుండగా, ఎన్నికల నిర్వహణ కోసం 149 పోలింగ్? కేంద్రాలను గుర్తించారు. అదనంగా రిజర్వు కింద మరో 30 కలిపి మొత్తం 179 బ్యాలెట్? బాక్సుల కోసం డీపీవోకు నివేదించారు.

ఈ మేరకు సర్పంచి ఎన్నికల కోసం వినియోగించిన బ్యాలెట్? బాక్సులను వివిధ మండలాల నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ రోజున కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఎన్నికల సామాగ్రి తదితర అవసరాల సమాచారాన్ని ఎన్నికల అధికారులకు సమర్పించారు.

రిటర్నింగ్ అధికారులు 17 మంది, 20 శాతం అదనంగా మరో నలుగురు, ఆర్వోలు 21 మంది, సహాయ ఆర్వోలు 21 మంది, దీంతో పాటు జోనల్ అధికారులు ఆరుగురు, 8 ఫ్లయింగ్? స్క్వాడ్? బృందాలు అవసరమని నివేదించనున్నారు.

స్టాటిస్టిక్? సర్వేలెన్స్? కోసం మరో 8 మంది, పీవోలు 179 మంది, ఓపీవోలు 394 మంది, వెబ్?కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లు కలిపి మరో 30 మంది, బందోబస్తు కోసం పోలింగ్? కేంద్రానికి ముగ్గురు చొప్పున 447 మంది పోలీసులు కావాలని అంచనా వేశారు.

సమస్యాత్మక పోలింగ్? కేంద్రాలు 36

గత అనుభవాలు, తాజా పరిస్థితుల ప్రకారం 36 పోలింగ్? కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇందులో అత్యంత సున్నితమైనవి 22, సున్నితమైనవి 14 ఉన్నాయి. ఎన్నికల రోజున అవాంఛనీయ ఘటలకు తావు లేకుండా ఈ కేంద్రాల వద్ద మరింత భద్రత పెంచేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

## జేబు నింపుకోవడమే జాబు

హైదరాబాద్ : దోమలకు పొగబెట్టమంటే.. ఖజానాకు కన్నమేస్తున్నారు. దోమల నియంత్రణ చర్యల్లో ఉపయోగించేందుకు జీహెచ?ంసీ సరఫరా చేసే డీజిల్, పెట్రోలు, మలాథియాన్, పైరెత్రియం వంటి మందులను నల్లబజారులో విక్రయిస్తున్నారు. జీహెచ?ంసీలోని పలువురు ఎంటమాలజీ అధికారుల అవినీతి బాగోతమిది. రోజూ ఫాగింగ్, ఇతరత్రా కార్యక్రమాలకు కేటాయించే డీజిల్, పెట్రోలు, ఇతర రసాయనాలను 80 శాతం అమ్ముకుంటున్నారు. తాజాగా నాంపల్లి సరాయి పరిధిలో నలుగురు సిబ్బంది 10వేల లీటర్ల మలాథియాన్ను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతూ పోలీసులకు చిక్కారు. రోజూ దోపిడీనే.. పాత జీహెచ?ంసీ పరిధిలో 150 డివిజన్లు, 30 సర్కిళ్లు ఉండగా.. సర్కిల్కు 2 చొప్పున పెద్ద ఫాగింగ్ యంత్రాలు, డివిజన్కు 2 చొప్పున చిన్న యంత్రాలున్నాయి. ఒక్కో చిన్న యంత్రానికి 7 లీటర్ల డీజిల్, ఒక లీటరు పెట్రోలు, అరలీటరు మలాథియన్ రోజూ కేటాయిస్తారు. పెద్ద యంత్రానికి 30 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోలు, 2 లీటర్ల మలాథియన్ కేటాయిస్తారు.

మలాథియాన్ను జోనల్ కార్యాలయాల పరిధిలోని స్టోర్లలో నిల్వ చేస్తారు. డీజిల్, పెట్రోలుకు సీనియర్ ఎంటమాలజిస్టులు కూపన్లు జారీ చేస్తారు. వాటిని చూపి సహాయ ఎంటమాలజిస్టులు ఎంపిక చేసిన పెట్రోలు బంకుల్లో డీజిల్, పెట్రోలు తీసుకుంటారు.

90 శాతం అధికారులు సొంత వాహనాల్లో పెట్రోలు, డీజిల్ నింపుకొని.. పది శాతాన్ని ఫాగింగ్కు పంపించి.. మిగిలిన ఇంధనాన్ని అదే పెట్రోలు బంకులో లేదా మరో డీలర్కు అమ్మేస్తున్నారు. ఈ దందాను అరికట్టేందుకు ఇంధనంలో మలాథియాన్ రసాయనాన్ని



కలిపి ఇవ్వాలని కేంద్ర కార్యాలయం నిబంధన పెట్టగా అమలవ్వట్లేదు. పెట్రోలు, డీజిల్ లేకపోతే ఫాగింగ్ యంత్రంలో కలిపే మలాథియాన్ మిగిలిపోతుంది. బల్దియాకు ఫాగింగ్ యంత్రాలు, రసాయనాలను అమ్మే కాంట్రాక్టరుకే మలాథియాన్ను అమ్ముతున్నారని, నాంపల్లి ఘటనలో పోలీసులకు ప్రాథమిక సమాచారం అందింది. ఫిర్యాదుచేసిన అధికారీ అవినీతిలో భాగస్వామేనని, నిందితులకు డబ్బులు ఎరగా చూపి తప్పించుకున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్, పెట్రోలు మిశ్రమంలో అధికంగా మలాథియాన్ను కలిపి ఫాగింగ్ చేస్తే ఎక్కువ పొగతో ప్రజలకు శ్వాసకోశ, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఫాగింగ్కు రోజూ కేటాయించాల్సింది (లీటర్లలో)

డీజిల్ 3,900 పెట్రోలు 900 మలాథియాన్ 270

## కరుణించేనా... కాసులు కురిపించేనా?

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ నగర తాగునీటి అవసరాలు తీరుస్తున్న జలమండలి బడ్జెట్లపై ఆశలు పెంచుకుంది. రాబడి, వ్యయం మధ్య ఏటా రూ.1600 కోట్లకు పైగా అంతరంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జలమండలి రాష్ట్ర బడ్జెట్తో పాటు జీహెచ?ంసీ బడ్జెట్పై ఆశలు పెంచుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ?ంసీ నుంచి జలమండలికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని జలమండలి ప్రతిపాదిస్తోంది. మహానగరం విస్తరణ నేపథ్యంలో జలమండలి అందించాల్సిన సేవలు అదే స్థాయిలో విస్తృతం అవుతున్నాయి. ఇందుకు అనుగుణంగా తాగునీటి సరఫరా, మురుగు నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా కొత్త ప్రాజెక్టులను ప్రతిపాదిస్తోంది. సొంతంగా నిధులను సమీకరించుకోలేని స్థితిలో ఉన్న జలమండలి బడ్జెట్ నేపథ్యంలో కేటాయింపుల కోసం పురపాలకశాఖ, జీహెచ?ంసీకి ప్రతిపాదనలు పంపింది.

కొత్తగా రూ.9వేల కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదన

ఈ ఏడాది కొత్తగా రూ.9వేల కోట్ల విలువైన ప్రాజక్టులను చేపట్టాలని జలమండలి సిద్ధమైంది. నగరంలో అన్ని ప్రాంతాలకు అంతరాయం లేని నీటి సరఫరాకు రూ.8వేల కోట్లతో రేడియల్ రింగ్ మెయిన్, దీని నుంచి అన్ని ప్రాంతాలకు అనుసంధానం పైపులైన్లను ప్రతిపాదించింది. మంజీరా కొత్త పైపులైన్కు రూ.722 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఉస్మాన్సాగర్ కాండ్యూట్ స్థానంలో



కొత్త పైపులైన్ ఏర్పాటుకు రూ.282 కోట్లతో ప్రతిపాదించింది. ఈ మూడు కీలక ప్రాజెక్టుకే రూ.9వేల కోట్లు అవసరం అవుతాయి. ఇవికాక నగరంలో పటిష్ఠ మురుగు వ్యవస్థ ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ను రూపొందిస్తోంది. సీవరేజీ మాస్టర్ప్లాన్ అమలుకు రూ.17వేల కోట్లు వ్యయమవుతుందని 2018లో అంచనా వేశారు. తాజాగా విస్తరణ మేరకు సీవరేజీ మాస్టర్ ప్లాన్ను రూపొందిస్తే భారీగా నిధులు అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం, జీహెచ?ంసీ తోడ్పాటు ఇస్తే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి లేదని జలమండలి ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. కొత్త ప్రాజెక్టను చేపట్టేందుకు రాష్ట్ర బడ్జెట్లో కేటాయింపులు చేయాలని జలమండలి ప్రతిపాదించింది.

జీహెచ?ంసీ నుంచి నిధుల తోడ్పాటు కావాలి

జీహెచ?ంసీ నుంచి జలమండలికి రావాల్సిన బకాయిలను ఇవ్వడంతో పాటు నికరంగా ఏటా జీహెచ?ంసీ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని జలమండలి కోరింది. జలమండలికి జీహెచ?ంసీ నుంచి రూ.654 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, నిధులు వెంటనే ఇవ్వాలని కోరింది.

# ఇది.. బతుకు బడి!



సిరిసిల్ల: ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా పరిశ్రమ నెలకొల్పి అవాంతరాలు వస్తే డీలా పడిపోతున్నారు. కానీ ఈ మహిళలు మండేపల్లిలోని ఐటీఐని తమ బతుకు బడిగా మార్చుకున్న తీరు స్ఫూర్తినిస్తోంది.

**ప్రపంచ బ్యాంకు సాయంతో..**

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్?ఎంఈ)ల రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంకు సాయంతో కేంద్ర ప్రభుత్వం రాంప్ (రైజింగ్ అండ్? యాక్సిలరేటింగ్? ఎంఎస్?ఎంఈ ఫెర్ఫార్మెన్స్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి జిల్లాలోనూ దీన్ని అమలు చేస్తున్నారు. దీనికోసం పరిశ్రమల శాఖలో ప్రత్యేకంగా ఎంటర్?ప్రైజ్? డెవలప్మెంట్ సెంటర్? (ఈడీసీ) ఏర్పాటుతో పాటు ఇద్దరేసి నిపుణులను నియమించారు. కలెక్టర్, పరిశ్రమలశాఖ ప్రత్యేక చొరవతో ఇది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వేదికవుతోంది.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి ఐటీఐలో మహిళలకు ఉపాధి శిక్షణకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.50 లక్షల విలువైన అత్యాధునిక కుట్టుమిషన్లను అందజేసింది. నేత కార్మికుల కుటుంబాల మహిళలకు వీటిపై గార్మెంట్ ఉత్పత్తులకు అనువుగా శిక్షణనిచ్చి ఉపాధిచూపాలనేది ఉద్దేశం. ఈ లక్ష్యం నెరవేరలేదు. పరిశ్రమలశాఖ రాంప్లో భాగంగా ఈ యూనిట్తో అక్టోబరులో ఎంవోయూ (పరస్పర అవగాహన ఒప్పందం) చేసుకుంది. తొలుత పది మంది మహిళలకు ఎన్?బీఐ (లైవ్లీహుడ్? బిజినెస్? ఇంక్యుబేటర్?) శిక్షణనిచ్చారు. వీరి నైపుణ్యం.. ఉపాధిని చూసి ఒక్కొక్కరుగా 50 మందికి చేరారు.

ఇక్కడి మహిళలు తయారు చేసిన కుర్తాలు.. నైటీలు ఇతర గార్మెంట్ ఉత్పత్తులను రాష్ట్రవ్యాప్తంగా పరిచయం చేసేందుకు ఇటీవల హైదరాబాద్?లో జరిగిన నుమాయిష్లో ప్రత్యేక స్టాల్ నిర్వహణకు అనుమతి లభించింది. వీరి ఉత్పత్తుల హోల్సేల్ విక్రయాలకు సిరిసిల్ల పట్టణంలో ప్రత్యేకంగా విక్రయశాలను ఏర్పాటు చేశారు. ఈ గార్మెంట్ యూనిట్ను విస్తరించేందుకు కలెక్టర్? పక్కనే ఉన్న టెక్స్టైల్ పార్కులో స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్? (రాంప్) మాధవి తెలిపారు. పాత రోజులు వచ్చాయి- సంధ్య

నాకు జూకీ యంత్రంపై పలు రకాల వస్త్రాలు కుట్టడం వచ్చు. ఇక్కడికి రాకముందు పట్టణంలోని పలు గార్మెంట్ వస్త్రాల తయారీ యజమానుల వద్దకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకుని కుట్టి ఇస్తూ ఉపాధి పొందేదాన్ని. ఇక్కడికి వచ్చాక, దూరం కావడంతో ఆర్డర్లు తీసుకురావడం ఇబ్బందిగా మారింది. దాంతో ఉపాధి కూడా తగ్గింది. ఈ యూనిట్ ఏర్పాటుతో తిరిగి పాతరోజులొచ్చాయి.

ఉపాధి బాగుంది- వేముల స్రవంతి

సిరిసిల్ల పట్టణానికి చెందిన మాకు మూడేళ్ల క్రితం మండేపల్లిలోని రెండుపడక గదుల ఇళ్లు మంజూరైంది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. చుట్టుపక్కల మహిళలకు ఉపాధి అవకాశాలు తక్కువ. నిత్యం పట్టణానికి వెళ్లిరావడం అంటే ఖర్చుతో కూడుకున్న పని. మూడు నెలలక్రితం ఇందులో శిక్షణ తీసుకుని పనిచేస్తున్నాను. సమీపంలోనే ఉపాధి లభించడం బాగుంది.

# అమాయకుల చేతికి నేరాల మకిలీ

హైదరాబాద్: రాజధానిలో ప్రీయాక్టివేటెడ్ సిమ్కార్డుల దందా కలకలం రేపుతోంది. ప్రధానంగా సైబర్? నేరాలు, బెట్టింగ్? ముఠాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో నేరగాళ్లు ఈ సిమ్?కార్డులే ఉపయోగిస్తున్నారు. ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాలకు ఇవి చేరేవి.

ఇప్పుడు వీటి ఉనికి హైదరాబాద్?లోనూ బయటపడింది. ఇద్దరు నిందితులు ఇతరుల పేర్లతో యాక్టివేట్? చేసిన సిమ్?కార్డుల్ని నాంపల్లి దగ్గర విక్రయిస్తూ సీసీఎస్ స్పెషల్ క్రైమ్ టీమ్కు చిక్కారు. దుబాయ్లో ఉండే అజ్ఞాత వ్యక్తి సూచనతోనే ఇలా చేసినట్లు వివరించారు. సిమ్? కోసం వచ్చే వారిని కొందరు తప్పుదోవ పట్టించి వారి వేలిముద్రలతో రెండు సిమ్ కార్డులు తీసుకుంటున్నారు. ఒకటి వినియోగదారుడికి ఇచ్చి మరోటి ఏజెంట్లకు పంపిస్తారు. వాటిని అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ఈ ప్రీయాక్టివేటెడ్సిమ్కార్డుల్ని రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. బ్లాక్ చేయండిలా.. సంచార్ సాథీ యాప్ లేదా వెబ్సైట్లోకి వెళ్లి 'నో మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్' విభాగం మీద క్లిక్? చేయాలి. మీ మొబైల్? నంబరు ఎంటర్? చేసి ఓటీపీ ద్వారా రిజిస్టర్? చేసుకుంటే మీ పేరుతో ఎన్ని సిమ్?లున్నాయో కనిపిస్తుంది. వాడని వాటిని బ్లాక్ చేయొచ్చు.

## అటకెక్కిన మినీ బస్సుల ప్రతిపాదనలు

హైదరాబాద్: నగరంలో మినీ బస్సులు తీసుకురావాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. ఇప్పటికీ కాలం చెల్లిన డొక్కు బస్సులనే గ్రేటర్ ఆర్టీసీ నడుపుతోంది. దీంతో నగరంలో ప్రయాణిస్తున్న 26 లక్షల మందిలో 5 నుంచి 6 లక్షల మంది క్యాబ్లో రాకపోకలు సాగిస్తున్నారు. మిగిలిన 18 లక్షల మంది మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణిస్తున్నారని అంచనా. రహదారులు, విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా క్యాబ్ల తరహాలో ఉండే మినీ బస్సులే ఎంతో సౌకర్యంగా ఉంటాయని నిపుణులు సైతం చెబుతున్నారు.

పాత నగరంలో ప్రవేశపెట్టినా.. పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా మినీ బస్సులను నడపాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. ఈ మేరకు అప్పట్లోనే పాతబస్తీలో కొన్ని బస్సులను ప్రవేశపెట్టారు. ఈ బస్సులు చార్మినార్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవి.

కొన్ని ఏళ్లు నడిపి వీటిని కూడా నిలిపివేశారు. ఉప్పల్- అమీర్పేట్- మియాపూర్ మధ్య మెట్రో రైలును ప్రారంభించిన సమయంలో 100 మినీ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదు.

**మినీ బస్సులతో లాభాలేంటి?**

తక్కువ సమయంలో ఎక్కువ దూరం వెళ్లొచ్చు.

ప్రధాన ప్రాంతాల నుంచి ప్రయాణికులను మెట్రోస్టేషన్లకు చేరవేసేందుకు ఉపయుక్తం. గ్రేటర్లో ఆర్టీసీ

బస్సులు 3,000 ట్రిప్పులు 31,815 ప్రయాణికులు 26 లక్షలు

## సమస్యల 'జాతర'

కరీంనగర్ : ములుగు జిల్లా మేడారంలో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. అక్కడి వరకు వెళ్లలేని వారి కోసం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిన్న జాతరలు వెలిశాయి. ఇక్కడకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. అధికార యంత్రాంగం, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నా.. అనేక సమస్యలు కనిపిస్తున్నాయి. ఈనెల 28 నుంచి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో పరిశీలన కథనం.

ఎస్సారెస్పీ కాలువ కలుషితంరేకుర్తిలోని చిన్న జాతరకు వచ్చే భక్తులకు స్నానాల కోసం ఎస్సారెస్పీ కాలువ నీళ్లు విడుదల చేస్తారు. చింతకుంట ప్రధాన ఎస్సారెస్పీ కాలువ ద్వారా పిల్ల కాలువకు నీటిని వదిలారు. అమ్మవారి పరిసర కాలువలోకి ఇళ్లల్లో నుంచి మురుగు నీరును కాలువలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు ఈ నీటిలో స్నానాలు చేస్తే రోగాలు ప్రబలే అవకాశముంది. గద్దెలకు సమీపంలో కాలువ శిథిలమై సిమెంట్ దిమ్మెలు పడిపోయాయి. అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

దెబ్బతిన్న సీసీ రోడ్డు కేశవపట్నంలోని సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు దెబ్బతింది. ఓ పక్క సిమెంటు లేచిపోయి, మట్టి రోడ్డును తలపిస్తోంది. ఇక్కడకు వాహనాలపై వచ్చే వారు ఇబ్బంది పడే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


మురుగు కూపంగా వాగు

హుజూరాబాద్ రంగనాయకుల గుట్ట వద్ద జరిగే జాతరలో శాశ్వత మంచినీటి వసతి లేదు. తాగునీటికి వ్యవసాయ బోరు బావులే దిక్కు. పురపాలిక నుంచి తాగునీటి ట్యాంకర్ను ఏర్పాటు చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు అంటున్నారు. శాశ్వత బోరుబావిని సమకూరిస్తే ఉపయోగకరంగా ఉంటుందని భక్తులు కోరుతున్నారు. గుట్ట సమీపంలో ఉన్న చిలుక(జంపన్న) వాగు మురుగు కూపంగా మారింది. దాన్ని సరి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆశలు నాటుకుంటున్నాయ్?..!

సూర్యాపేట: వానాకాలంలో మొంథా తుపాను ప్రభావంతో కొంతమేర దిగుబడులు నష్టపోయిన ఉమ్మడి జిల్లా రైతులు ఇప్పుడు యాసంగి పంటపై ఆశలు పెట్టుకున్నారు. నష్టాలు పూడ్చుకునేందుకు వరిసాగుపై ప్రధానంగా దృష్టిసారించారు. మూసీ, డిండి, ఎన్?ఎస్పీ, ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు వస్తుండటంతో వరినాట్లు ముమ్మరం అయ్యాయి. మడుల్లో నాట్లు, వెదజల్లిన వడ్లు మొలకెత్తడంతో పొలాలన్నీ భూమికి పచ్చాని రంగేసినట్టు కనిపిస్తున్నాయి.

యాసంగి సీజన్లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 10.91 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా సమయం ఉండటంతో అంచనాకు మించి సాగు విస్తీర్ణం పెరిగే



అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. నల్గొండలో మరో లక్ష ఎకరాలు, యాదాద్రిలో 35 వేలు, సూర్యాపేటలో సుమారు 50 వేల ఎకరాల వరకు నాట్లు పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వానాకాలంతో పోల్చితే యాసంగిలో అత్యధికంగా రైతులు దొడ్డు రకాల సాగుపై దృష్టిసారించారు. ముఖ్యంగా నల్గొండ, యాదాద్రి జిల్లాలోని అన్నదాతలు దాదాపు 60శాతం మేర దొడ్డు వడ్లనే సాగు చేస్తారు. సూర్యాపేట జిల్లాలో సన్నాలను సాగు చేసే వారి సంఖ్య ఎక్కువ. అయితే వానాకాలంలో ఇచ్చినట్లుగానే యాసంగిలోనూ సన్నాలకు సర్కారు బోనస్? ఇస్తుందనే ఆశతో ఉమ్మడి జిల్లాలోని కొందరు రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సన్నాలను సాగు చేస్తున్నారు.

గతేడాది మాదిరిగా సాగునీటి కొరత సమస్య రాకుంటే రూ.వేల కోట్ల విలువైన వడ్లు పండనున్నాయి. ఆశించిన మాదిరిగానే పంట చేతికొస్తే వానాకాలంలో ఎదురైన నష్టాన్ని మరచిపోనున్నారు.

చురకలు


# ముసి ముసి నవ్వేలా.. మూసీ మురిసేలా

హైదరాబాద్ : కొత్త ఏడాదిలో మూసీ నది స్వరూపం మారబోతోంది. సుమారు రూ.5,500కోట్లతో మొదటి దశలో భాగంగా మూసీని అభివృద్ధి చేసేట్లు డీపీఆర్ (పూర్తిస్థాయి అభివృద్ధి నివేదిక) రూపుదిద్దుకుంటోంది. నదికి ఇరువైపులా 50మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్‌ను వదిలేసి.. నదీ గర్భం నుంచి బఫర్ జోన్ వరకు చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో డిజైన్ల ఖరారు తుది దశలో ఉందని, ఆ పనులు పూర్తవగానే.. డీపీఆర్‌ను విడుదల చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**మీదే ఆలస్యమంటున్నారు..** "మూసీ అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు ఏడీబీ(ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) సిద్ధంగా ఉంది. డీపీఆర్



ఇవ్వగానే.. నిధులు మంజూరు చేస్తామంటున్నారు. ఆలస్యమంతా కన్సల్టెన్సీ వైపు నుంచే. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రక్రియను తుది దశకు తీసుకొచ్చాం. మూసీ మొదటి దశకు సంబంధించిన డీపీఆర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం. బాపూఘాట్ త్రివేణి సంగమం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ఎత్తైన గాంధీ విగ్రహం, చుట్టూ ఆకట్టుకునే నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర?యించింది. వాటి కోసం రక్షణశాఖ నుంచి 95 ఎకరాల భూములను తీసుకోవాల్సి ఉంది. సోమవారం రక్షణశాఖ అధికారులు నగరానికి వచ్చి.. మేం అడిగిన భూములను పరిశీలించారు."అని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# గుత్తేదారులకు నోటీసులు

గోదావరిఖని : రామగుండం నగరపాలిక ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిరీ?త గడువులోగా పూర్తి చేయని గుత్తేదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. పనులు పూర్తి చేయాలని లేకపోతే సంబంధిత గుత్తేదారులను బ్లాక్‌లిస్టులో చేర్చి భవిష్యత్తులో ఎలాంటి టెండర్లలో పాల్గొనకుండా చర్యలు తీసుకొంటామని స్పష్టం చేస్తున్నారు. మల్కాపూర్ శివారులో జంతు వధశాల అభివృద్ధి పనుల్లో జాప్యం వహిస్తున్న గుత్తేదారుకు మంగళవారం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ నోటీసులు జారీ చేశారు.

రామగుండం నగరపాలక ప్రాంతంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనుల్లో జాప్యానికి గుత్తేదారులు, అధికారుల సమన్వయలోపం కారణంగా భావిస్తున్నారు. జంతువధశాల అభివృద్ధిలో భాగంగా గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో రెండు మార్లు ఏర్పాటు చేసిన గ్రిల్స్‌తో పాటు సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో తాజాగా గ్రిల్స్ సిద్ధం చేసినప్పటికీ ఏర్పాటు చేయడంలో జాప్యం నెలకొంటుంది.

'అమృత్' నిధులతో గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లో ఉపరితల మురుగు కాలువ నిర్మాణం చేపట్టిన గుత్తేదారు అర్ధాంతరంగా పనులు ఆపేశారు.



దీంతో కాలువ సమీపంలో నివాసముండే వారు దుర్గంధంతో పాటు కాలువ ఎప్పుడు కూలుతుందో తెలియని భయంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులది ఇదే పరిస్థితి. మార్కండేయకాలనీ ప్రధాన మురుగు కాలువ నిర్మాణ పనులను ఓ గుత్తేదారునకు అప్పగించినప్పటికీ పనులు చేపట్టకపోగా టెండరు రద్దు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సుమారు రూ.2 కోట్లతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి నగరపాలిక చర్యలు తీసుకున్నప్పటికీ కేవలం రోడ్డు తవ్వి, మట్టి, కంకర పోసి వదిలేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నగరపాలిక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# అఘాయిత్యానికి వెలకట్టారు!

చందుర్తి : మానసిక స్థితి సరిగా లేని మహిళపై అయిదుగురు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడగా కుల పెద్దలు పంచాయితీ నిర్వహించి డబ్బులతో రాజీ కుదిర్చిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ గ్రామానికి చెందిన వివాహిత(30) మానసిక స్థితి సరిగా ఉండదు. భర్త మరో వివాహం చేసుకుని వేరుగా ఉంటుండగా ఆమె గ్రామంలోనే ఒంటరిగా నివసిస్తోంది. ఇటీవల కడుపు నొప్పి, వాంతులు, అనారోగ్యంతో బాధపడగా సమీప బంధువులు చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి



ఆమె నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు తెలిపారు. విషయం భర్తకు తెలియడంతో వివాహితను తీవ్రంగా మందలించి ఆరా తీయగా తనపై అఘాయిత్యం చేసిన కొందరి పేర్లు చెప్పింది. తర్వాత ఆమె ఫోన్ కాంటాక్టులోని నంబర్ల ఆధారంగా అయిదుగురు అఘాయిత్యానికి పాల్పడినట్లు అనుమానించారు. ఆమె భర్త కుల పెద్దల దృష్టికి తీసుకెళ్లగా అనుమానితులను పిలిచి వారం రోజుల కిందట పంచాయితీ నిర్వహించారు. వారు రూ.50 వేల చొప్పున రూ.2.50 లక్షలు చెల్లిస్తామని ఒప్పుకొన్నారు. వివాహితకు భర్త కరీంనగర్‌లోని ఆస్పత్రిలో గర్భవిచ్ఛిత్తి చేయించినట్లు సమాచారం. చందుర్తి పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# పైరసీ వీరులు.. ఖాతాల్లో డబ్బున్న పేదలు!



హైదరాబాద్: బిహార్ రాష్ట్రంలోని పట్నాకు చెందిన అశ్విన్‌కుమార్.. యూట్యూబ్‌లో హ్యాకింగ్ పాఠాలు నేర్చుకుని సర్వర్లను హ్యాక్ చేసి సినిమా విడుదలకు ముందే డౌన్‌లోడ్ చేయడం సంచలనంగా మారింది. కొత్త సినిమా చూడాలనే కిక్‌తో పైరసీకి పాల్పడ్డాడు. వెబ్‌సైట్‌ల నిర్వాహకులు అతడి బ్యాంకు ఖాతాలో రూ.కోటి విలువైన క్రిప్టో కరెన్సీ జమచేశారు. క్రిప్టో ఖాతా పిన్ నంబర్ మరచిపోవటంతో అందులో డబ్బున్నా ఉపయోగించుకోలేని స్థితిలో ఉన్నాడు. గుజరాత్‌కు చెందిన మరో యువకుడి బ్యాంకు ఖాతా ఫ్రీజ్ చేయటంతో రూ.60 లక్షలు వాడుకునే అవకాశం లేకుండా పోయిందని హైదరాబాద్‌కు చెందిన ఓ పోలీసు అధికారి తెలిపారు. ఐ బొమ్మ రవి, తమిళనాడుకు చెందిన సుధాకరన్, పలువురు బిహార్ యువకులు ఇలాగే పైరసీ మాయలో పడి జైలుపాలయ్యారు.

పోటీపడి.. 200–300 మందికి పైగా యువకులు పైరసీ వెబ్‌సైట్లకు సినిమాలు విక్రయిస్తున్నట్టు నగర సైబర్‌క్రైమ్ పోలీసుల అంచనా. గతేడాది 10 మందిని అరెస్ట్ చేశారు. వీరిబ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లున్నా ఖర్చుచేయలేని దుస్థితి. గత కొన్నేళ్లలో కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లను ఉచితంగా చూసేందుకు వెయ్యికిపైగా పైరసీ వెబ్‌సైట్లు వచ్చాయి. వాటిలో ఐ బొమ్మ, బప్పం, తమిళ్‌రాకర్స్ పోటీపడ్డాయి. థియేటర్లలో కొత్త సినిమాలు రికార్డ్‌చేసి పంపేందుకు కమీషన్ ఆశచూపి వందలాది మందిని ఏజెంట్లుగా మార్చుకున్నారు.

**గుర్తించలేకపోయిన బ్యాంకులు**

ఐ బొమ్మ రవి పక్కాగా పైరసీ నేరాలకు పాల్పడ్డాడు. వి.ప్రహ్లాద్, అంజయ్య, కాళిప్రసాద్‌లను భాగస్వాములుగా మార్చి సప్లయిర్స్ ఇండియా, హాస్పిటల్స్ ఇన్, ఈఆర్ ఇనోటెక్ కంపెనీలు ప్రారంభించాడు. అమెరికాలోని విదేశీయులతో కలిసి గెట్టింగ్ అప్ ఎల్ఎల్‌సీ కంపెనీ ముసుగులో పైరసీ సినిమాలతో రూ.కోట్లు కూడబెట్టాడు. బ్యాంకు ఖాతాల్లో రూ.3 కోట్లకు పైగా ఉన్నా... ప్రస్తుతం బెయిల్ ఖర్చులకు ఎదురుచూస్తున్నాడని పోలీసులు చెబుతున్నారు.

# 'మహా' వేగం



హైదరాబాద్ : సరిగ్గా నెల రోజుల్లోనే బృహత్ నగరం ఏర్పాటైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో 27 పుర, నగరపాలక సంస్థలు విలీనమయ్యాయి. పురపాలక శాఖను పర్యవేక్షిస్తున్న సీఎం అత్యంత సన్నిహితులతో చర్చించి ఈ అంశాన్ని మంత్రివర్గంలో చేర్చారు.

గతేడాదిలో.. నవంబరు 25న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో 27 శివారు పట్టణ స్థానిక సంస్థల విలీన తీర్మానం

డిసెంబరు 3న ఆర్డినెన్స్ జారీ

9న: డివిజన్ల పునర్విభజన ముసాయిదా విడుదల చేసిన జీహెచ్ఎంసీ

10: వారం గడువుతో ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ

16: డివిజన్ల పునర్విభజనపై చర్చకు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

17: ముగిసిన ఫిర్యాదులు, అభ్యంతరాల గడువు, అప్పటికే పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గడువు పొడిగించిన హైకోర్టు

23: 5,900ల ఫిర్యాదుల పరిశీలన. రాజకీయ పార్టీలు, పౌరసమాజం చేసిన సూచనలు బుట్టదాఖలు. నామమాత్రంగా కొన్ని పరిష్కారం. డివిజన్ల హద్దులు, పేర్లను సవరించి 300 డివిజన్లతో తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసిన జీహెచ్ఎంసీ

25: 12 జోన్లు, 60 సర్కిళ్లుగా జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ జోన్లకు కమిషనర్ల నియామకం, తర్వాత 60 సర్కిల్ కార్యాలయాలకు డిప్యూటీ కమిషనర్ల నియామకం.

సర్కిళ్లలో పారిశుద్ధ్య పర్యవేక్షణ బాధ్యతలను ఇంజినీరింగ్ విభాగానికి అప్పగిస్తూ.. డీఈఈల నియామకం, వారికి సహాయకులుగా ఏఈఈల నియామకాలు.

కేవలం నాలుగు రోజుల వ్యవధిలో సర్కిల్‌కు ఒకరు చొప్పున మెడికల్ అధికారుల నియామకం, పట్టణ ప్రణాళిక విభాగంలో 12 సీపీలు, 60 ఏసీపీల నియామకం.

తాజాగా సహాయ మున్సిపల్ కమిషనర్లు 60 మందికి పోస్టింగులు ఇచ్చారు. వీరు డీసీల కింద పనిచేస్తారు. ఇంజినీరింగ్ విభాగంలోనూ వెంటవెంటనే బదిలీలు చేశారు.

**మూడు కార్పొరేషన్‌ల దిశగా..**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర?న్‌కు సహాయకారిగా ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు జి.సృజన, వినయ్ కృషా?రెడ్డిలను నియమించారు. విశాల నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా మార్చి.. ఒక్కోదానికి ఒక్క కమిషనర్ నియామకం త్వరలో జరగనుంది.

**శాస్త్రీయత లేదనిపిస్తోంది**

– కేఎం లక్ష్మణరావు, విశ్రాంత ఆచార్యులు, జేఎన్‌టీయూ

జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ జరగడం మంచి పరిణామం. ఇది శాస్త్రీయంగా జరగాలి. అప్పుడే ప్రణాళిక పరమైన అభివృద్ధికి అవకాశం ఉంటుంది. పౌరుల కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేవలం ఓఆర్ఆర్ తరహాలో రాజకీయ, బ్యూరోక్రసీ ద్వారా జరగడం విచారకరం. ఇది భవిష్యత్తులో పలు సమస్యలకు కారణమవుతుంది. కేవలం స్థిరాస్తి ఒక్కటే ప్రామాణికం కాదని ప్రభుత్వాలు గ్రహించాల్సి ఉంటుంది.

# ప్రజా భాగస్వామ్యం.. ప్రగతికి సోపానం



హైదరాబాద్ : కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ నగరవాసులు మారాల్సిన అవసరం ఉంది. విలువైన జలాన్ని వృథా చేయొద్దు. ప్రజా రవాణాను వినియోగించి కాలుష్య కట్టడిలో కీలక పాత్ర పోషించాలి. స్వచ్ఛ నగరంగా మార్చడానికి సహకరించాలి. అందరూ భాగస్వాములు కావాలి.

నీరు వృథా చేస్తే 155313కి కాల్ చేయండి

గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కడైనా తాగునీటి వృథా గమనిస్తే పౌరులు 155313కు ఫోన్ చేయొచ్చు. జలమండలి 'ఎక్స్' ఖాతాలో ఫొటోలతో ట్యాగ్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రతి వేయి లీటర్ల నీటిని శుద్ధి చేసి నగరానికి తరలించడానికి జలమండలి రూ.70–80 వరకు ఖర్చు చేస్తోంది. ప్రజలకు రూ.10కే సరఫరా చేస్తోంది. అంత రాయితీతో ఇస్తున్న నీటిని జాగ్రత్తగా వాడుకోకుండా చాలామంది విచ్చలవిడిగా దుర్వినియోగం చేయడం దురదృష్టకరం.

కృషా?, గోదావరి, మంజీరా, జంటజలాశయాల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి దాదాపు 160–225 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరానికి సరఫరా చేసేందుకు ఏటా రూ.1,200 కోట్లు వరకు కరెంటు బిల్లులకు వెచ్చిస్తోంది. ప్రజల దాహార్తిని తీర్చుతోంది. సుదూరం నుంచి తరలించిన జలం వృథా అవుతోంది.

స్వచ్ఛతే.. మన బాధ్యత

గ్రేటర్ పరిధిలో 10 వేల కిలోమీటర్ల రోడ్లుండగా.. రోజూ 17 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు వాటిని శుభ్రం చేస్తున్నారు. 5,500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటి చెత్త సేకరణలో పాల్గొంటున్నాయి. నిత్యం 2,500 చెత్తకుప్పలు ఏర్పడుతున్నాయి. వాటిని శుభ్రం చేసినా.. నిమిషాల వ్యవధిలోనే మళ్లీ పోగవుతున్నాయి.

ఇలా చేద్దాం: ఇళ్లు, దుకాణాలు, హోటళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను.. స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలి. దారిలో వెళ్తున్నప్పుడు, వాహనం నడుపుతున్నప్పుడు.. ఆహార వ్యర్థాలను తిని పడేయడం, రోడ్లపై ఉమ్మడం ఆపేయాలి. అప్పుడు శుభ్రంగా కనిపిస్తాయి.

ప్రజా రవాణాకు పట్టం కడదాం

నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్య నియంత్రణకు ఆర్టీసీ బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ సర్వీసులను వినియోగించుకోవాలి. జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్)లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరాలంటే ప్రజా రవాణాను మెరుగుపరచడమే ఏకైక మార్గమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్, ఇతర రవాణా సాధనాల్లో ఉమ్మడిగా చెల్లుబాటు అయ్యే కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# అన్నదాత.. ఆకాంక్షల కలబోత

జగిత్యాల : నూతన సంవత్సరంలో వ్యవసాయ రంగం 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా వర్ధిల్లాలని రైతులు కోరుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలకు గిట్టుబాటు ధరలు అందాలని ఆకాంక్షిస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పరంగా మద్దతును కోరుతున్నారు.

**దిగుబడులు పెరిగేలా కొత్త వంగడాలు**

జగిత్యాల, కూనారం, వరంగల్, రుద్రూరు పరిశోధన స్థానాల్లో వరి, కరీంనగర్‌లో మక్క, ఆదిలాబాద్‌లో సోయా, ముథోల్‌లో పత్తి, కమ్మర్‌పల్లిలో పసుపు పరిశోధనలు సాగుతున్నా ఇక్కడి రైతులు కోరుకున్న వంగడాల రూపకల్పన జరగలేదు. అన్ని పంటల్లోనూ చీడపీడలను తట్టుకొని సగటు దిగుబడులు పెరిగేలా సంకర రకాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తేవాలి. పొలాసలో ఆవాల పరిశోధన స్థానం, ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాల్సి ఉంది. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుతో ఆధునిక సాంకేతికత విస్తరణకు అడుగులు పడతాయి.

**అప్పుడే తీపి కబురు**

ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద వ్యవసాయాధారిత పరిశ్రమ అయిన ముత్యంపేట చక్కెర కర్మాగారం పునరుద్ధరిస్తే చెరకు సాగు విస్తీర?ం 25 వేల ఎకరాలకు పెరుగుతుంది. వరి, మామిడి, పసుపు, మిరప, మక్క, నువ్వులు తదితర పంటల్లో ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ రుణాలిస్తే కర్షకులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది. పొలాస, వరంగల్ పరిశోధన స్థానాల్లోని వరి, మామిడి, మిరప, పసుపు పంటల ఉత్పత్తుల తయారీ ఇంక్యుబేషన్ సెంటర్లలో ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వాలి.

**విత్తనోత్పత్తికి కావాలి దన్ను**



ఉమ్మడి జిల్లా నేలలు విత్తనోత్పత్తికి అనుకూలం. ఇప్పటికే సూటి వరి, సంకర వరి, మక్క, పత్తి, ఆవాలు, జొన్న, సజ్జ తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నా ధరల చెల్లింపు, కొనుగోలు కంపెనీల కొర్రీలతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో ఒప్పంద సాగు చట్టాల అమలుతో మేలు చేకూరనుంది. కరీంనగర్ నుంచి జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌కు తరలించిన విత్తనశుద్ధి కర్మాగారాన్ని ఈ ఏడాదైనా రైతులకు అందుబాటులోకి తేవాలి.

**సహకార సేవలు విస్తృతం**

ఉమ్మడి జిల్లాలో 131 సహకార సంఘాలుండగా అన్నింటినీ ఎఫ్‌పీవోలు(రైతు ఉత్పాదక సంఘాలు)గా మార్చడం, కొత్తగా 20 వరకు ప్యాక్స్‌ల ఏర్పాటుతో రైతులకు మెరుగైన సేవలందుతాయి. 6.63 లక్షల మంది రైతుల్లో 35 శాతం మంది కూడా సభ్యులుగా లేనందున అందరినీ సంఘాల్లో చేర్చాలి. ఈ ఏడాది ఎన్నికల నిర్వహణ లేదా పాలకమండళ్ల నియామకంతో సాగుకు ఊతమివ్వాలి.

**పథకాలతో ప్రయోజనం**

కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకంలో అర్హుల నమోదుకు అవకాశమిస్తే కనీసం 90 వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు, యంత్రలక్ష్మి పథకం ద్వారా రూ.150 కోట్ల నిధుల విడుదల, 50 శాతం రాయితీపై ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాల సరఫరా, 25 మార్కెట్ యార్డులను ఈ–నామ్ పరిధిలోకి తేవడం, సాగు పనులను వి బీజీ రామ్ జీ(ఉపాధిహామీ) పథకంలో చేర్చడం వంటివి కర్షకులకు కలిసొస్తాయి.

# ఎవరిదీ పాపం..!

మిర్యాలగూడ : ఒకప్పుడు పిల్లలకు ఏమైనా అయితే చుట్టు పక్కల వాళ్ల మనసులు సైతం చలించి పోయేవి..ఇక సొంతింటి వారు కన్న వారి బాధను వరి?ంచలేము..కానీ నేడు పరిస్థితులు మారాయి. కనికరం, మానవత్వం మచ్చుకైనా కనిపించడం లేదు. కన్న బిడ్డలనే అమానుషం గా పక్క కాల్వలు, చెత్త కుప్పలో పడేసి..'కడుపు'దులుపుకొంటున్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు నిత్యం ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తూనే ఉన్నాయి.

**నాకెందుకీ శాపం..**

మీరు చేసిన తప్పో..ఒప్పో పనికి నాకు ఊపిరి పోశారు సరే.. మరి ఆడపిల్లనని అకారణంగా పుట్టానని ఎందుకమ్మా నా పట్ల అంత కర్కశత్వం చూపుతున్నావు. ఇన్ని నెలలు నన్ను కడుపులో భద్రంగా దాచుకున్నావు కదా..ఇప్పుడెందుకు భారమయ్యాను. ఆడపిల్లను అని సాకేందుకు భయం వేసిందా. నువ్వు కూడా నాలాగే ఆడపిల్లవే కదా. మరి నా పట్ల వివక్ష ఎందుకు చూపావు. మీరు చేసే తప్పులకు నన్ను ఎందుకు బలి చేశారు. ఇదే ఆలోచన నాడు మీ అమ్మ చేసి ఉంటే నేడు ఈ అదుతేమైన లోకాన్ని నువ్వు చూసే దానివా అమ్మా. నాకెందుకు ఆ భాగ్యం కలగకుండా చేశావు.



**ఏడాదికి.. నాకూ చివరి రోజే..**

ఏడాది చివరి రోజే నాకు సైతం అంతిమ దినం చేస్తావని అనుకోలేదు అమ్మా. నన్ను వదిలించుకొని..కొత్త సంవత్సరానికి నువ్వు ఏ విధంగా స్వాగతం పలుకుతావమ్మా. నాకు జరిగిన ఈ పరిస్థితి వచ్చే కొత్త ఏడాదిలో మరే శిశువుకు జరగకుండా అధికారులు పటిష‘ చర్యలు చేపట్టాలి. కొత్త ఏడాదిలో అధికారులు సరికొత్త తీర్మానం తీసుకొని గర్భంలోనే నా లాంటి శిశువులను తుద ముట్టించే ఘటనలకు స్వస్తి పలకాలి. అధికారులతో పాటు ప్రజలు సైతం మాలాంటి శిశువులకు అండగా నిలవాలి. మిర్యాలగూడలో పక్క కాల్వలో లభ్యమైన మృత శిశువు ఆత్మఘోషకు ఇచ్చిన అక్షర రూపం ఇదీ..

చురకలు



# గ్రానైట్ మాయాజాలం

ఒంగోలు : భూమిలో నుంచి ఎంత విలువైన గ్రానైట్ బండలు వెలికితీశారు... వాటిని ఎంతమేర స్లాబులుగా మార్చి మార్కెట్లో విక్రయించారు... ఈ లెక్కలు చూసే బాధ్యత భూగర్భ గనులశాఖ (మైన్స్) అధికారులు పర్యవేక్షించాలి. జిల్లాలో మాత్రం ఎలాంటి బిల్లుల్లేకుండానే గ్రానైట్ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. గ్రానైట్ లావాదేవీలు ఏమాత్రం దస్త్రాల్లోకి ఎక్కడం లేదు. జిల్లాలో గ్రానైట్ ఏమి దొరకలేదనే విధంగా దొడ్డిదారిన జీరో వ్యాపారం సాగిస్తున్నా గనులశాఖ అధికారులు కిమ్మనడంలేదు.

క్వారీ నుంచి తవ్వి తీసిన గ్రానైట్ బండలకు నిబంధనల ప్రకారం సీనరేజీ చెల్లిస్తారు. బండలను కొని వాటిని స్లాబులుగా మార్చిన కర్మాగారం నిర్వాహకులకు క్వారీ యజమానులు అనుమతి పత్రాలు మంజూరు చేస్తారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి స్లాబ్ సిస్టం ప్రకారం నెలకు రూ.70 వేలు చెల్లించిన నిర్వాహకులకు 44 మీటర్ల మేర అంటే దాదాపు 15 వేల చదరపు అడుగుల గ్రానైట్ స్లాబులను విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. మూడు కంటైనర్ల సరకు ఇతర ప్రాంతాలకు రవాణా చేసుకోవచ్చు. ఈ అనుమతుల జారీ ప్రక్రియ అంతా ఆన్లైన్లోనే జరుగుతుంది. తాము స్లాబులు విక్రయించలేదని తమ వద్ద ఇప్పటికే లక్ష చదరపు అడుగుల వరకు గ్రానైట్ స్లాబులు రవాణా చేసేందుకు అనుమతి పత్రాలున్నాయని కర్మాగారాల నిర్వాహకులు చూపుతున్నారు. ప్రస్తుతం రోజూ లావాదేవీలు సాగుతున్నా ఆన్లైన్లో ఎలాంటి పత్రాల తీసుకోకుండా తెల్ల కాగితంపై నంబర్లు రాసుకుని దర్జాగా రవాణా చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్కు ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రెండు కంటైనర్లను జీఎస్టీ అధికారులు యర్ర గొండపాలెం వద్ద స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్రమ రవాణా వ్యవహారం ఎలా సాగుతుందో వెల్లడైంది.

**భారీగా జీఎస్టీ.. ఆదాయానికి గండి**

ఇటీవల హైదరాబాద్లో గ్రానైట్ తరలించిన కంటైనర్లను అక్కడి అధికారులు స్వాధీనం చేసుకోగా, ఓ ప్రైవేటు గుత్తేదారు సంస్థ జారీ చేసిన రసీదులను చూపించారు. అనుమతి పత్రాలు లేకుండానే తరలించినందుకు భారీ జరిమానా విధించారు. గనుల నుంచి వచ్చే ముడిరాయికి, పాలిష్ చేసిన బండలకు జీఎస్టీ చెల్లించాలి. ఇవేమి ప్రభుత్వ దస్త్రాల్లోకి ఎక్కకుండా అంతా తెల్ల కాగితంపై లెక్కలు రాసుకుని



పనులు చక్కబెడుతున్నారు. వాస్తవానికి ఒక కంటైనర్ స్లాబులు రవాణా చేయాలంటే రూ.45 వేలు చెల్లించి రవాణా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఓ ప్రైవేటు సంస్థ రూ.35 వేలు వసూలు చేసి తరలింపు వ్యవహారం చూసుకుంటామని అక్రమ రవాణాకు తెరలేపింది. తమకు కలిసి వస్తుందని చెప్పి మరికొంతమంది కర్మాగారం యజమానులు ఈ బాటలోనే వెళ్తున్నారు. ఫలితంగా గ్రానైట్ లావాదేవీలు రికార్డుల్లోకి ఎక్కకపోగా, జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. అనధికార వ్యాపారంతో చివరకు గ్రానైట్ పరిశ్రమకు గడ్డుకాలం ఎదురవుతుందని నిజాయతీగా లావాదేవీలు జరిపే కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు వాపోతున్నారు.

**అక్రమాలు సాగనివ్వం**

హైదరాబాద్కు బిల్లులు లేకుండా గ్రానైట్ రవాణా చేస్తున్న వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై నివేదిక ఇవ్వాల్సిందిగా మార్కాపురం గనులశాఖ అధికారులను ఆదేశించాం. జిల్లాలో ఎక్కడైనా అనుమతి పత్రాలు తీసుకునే గ్రానైట్ రవాణా సాగించాలి. లేకుంటే భారీ జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

రాజశేఖర్, జిల్లా గనులశాఖ అధికారి

# ఎక్కడివారు.. ఎవరు వారు?

ఉదయగిరి : ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ఆర్లపడియ అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించేందుకు యత్నించిన వారెవరన్నది ఇంతవరకు గుర్తించలేదు. పోలీసుల చేతిలో ఆధారాలున్నా పట్టుకోలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి ఎర్రచందనం దుంగలను వాహనంలో తరలిస్తుండగా ఆర్లపడియ గ్రామస్థులు అడ్డగించారు. వాహనంలో ఉన్న ముగ్గురిని పట్టుకోబోగా తప్పించుకు న్నారు. ఈ క్రమంలో ఒకరి సెల్ఫోన్ చిక్కింది. పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి దుంగలతో సహా వాహనం, సెల్ఫోన్ స్వాధీనం



చేసుకున్నారు. గ్రామస్థుల చేతికి ఫోన్ చిక్కిన సమయంలో దానికి చాలా ఫోన్కాల్స్ కూడా వచ్చాయి. పోలీసుల అదుపులో ఉన్న వాహనం, సెల్ఫోన్ ఆధారంగా రవాణాలో ఒకరి ప్రమేయమున్నట్లు పోలీసులు గుర్తించి పట్టుకొనేందుకు అతని ఇంటికి వెళ్లగా పరారైనట్లు సమాచారం. ఫోన్ ఆన్ కావడం లేదు. దీన్ని బాగుచేయించి వచ్చిన కాల్స్ ఆధారంగా విచారిస్తే నిందితులెవరన్నది తెలుస్తోంది. ఇందులో పెద్దలు ఉన్నారా.. వారి నుంచి వస్తున్న ఒత్తిళ్లతో విచారణలో జాప్యం చేస్తున్నారా? అన్న సందేహాలు కలుగుతున్నాయి.

**పాతవారి సహకారం ఉందా?**

ఐదేళ్ల క్రితం ఆర్లపడియ బీట్లో దుంగలను స్వాధీనం చేసుకొని.. పలువురిపై కేసులు నమోదు చేశారు. వారి ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. స్థానిక కూలీలతోనే నరికించి తరలించేందుకు యత్నించినట్లు సమాచారం.

**పట్టనట్లుగా అటవీశాఖాధికారులు** సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా అటవీశాఖాధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆర్లపడియ ప్రాంతంలోనే చెట్లను నరికి తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అయినా ఇంత వరకు అటవీశాఖాధికారులు ఈ ప్రాంతంలో దర్యాప్తు చేయకపోవడం గమనార్హం.

# జడ్పీ తీరు.. నవ్విపోదురూ



కాకినాడ: ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే కీలకంగా ఉన్న జిల్లాపరిషత్తు తీరు ప్రస్తుతం ఆందోళనకర రీతిలో ఉంది. చెప్పుకోవడానికి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులున్నా వాటి నుంచి నయాపైసా రావడం లేదు. ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమైపోయాయి. మరికొన్ని స్థలాలు, భూములు అక్రమణదారుల చెరలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం వసూలు చేయకుండా మిన్నకుండిపోయారు.

**ఎకరాకు రూ.2వేలే**

జిల్లా పరిషత్తుకు ఉమ్మడి జిల్లాలో 108 ఎకరాలకు పైగా సేద్యపు భూములున్నాయి. వాటిలో వరి, ఆక్వా చెరువులు, కొబ్బరి తోటలు, మెట్ట పంటలున్నాయి. సాధారణంగా ఇతరుల భూములకు కౌలు రైతులు ఎకరాకు కనిష్ఠంగా రూ.20 వేలు చెల్లిస్తున్నారు. జడ్పీ భూములకు ఏడాదికి రూ.21 లక్షల ఆదాయమైనా రావాలి. అధికారులు తాజా బడ్జెట్లో ఈ రాబడిని రూ.2.2 లక్షలుగానే చూపించారు. అంటే ఎకరాకు రూ.2 వేలు మాత్రమే లీజు నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గతంలో లీజుకు తీసుకున్నవారు పాతుకుపోయారు. కొత్తగా వేలం లేదు. దీంతో భారీగా ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

**బకాయిల వసూలుపై బాధ్యత లేదా..**

జడ్పీ భూములు లీజుకు ఇచ్చి బకాయిలు వసూలు చేయక రూ.32.29 లక్షల ఆదాయాన్ని కోల్పోయింది. ఇందులో కాట్రేనికోన మండలం అడవిపేట పరిధిలో 50.42 ఎకరాల భూములున్నాయి. 68 ప్రాంతాల్లో కొబ్బరి చెట్లున్నాయి. స్థానిక నేతలు, వారి అనుచరులే లీజుదారులు. రూ.33.56 లక్షల వరకు వారు చెల్లించలేదు. కల్యాణమండపానికి ఏడాదికి రూ.10 లక్షలు చూపారు. నిత్యం శుభకార్యాలు జరుగుతున్నా అంత తక్కువ రాబడి చూపడం విశేషం. కాకినాడలోని వాణిజ్య సముదాయం నుంచి గత నాలుగేళ్లలో రూ.13.94 లక్షల లీజు బకాయిలు పేరుకుపోయాయి. రెండు దుకాణాలను లీజుకు తీసుకున్న ఓ వ్యక్తి రూ.9.20 లక్షలు చెల్లించలేదు. కడియం జడ్పీ పాఠశాల, మండపేట జడ్పీ కాంప్లెక్స్ నుంచీ లీజు సొమ్ము రాలేదు.

**ఆదాయం పెంపు దిశగా చర్యలు..**

–లక్ష్మణరావు, జడ్పీ సీఈవో

జిల్లా పరిషత్తు ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో మరో నిర్మాణం చేపట్టి బ్యాంకుకు అద్దెకు ఇవ్వబోతున్నాం. కల్యాణ మండపాల ధరలను పెంచాల్సి ఉంది. ఆక్రమణల్లో ఉన్న భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

# గడప లేక.. గడపలేక



విజయనగరం : ఉమ్మడి జిల్లాలో టిడ్కో లబ్ధిదారుల సొంతింటి కల నిజం కావడం లేదు. ఏళ్లుగా ఎదురు చూస్తున్నా.. తాళం చేతికి వస్తున్నా గృహాల్లోకి వెళ్లలేని పరిస్థితి. ఇదిగో అదిగో అంటున్నారే తప్ప.. అధికారులు సైతం చర్యలకు వెనకాడుతున్నారు. గతేడాది అయిదారుసార్లు వాయిదా వేశారు. మొన్నటికి మొన్న సంక్రాంతి నాటికి అందిస్తామని చెప్పినా.. మాట తప్పారు. తాజాగా మార్చినాటికని ప్రకటించారు.

**ఎనిమిదేళ్లుగా సాగదీత..**

పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేర్చేందుకు 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మూడు కేటగిరీల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. పనులు పూర్తవుతున్న సమయంలో వైకాపా అధికారంలోకి వచ్చింది. 2022 నాటికి అందిస్తామని జగన్మోహన్రెడ్డి ప్రకటించారు. కొన్నిచోట్ల రివర్స్ టెండరింగ్కు వెళ్లారు. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వలేదు. ఈక్రమంలో పనులన్నీ ఆగిపోయాయి. విజయనగరం సమీపంలోని సారిపల్లి, సోనియానగర్లో కొందరికి ఇళ్లు అప్పగించినా, మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

**రూ.90 కోట్లు అవసరం..**

వివిధ దశల్లో నిలిచిపోయిన 1536 ఇళ్ల నిర్మాణాలు, పలుచోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.90 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఇందులో వసతి కోసమే రూ.20 కోట్లు కావాలి. సాలూరులో 192, బొబ్బిలిలో 432, రాజాంలో 336, నెల్లిమర్లలో 576 గృహాలను పూర్తి చేసేందుకు మరో రూ.70 కోట్లు అవసరం.

**తాగునీరు గగనం..**

సోనియానగర్లో 250 కిలోలీటర్ల నీళ్ల ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. సారిపల్లిలో చంపావతి నది నుంచి 1800 మీటర్ల పైపులైను ఏర్పాటు పనులు చేయాలి

నెల్లిమర్లలో 200 కిలోలీటర్ల సంపు ఏర్పాటు చేశారు

బొబ్బిలి, పార్వతీపురం, సాలూరులో ప్రారంభ దశలోనే ఉన్నాయి. రాజాంలో ఇంకా మొదలు పెట్టలేదు.

**త్వరలోనే పూర్తి..** – పి.శ్రీరామ్మూర్తి, టిడ్కో ఈఈ

గృహ నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇటీవల కొంతమేర నిధులిచ్చింది. మరో రూ.2 కోట్లు మాత్రమే రావాలి. అదనంగా రూ.90 కోట్లు అవసరం. సాలూరు, సోనియానగర్లో మార్చి నాటికి పనులు పూర్తవుతాయి. త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తాం.

# సహకారానికా..'స్వాహా'కార్యానికా..

ఏలూరు: వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు సహకార సంఘాలు, బ్యాంకులను ఆర్థికంగా దెబ్బతీసిన సంగతి తెలిసిందే. చివరకు జిల్లా మార్కెటింగ్ సొసైటీనీ (డీసీఎంఎస్) వదల్లేదు. ఎరువులు, సూపర్బజార్, షాపింగ్ కాంప్లెక్సుల ఆదాయాన్ని పప్పుబెల్లాల్లా ఖర్చు పెట్టేసి అందినకాడికి దండుకున్నారు. ఉమ్మడి జిల్లాకు ఏలూరులో ప్రధాన కార్యాలయం ఉంది. ఆ ప్రాంగణంలో ఉన్న ఓ పాత భవనంలో 15 గదులతో మూడేళ్ల క్రితం లాడ్జి నిర్మాణానికి తెరదీశారు. రూ.25 లక్షలకు పైగా ఖర్చు చేశారని చెబుతున్నా పనులు ఆ స్థాయిలో లేవు. పైగా అవి అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. నిర్మాణ సామగ్రి ముందుగానే కొనుగోలు చేసి వదిలేయడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయి పాడైపోతోంది.

**ఎలా అనుమతించారు?..** అక్కడ పనిచేసే ఉద్యోగులకే లాడ్జి నిర్మిస్తున్నారనే విషయం తెలియని పరిస్థితి. ఒకవైపు ఆ ప్రాంగణంలో సూపర్బజార్, ఎరువుల గోదాము, జనరిక్ ఫార్మసీ ఇలా అనేకం ఉండటంతో నిత్యం జనం, రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఏరికోరి అక్కడే లాడ్జి ప్రతిపాదించడం ఏమిటి? అసలు డీసీఎంఎస్ చేయాల్సిన పని ఇది కాదని రైతులకు ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ సామగ్రి వంటివి అందజేసి వారికి సహాయపడాలని ఉద్యోగులే అంటున్నారు. మరి లాడ్జి ఎందుకోసం నిర్మిస్తున్నారో అర్థం కాలేదు. దీనిపై విజిలెన్స్ విచారణ కోరతామని నాయకులు తెలిపారు

**చేయాల్సిన పనులు బోలెడు..** మూడేళ్ల క్రితం



ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదు. గదుల్లో మార్బుల్స్, టైల్స్ వంటివి అతికించాలి. విద్యుత్తు సౌకర్యం, ఇంటీరియర్ పనులు చేయాలి. గదులకు తలుపులు బిగించలేదు. కొంతమేర సున్నాలు వేశారు. నిర్మాణ పనులు కాకుండా సీలింగ్ చేయడం, వైరింగ్ కనెక్షన్ ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉంటే టైల్స్, విద్యుత్తు సామగ్రి, సిమెంట్, ఇటుకలు తదితర సామగ్రి మూలనపడి ఉన్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణ చేస్తేనే ప్రభుత్వ ఆదాయానికి ఎంత నష్టం వాటిల్లిందో వెలుగులోకి వస్తుంది. డీసీఎంఎస్ ఇన్చార్జి బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్ను వివరణ కోరగా మూడేళ్ల క్రితం రూ.40 లక్షలతో చేపట్టామని, ఇప్పటికే రూ.25 లక్షలు ఖర్చు పెట్టామన్నారు. మరో ఆర్నెళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు.

# కనిగిరి.. ఏదీ జలసిరి?

కనిగిరి : కనిగిరి ప్రాంత ప్రజల ఆశాజ్యోతి... రైతాంగానికి వర ప్రదాయని వెలిగొండ ప్రాజెక్టును నిర్మించి కరువు సీమలో సిరులు పండించాలన్న కోరికకు అడగడుగునా అవాంతరాలు తప్పడం లేదు. రైతుల కడుపు నింపేందుకు స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించాలని ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఎన్నో వ్యవప్రయాసల కోర్చి చివరకు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనా పనుల్లో జాప్యం జరుగు తుండడం, అంచనా వ్యయం తడిసిమోపెడు కావడంతో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించగా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధుల బూచి చూపి పూర్తిగా వెచ్చించక గాలికొదిలేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు నిత్యం పర్యవేక్షిస్తుండడంతో కనిగిరి ప్రాంత రైతాంగం, ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

**పదేళ్ల కిందట...**

జిల్లా కేంద్రం మార్కాపురం ప్రాంతంలోని కాకర్ల సమీపంలో నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కనిగిరి నియోజకవర్గం పరిధిలోని హనుమంతునిపాడు మండలంలో సుమారు పదేళ్ల కిందట 50 కిలోమీటర్లకు పైగా కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. లక్ష



ఎకరాలకు పైగా నీరందించే తూర్పు ప్రధాన కాలువ కనిగిరి, పామూరు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సీఎస్పురం మండలాల మీదుగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి మీదుగా వెళ్తుంది. నిధుల లేమితో కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, .జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పర్యటించి నిధులు వెచ్చిస్తుండడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జూన్, జులై నాటికి వెలుగొండకు నీటిని తరలిస్తామని అధికారులు తెలపడంతో కనిగిరి ప్రజలకు ఫ్లోరైడ్ బాధలు తప్పడంతోపాటు సాగు, తాగునీరు వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు వలసలకు అడ్డుకట్ట పడుతుంది.

**శిథిలావస్థలో కాలువలు...**

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు గత పదేళ్లుగా నిలిచిపోయాయి. దీంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పూడుకుపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మేజరు కాలువతోపాటు మైనరు కాలువలు సైతం దెబ్బతిన్నాయి. కాలువల తవ్వకాలతో భూములు కోల్పోయిన రైతులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందలేదు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని కూడా చేర్చాలని రైతులు, ప్రజల నుంచి డిమాండు ఉంది. ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో నీరందిస్తే సస్యశ్యామలం కావడంతోపాటు పరిశ్రమలకు సైతం నీరందించేందుకు అవకాశం ఉంటుంది.

# జలమే గరళం.. దిన దిన గండం!

మర్రిపాడు : పాలకుల పాపం.. ఏళ్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపమైంది. చిన్నపిల్లల మొదలు పెద్దల వరకు ఫ్లోరైడ్ గుల్ల చేస్తోంది. రెండు దశాబ్దాల్లో తాగునీరు విష తుల్యమై సుమారు 20 మంది ఆ రక్కసికి బలయ్యారని గ్రామస్థులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇప్పుడు కూడా కొందరు కిడ్నీ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికీ ప్రత్యామ్నాయం లేక.. ఆ గరళాన్నే తాగుతున్నామని చెబుతున్నారు. ఇదీ మర్రిపాడు మండలం కంపసముద్రం ఎస్సీ కాలనీవాసుల కన్నీటిగాథ.

మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఆదేశాలతో గురువారం జిల్లా వైద్య బృందం కాలనీలో పర్యటించింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని పరీక్షించింది. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో చేతి పంపులు, కుళాయిల వద్ద తాగునీటిని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్కు పంపింది. గ్రామంలో 16 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించి.. వారి ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరించి.. నెల్లూరులోని ల్యాబ్కు పంపించారు.

**62 కుటుంబాలు.. 322 మంది**

కాలనీలో సుమారు 69 కుటుంబాలు ఉండగా– 332 మంది నివాసం ఉంటున్నారు. 16 మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతుండగా– వీరిలో ముగ్గురు డయాలసిస్ చేయించుకుంటున్నారు. అందరూ పేదలే. కాలనీ ఏర్పడి 50 ఏళ్లకుపైగా అవుతున్నా.. సురక్షిత తాగునీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో అయిదుగురు మృతి చెందారని.. కిడ్నీ సమస్యతోనే బుధవారం రాత్రి సైతం ఓ మహిళ తనువు చాలించగా.. మరో బాలుడు తిరుపతిలోని ఆసుపత్రిలో చేరాడని తెలిపారు.


దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సరైన చికిత్స, మందులు తీసుకోక కిడ్నీ సమస్యలు తెచ్చుకున్నట్లు గుర్తించాం. కాళ్లు, చేతులు, నడుము నొప్పులు వంటివి వచ్చినప్పుడు ఆర?ంపీల వద్దకు వెళ్లి అధిక మోతాదు మాత్రలు, ఇంజక్షన్లు వేయించుకోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఆహార నియమాలు పాటిస్తూ.. సరైన మందులు వాడితే వ్యాధి అదుపులో ఉంటుంది. రక్త పరీక్షల ఫలితాలు వచ్చిన వెంటనే మందులు పంపిణీ చేస్తాం భయాందోళన చెందాల్సిన పని లేదని జిల్లా సర్వైలెన్స్ అధికారి భాస్కర్ తెలిపారు.

నా పేరు చెన్నయ్య. వయసు 26 ఏళ్లు. నాలుగేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. యుక్త వయసులోనే ఏ పని చేయలేకపోతున్నా. నెలకు 8 సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. ఆ బాధ భరించలేకనే ప్రాణం పోతోంది. మా నాన్నకూ కిడ్నీలు దెబ్బతిన్నాయి. మంచానికే పరిమితమయ్యాడు. మందులు, ఆసుపత్రి ఖర్చులకు పింఛను రూ. పది వేలు పోను.. మరో రూ. 7వేలు అదనంగా ఖర్చవుతోంది. మా నాన్నకు పింఛను సొమ్ము రూ. 4వేలు పోను.. మరో రూ.అయిదు వేలు మందులకు ఖర్చవుతోంది. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్లే ఈ సమస్య వచ్చింది.

# ఇక మురుగు.. భూగర్భంలో పరుగు

భీమవరం : తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలకు డ్రెయినేజీ, మురుగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. ఏళ్లుగా నిలిచిపోయిన భూగర్భ మురుగు కాలువ వ్యవస్థ (యూజీడీ), మురుగునీటి నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)లకు కూటమి ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా నిధులు మంజూరు చేయడంతో ఫిబ్రవరి నెలాఖరులో పనులు మొదలు కానున్నాయి. ఇదీ విషయం: తాడేపల్లిగూడెం ఒకటో పట్టణ పరిధిలో 2009లో రూ.61.50 కోట్ల అంచనాతో యూజీడీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లను ఎక్కడికక్కడ ధ్వంసం చేసి మురుగు నీరు పారేందుకు భూమిలో తూరలు ఏర్పాటు చేశారు. రూ.28 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. పైపులైన్ల అనుసంధాన ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. తీరా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన నేతలెవరూ అటు వైపు కన్నెత్తి చూడలేదు. యూజీడీ గాడిన పడాలంటే మురుగు నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. దీని కోసం గతంలో కడకట్ల శివారు యానాదుల కాలనీలో 3.98 ఎకరాల భూమిని కేటాయించారు. రూ.32.14 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

ఇదీ ఉపయోగం: 2019లో వైకాపా హామీల్లో భాగంగా భూగర్భ కాలువ పూర్తి చేస్తుందనుకున్నా అడుగు ముందుకు పడలేదు. పైగా



ఎస్టీపీ లేకపోవడంతో మురుగునీటిని శుద్ధి చేయకుండా ఏలూరు కాలువలో కలిపేస్తున్నారు. దాంతో అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు పారక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కాలువలు, రోడ్లపైకి చేరడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. జిల్లాలో టైఫాయిడ్, డెంగీ బారిన పడుతున్న బాధితులు గూడెంలోనే అధికంగా ఉంటున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు మురుగునీటి సమస్య తీరుతుంది.

పట్టణ పరిధిలో వార్డులు – 18
నివాసితులు – సుమారు 60 వేల మంది
కేటాయించిన నిధులు – రూ.88.18 కోట్లు

# అనుమతులు కొంత.. తవ్వకాలు కొండంత..!

వజ్రపుకొత్తూరు : జిల్లాలో మట్టి, కంకర తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. భూగర్భ గనులు, రెవెన్యూశాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో దందా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' మాదిరిగా సాగుతోంది. కొండలు, గుట్టలు కళ్లెదుటే కరిగిపోతున్నా పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అనుమతులకు మించి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. సామాన్యులు అడ్డుకుంటున్నా అక్రమార్కులు లెక్క చేయట్లేదు.

వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల పరిధి బెండిగేటు–నారాయణపురం మధ్య ప్రభుత్వ భూముల్లో కంకర, మట్టి తవ్వేస్తున్నారు. పూడిలంక రహదారి పనులకు బెండికొండపై కంకర తవ్వకాలకు కొంత అనుమతి ఉంది. దాన్ని ఆసరాగా తీసుకుని అక్రమార్కులు సిండికేటుగా మారి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. రహదారి పనులు పూర్తయినా కంకర తరలించుకుపోతున్నారు. బెండికొండను ఆనుకుని అటవీ భూములున్నాయి. సర్వే నంబరు 1లోని ఈ కొండ చుట్టూ పొక్లెయిన్లతో తవ్వేసి.. రాత్రి వేళ తరలిస్తున్నారు. పీఎంపురం, కొండవూరు, ఉండ్రుకుడియ, తాడివాడ ప్రాంతాల్లోని కొండల్ని సైతం పిండి చేస్తున్నారు.

**వాటినీ వదలట్లేదు..** కవిటి అగ్రహారం వద్ద ప్రైవేట్ వ్యక్తులు సుమారు 40 ఎకరాల భూమి కొనుగోలు చేసి 10 ఏళ్ల కిందట లేఅవుట్ వేసి.. స్థలాలు అమ్మేశారు. ఇందులో అక్రమాలు జరగడంతో అప్పటి నుంచి ఆ భూమి కోర్టు పరిధిలో ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పొక్లెయిన్లతో భారీ ఎత్తున మట్టి తవ్వేస్తున్నారు. ఫలితంగా భారీ గుంతలు ఏర్పడటంతో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సీతారామయ్యను 'న్యూస్టుడే' సంప్రదించగా బెండికొండ పరిధిలో తవ్వకాలపై దృష్టిసారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కోట దారిలో దోపిడీ ఎంత!

జమ్మలమడుగు : పర్యాటక ప్రాంతమైన గండికోటలో కొందరు అక్రమార్కులు అడుగు పెట్టారు. కోటకు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో టోల్గేట్ ఏర్పాటు చేసి అవినీతి దందాకు తెర లేపారు. పర్యాటకులు, విహార యాత్రల కు వచ్చే బడి పిల్లల నుంచి ప్రవేశ రుసుము పేరుతో నగదు తీసుకుంటు న్నారు. గతేడాది నుంచి ముక్కు పిండి వసూళు సాగిస్తున్నారు. ఇందులోనూ కొందరు సిబ్బంది అడ్డదారులు తొక్కారు. రుసుమును సందర్శకుల నుంచి నేరుగా వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేసుకుంటూ జేబులు నింపుకొన్నారు. ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేసింది. దీంతో కలెక్టర్ శ్రీధర్ స్పందించారు. అక్కడ పనిచేసే సిబ్బంది, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో అక్కడ పనిచేసే సిబ్బందికి సంబంధిం చిన వ్యక్తిగత ఖాతాల లావాదేవీలను పరిశీలించాలని సూచించారు.

ఆడిందే ఆట.. పాడిందే పాట: 2024లో అధికారులు టోల్గేట్ ఏర్పాటు చేశారు. పర్యాటకుల నుంచి ప్రవేశ రుసుము వసూలు, పారిశుద్ధ్య పనులకు సుమారు 12 మంది సిబ్బందిని నియమించారు. ఆ సమయంలోనే విమర్శలు వెల్లువెత్తాయి. తమకు నచ్చిన వారిని నియమించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

పర్యాటకులతో ఎలా ప్రవర్తించాలో కూడా వీరికి అవగాహన కల్పించలేదు. దీంతో సందర్శకులను ఇబ్బంది పెట్టేలా కొన్నిసా ర్లు దురుసుగా ప్రవర్తించిన ఉదంతాలున్నాయి. గండికోటను చూసేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విదేశాల నుంచి వచ్చే సందర్శకుల నుంచి టోల్గేట్ పేరిట వసూలు చేసిన డబ్బుతో ప్రతి నెల వీరికి రూ. లక్షల్లో వేతనాలు చెల్లించారు. అదే సమయంలో సందర్శకులకు వసతుల కల్పనపై కనీసం దృష్టి పెట్టలేదు. ఈ విషయమై విమర్శలు వచ్చినా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ కీలక అధికారి పాత్ర ఉండటమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ముహూర్తం కుదిరినట్టే..



నక్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. దీని శంకుస్థాపనపై స్వయంగా ముఖ్యమంత్రే కీలక ప్రకటన చేయడంతో జిల్లా వాసుల్లో ఉత్సాహం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు కానున్న భారీ పరిశ్రమ ఈ స్టీల్ప్లాంటే కావడం విశేషం. దాదాపు ఏడాది కాలంగా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్ ఈ పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైన భూముల కేటాయింపులో భాగంగా నక్కపల్లి మండలాన్ని సూచించగా, దీనికి పరిశ్రమ యాజమాన్యం అంగీకారం తెలిపింది. ఇక్కడ తొలి విడతలో 2020 ఎకరాలను కేటాయించడం, దీనికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రస్తుతం రూ. 60వేల కోట్లతో పనులు చేపడుతుండగా, ప్లాంటును 2029నాటికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంత్రి అనిత జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ స్థానిక రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టారు. భూములు తీసుకున్న ప్రాంతాల్లో నిర్వాసితులకు సంబంధించి ప్యాకేజీ ఖరారు చేయడంతోపాటు, ఇప్పటికే పునరావాస కాలనీని కేటాయించారు. అక్కడ మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా అధికారులు పనులు చేయిస్తున్నారు. మరోవైపు రెండో విడత కింద మరో 3200 ఎకరాలను సేకరించడానికి చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన కార్యాచరణ జరుగుతోంది. దీనిపట్ల రైతులనుంచి భిన్న స్పందన ఉంది.

ఇది అందుబాటులోకి వస్తే మరో రూ. 75 వేల కోట్లతో ప్లాంటును విస్తరించనున్నారు. రెండు విడతలుగా రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటు కానుంది. ఈ క్రమంలోనే దీని ఏర్పాటుకు రాష్ట్రం తరఫున అవసరమైన అనుమతులు ఇవ్వడం, క్యాబినెట్లో తీర్మానం అన్ని చకాచకా జరిగిపోయాయి. మరోవైపు కేంద్రం నుంచి రావల్సిన అనుమతులను రప్పిస్తున్నారు. దీన్ని వీలైనంత వేగంగా ఏర్పాటు చేయించేందుకు అధికార యంత్రాంగానికి ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించింది. మరోవైపు సంబంధిత ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు భూములు పరిశీలించారు. ప్లాంటు నిర్మాణం జరిగే ముఖ్య ప్రాంతాలన్నింటిలోనూ ఇటీవలే మట్టి పరీక్షలు చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలి విడత పనులను మొదలు పెట్టడానికి వీలుగా వచ్చేనెల రెండో వారం తర్వాత శంకుస్థాపన చేయడానికి నిర్ణయించిన ట్లు దావోస్లో సంస్థ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో సీఎం చంద్రబాబు ప్రకటించడం అన్ని వర్గాల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కంపెనీ ఏర్పాటైతే దీని ద్వారా భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి.

# మరుభూముల్లో భూచోళ్లు!



గుత్తి : గుత్తిలో రూ.కోట్లు విలువైన శ్మశానస్థలాలను అక్రమార్కులు కబ్జా చేశారు. వీరు మరుభూములను సైతం వదలడం లేదు. రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కై శ్మశానాల్లో ఇంటి పట్టాలు మంజూరు చేశారు. మూడేళ్ల కిందట గుత్తిలోని కర్నూలు రోడ్డులో పాతహైవే పక్కన ఉన్న శ్మశానంలో కొందరు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చి ఇంటి పట్టాలు పొందారు. వీరంతా ఇప్పుడు ప్లాట్లు వేయటంతో దొంగ పట్టాల విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 30 సెంట్ల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి రాళ్లను పాతారు. దీనిపై సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేస్తున్నారు.

**నోటీసులకే పరిమితం**

సర్వే నంబరు 714లో జారీ అయిన పట్టాలు వెలుగులోకి రావడంతో సంబంధిత వ్యక్తులకు రెవెన్యూ అధికారులు నోటీసులను ఇచ్చారు. 'మీకు జారీ చేసిన పట్టాలను ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ' ఇవ్వాలని కోరారు. రెండు సార్లు అనంతపురం ఆర్డీవో సైతం నోటీసుల ను ఇచ్చారు. పట్టాదారులతో సంజాయిషీ తీసుకున్నారు. ఇప్పటికీ ఆ పట్టాలు రద్దు చేయకపోవడం గమనార్హం.


**ఇటుకల బట్టీ పేరుతో కబ్జా**

ఓ వ్యక్తి శ్మశానవాటికలో కొన్నేళ్ల కిందట ఇటుకల బట్టీ నిర్వహిస్తూ వచ్చారు. తర్వాత బట్టీని ఎత్తేసి ఐదుగురు పేర్లతో పట్టాలు పొందాడు. శ్మశాన వాటిక సమీపంలోనే ఆదర్శ పాఠశాల ఉంది. పక్కనే పాతహైవే రోడ్డు ఉంది. దీంతో ఇక్కడి స్థలాలకు విపణిలో మంచి డిమాండ్ ఉంది. మారుతీ నగర్కు సమీపంలో ఉన్న సర్వేనంబర్ 714లోని శ్మశానవాటిక స్థలంలోనూ 15 మందికి పట్టాలిచ్చారు. ఇక్కడ మరుభూమి కోసమని 3.57 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే 2.82 శ్మశానం కాగా, మిగిలిన స్థలాన్ని కబ్జా చేశారు. కొందరు పునాదులు వేయగా, మరికొందరు భవంతులను నిర్మించుకున్నారు.

**శ్మశాన స్థలాలను పరిరక్షిస్తాం** –పుణ్యవతి, తహసీల్దారు, గుత్తి

గుత్తి శ్మశాన స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటాం. కర్నూలు రోడ్డులో పట్టాలు పొంది హద్దురాళ్లను ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం. డిప్యూటీ తహసీల్దారు సూర్యనారాయణకు వీఆర?లతో కలిసి ప్లాట్లు తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

# తుది దశకు.. పుష్కర నివేదిక!



రాజమహేంద్రవరం : 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రత్యేక అధికారి పాండ్యన్ నేతృత్వంలోని బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం అధికార యంత్రాంగం అమరావతి బయలుదేరి వెళ్లనుంది. దీంతో పుష్కర పనులు కొలిక్కి వస్తాయని యంత్రాంగం భావిస్తోంది. వచ్చే ఏడాది జూలై నెలాఖరున ప్రారంభమయ్యే పుష్కరాలకు సంబంధించి నిధులు కేటాయించాల్సి ఉంది. పనులు చేపట్టేందుకు ఇంకా ఏడాదిన్నర మాత్రమే మిగిలి ఉంది. దీనిపై అధికార యంత్రాంగం జిల్లాలో మూడుసార్లు సమీక్షించింది. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తాజాగా ఈ ప్రతిపాదనలు అమరావతిలో పురపాలిక విభాగానికి అందజేశారు. ముఖ్యమంత్రి సమీక్ష తర్వాత పూర్తి స్థాయిలో చేపట్టాల్సిన విధి విధానాలపై నిర్ధారణకు రానున్నారు.

**పర్యాటకంగా అభివృద్ధి చేయాలని..**

మరోవైపు గోదావరి తీరాన్ని పూర్తి స్థాయిలో పర్యాటకంగా తీర్చిదిద్దాలని ఇప్పటికే నిర్ణయించారు. ఈ మేరకు పుష్కరఘాట్ వద్ద పనులు చేపట్టారు. వీటి కోసం నిధులు భారీగానే ఖర్చు చేస్తున్నారు.

గోదావరి తీరం అనుబంధంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించారు.

ఆలయాల అభివృద్ధి, గట్ల పటిష్ఠంపై దృష్టి సారించారు. ఆయా శాఖల పరిధిలో జలవనరులశాఖ, విద్యుత్తు, అగ్నిమాపక, పోలీసు, మత్స్యశాఖల ద్వారా చేపట్టే పనుల వివరాలు నివేదికలో పొందుపర్చారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు అప్పటికప్పుడు ఏర్పాటు చేయాల్సిన పుష్కర నగరాలు, రద్దీ నియంత్రణ, వసతి సౌకర్యాలు, రవాణా వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొంటారు.

**ఘాట్ల విస్తరణపై దృష్టి**

పుష్కరాలకు ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంతోపాటు కొవ్వూరు, నిడదవోలులో ఏర్పాట్లు చేయనున్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని నగరంతోపాటు గోదావరి ఆనుకొని ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ ఘాట్లను విస్తరించనున్నారు. వీటి సామర్థ్యాన్ని శాశ్వత ప్రాతిపదికన మెరుగుపర్చనున్నారు. ఇటు ధవళేశ్వరం నుంచి కాతేరు వరకు, అటు తొర్రేడు, సీతానగరం వరకూ ఘాట్లను పటిష్ఠం చేసి పుష్కర స్నానాలకు అనుకూలంగా తీర్చిదిద్దనున్నారు. వేమగిరి నుంచి విజ్జేశ్వరం వరకూ కూడా గట్లు బలోపేతం చేయనున్నారు.

# ట్రిపుల్ ఐ'ఢీ'..!

ఎచ్చెర్ల: రాజీవ్గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్(ట్రిపుల్ ఐటీ)లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. డైరెక్టర్ నియామకంలో తీవ్ర జాప్యం కారణంగా పాలన గాడి తప్పింది. ఫలితంగా అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది మధ్య అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోతున్నాయి. నిర్ణయాలు తీసుకునేవారు లేక నాణ్యమైన విద్య, సౌకర్యాలకు విద్యార్థులు నోచుకోలేకపోతున్నారు. ఏడాదిన్నర కిందట ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ రాజీనామా చేశారు. కొత్తవారిని నియమించకపోవడంతో ఆయనే ఇంకా కొనసాగుతున్నారు. ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనికి తోడు అంతర్గత కుమ్ములాటలు, ఆధిపత్య పోరు పెద్దఎత్తున నడుస్తున్నాయి. ఇటీవల క్యాంపస్లో క్వాంటమ్ కంప్యూటింగ్పై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఉన్నతాధికారులు హాజరుకాకపోవడమే అందుకు నిదర్శనమనే వాదనలు వినిపిస్తున్నాయి.

విద్యార్థినుల ఫిర్యాదు ఏమైందో..?

క్యాంపస్లో విద్యార్థినులపై జరుగుతున్న వేధింపులపై వర్సిటీ ఉన్నతాధికారులకే నేరుగా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై రాష్ట్ర మహిళా కమిషన్తో పాటు వర్సిటీ నియమించిన కమిటీ సైతం విచారించి వాస్తవమని నిర్ధారించినా బాధ్యులపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.



ఏళ్ల తరబడి పాతుకుపోయారు..


చాలా మంది ఏళ్ల తరబడి క్యాంపస్లోనే పాతుకుపోవడంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రెగ్యులర్ ఆచార్యులు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ ఆర్థిక అక్రమాలకు తెర లేపుతున్నారని ప్రచారం జరుగుతోంది. వారితో పాటు అత్యంత కీలకమైన పరీక్షలు, కొనుగోళ్లు, ఫైనాన్స్, ఇతర విభాగాల్లో కొందరు క్యాంపస్ ప్రారంభం నుంచి అవే బాధ్యతల్లో కొనసాగుతూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం క్యాంపస్లో 5 వేల మందికిపైగా చదువుకుంటున్నారు. వారికి వారానికి మూడు, నాలుగు సార్లు గుడ్డు, ఒకసారి చికెన్తో భోజనం పెట్టాలి. అందుకు ఎలాంటి టెండర్ విధానం లేకుండానే కొనుగోళ్లు జరిపి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. అడిగేవారు లేకపోవడంతో కొందరు సిబ్బంది బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించట్లేదు.

# ఉపాధికని వస్తారు.. ఉన్నదంతా ఊడ్చేస్తారు..!

శ్రీకాకుళం :గత నెల 12న జిల్లా కేంద్రంలో ఓ విశ్రాంత ఉద్యోగి ఆటోలో ప్రయాణిస్తుండగా.. ఆయన బ్యాగ్ను కత్తిరించి బ్యాంకు నుంచి తీసుకెళ్తున్న రూ.4 లక్షల నగదును దుండగులు దోచేశారు. అంతర్రాష్ట్ర ముఠా పక్కాగా రెక్కీ చేసి ఇలా చేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కొన్ని నెలల కిందట వజ్రపుకొత్తూరు మండలం పూండిలోని ఓ బంగారం దుకాణంలో 18 తులాల ఆభరణాలను మధ్యప్రదేశ్కు చెందిన ముఠా ఎత్తుకెళ్లిపోయింది. స్థానికంగా వ్యాపారుల ముసుగులో కొన్ని రోజులు తిరిగి.. ప్రణాళిక ప్రకారం దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పేరుతో ఎక్కడెక్కడి నుంచో జిల్లాకు వస్తారు. పగటి పూట చిరు వ్యాపారుల ముసుగులో వీధుల్లో తిరుగుతారు. ఆ సమయంలో రెక్కీ చేసి.. చీకటి పడిన తర్వాత నేరాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, బంగారు దుకాణాలు, బ్యాంకులే లక్ష్యంగా చోరీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానిత వ్యక్తులు, అపరిచితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా గతేడాది నమోదైన వాటిల్లో 281 కేసులు పరిష్కరించారు. పట్టుబడిన నిందితుల్లో 50 శాతంపైగా అంతరాష్ట్ర దొంగలే ఉన్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా ప్లాస్టిక్ సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, విద్యుద్దీకరణ పరికరాలు అమ్మే పేరుతో వీధుల్లో తిరుగుతున్నారు. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వచ్చి పాడైపోయిన టీవీలు, ఫ్రిడ్జు, ఇతర పనికిరాని వస్తువులు కొంటామని చెబుతామని మాటల్లోకి దించి రెక్కీ నిర్వహించి.. రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు.



**వివరాల సేకరణ..**

ఈ ముఠాలపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జిల్లాలో వ్యాపారాలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 360 మంది నుంచి వేలిముద్రలు, ఫొటోలు, ఆధార్ వంటి వివరాలు తీసుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ నుంచి 180, పలాస 120, టెక్కలిలో 60 మందికిపైగా అంతర్రాష్ట్ర వ్యక్తులను గుర్తించారు.

**అప్రమత్తంగా ఉండాలి..:** జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలపై దృష్టి సారించాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి. రాత్రి పూట బందోబస్తును పటిష్ఠం చేశాం. ఇంటి తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లేవారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్హెచ?ంఎస్)ను సద్వినియోగం చేసుకోవాలి.
కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

## ప్రాంతీయ ఆసుపత్రికి మహర్దశ!

నర్సీపట్నం : ప్రసూతి సేవల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో సేవలు మరింత మెరుగవుతున్నాయి. మాతాశిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ మరిన్ని సదుపాయాలను సమకూర్చుతున్నారు. ప్రతినెలా ఇక్కడ 300 పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. హైరిస్క్ కేసులను మూడు రోజుల ముందుగానే ఇక్కడి శిశుజనన నిరీక్షణ కేంద్రానికి తరలించేందుకు వీలుగా 30 పడకలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రానికి అవసరమైన భవనం నిర్మాణానికి రూ.2.10 కోట్లని డెక్కన్ ఫైన్ కెమికల్స్ యాజమాన్యం సామాజిక బాధ్యత కింద మంజూరు చేయడం, నిర్మాణ పనులకు సభాపతి అయ్యన్న కొబ్బరికాయ కొట్టడం తెలిసిందే. శరవేగంతో పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గర్భిణుల వెంట సహాయకులకు ఇక్కడే వసతి, భోజనం సమకూర్చుతారు. ప్రస్తుతం 150 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు విస్తరించేందుకు ప్రతిపాదన వెళ్లింది. అనుమతి లభించగానే తదనుగుణంగా సదుపాయాలు పెరుగుతాయి. ఆసుపత్రికి రోజూ వందలమంది ఔట్ పేషేంట్లు వస్తుంటారు. వీరికి ఇబ్బంది లేకుండా ఆరు ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రూ.9.5 కోట్లు ఖర్చుతో నిర్మించిన కొత్త భవనంలోనే ఔట్ పేషేంట్లకు వైద్య సేవలు అందించనున్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలను ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వారి కోసం ఇటీవల క్యాంటీన్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.



గతంలో అధికంగా కేసులను విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపించేవారు. ఇప్పుడు ఆసుపత్రిలోనే వైద్యం అందించేలా సదుపాయాలను పెంచారు. కేజీహెచ్‌కు పంపే కేసులు గణనీయంగా తగ్గిపోయాయి. ఎన్టీఆర్ వైద్యసేవ విభాగంలో సేవలు మెరుగుపర్చారు. సాధారణ శస్త్ర చికిత్సలు ఇక్కడే చేస్తున్నారు.
గర్భిణులకు 18 నుంచి 22 వారాల మధ్య స్కానింగ్ చేసేందుకు రూ.35 లక్షల ఖర్చుతో స్కానింగ్ యంత్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ యంత్రం ద్వారా స్కానింగ్‌లు చేస్తారు. రోజుకు కనీసం పదిహేను స్కాన్‌లు చేయాలన్నది మార్గదర్శకం. ఇప్పటి వరకు ఈ ఆసుపత్రిలో ఈ సదుపాయం లేదు. ప్రైవేటు ల్యాబుల్లో చేయించుకోవాల్సి వచ్చేది. రూ. 2500 నుంచి రూ.3వేలు వరకు గర్భిణులు వెచ్చించాల్సివచ్చేది.
స్కానింగ్ పేదలకు భారంగా ఉండేది. ఇప్పుడా ఇబ్బంది తప్పింది. ఇటీవలే లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ మంజూరైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న లేబొరేటరీ పూర్వపు ఆర్టీపీసీ ల్యాబ్ భవనంలోకి మార్పు చేయనున్నారు. ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లోని పరికరాలన్నీ వైద్య కళాశాలకు ఇవ్వడంతో భవనం ఖాళీగా ఉంది. దీన్నిప్పుడు వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఆసుపత్రిలోని మురుగునీరంతా బయటకు పోయేలా ఇటీవల డ్రైనేజీలను అభివృద్ధి చేశారు.
కేజీహెచ్ నుంచి 12మంది చొప్పున పీజీ వైద్య విద్యార్థులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, ఆర్థో తదితర విభాగాల్లో సేవలు అందుతున్నాయి. జిల్లా బాలల సురక్షకేంద్రం ఇక్కడే ఉంది. దీంట్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## రూ.20 కిలో గోధుమ పిండి

కర్నూలు : కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుకగా రూ.20కే కిలో గోధుమ పిండి పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఇస్తున్న బియ్యం, చక్కెర, జొన్నలు, రాగులతో పాటు కొత్తగా జనవరి 1 నుంచి పట్టణ ప్రాంతాల్లోని కార్డుదారులకు కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. కర్నూలు నగరం, నంద్యాల పురపాలకలోని చౌక దుకాణాలకు గోధుమపిండి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు.
ఉమ్మడి జిల్లాలోని అన్ని చౌకదుకాణాల ద్వారా జనవరి నుంచి కార్డుదారులందరికీ గోధుమ పిండి పంపిణీ చేసేందుకు తొలుత సన్నాహాలు చేశారు. తాజాగా ముందు పట్టణ ప్రాంతాల్లో ఇవ్వాలని




నిర?యించారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతారు.
**1.20 లక్షల మందికి లబ్ధి**
కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 1,13,398 మంది కార్డుదారులు ఉండగా 70 టన్నుల గోధుమ పిండి వచ్చింది. 70 వేల మందికి పంపిణీ చేయనున్నారు. నంద్యాల మున్సిపాలిటీలో 71,763 మంది కార్డుదారులు ఉండగా 50 టన్నుల వరకు పిండి వచ్చింది. 45-50 వేల మందికి గురువారం నుంచి అందించనున్నారు.

## కొత్త పొద్దు.. కొంగొత్త ఆశలు

కాలగమనంలో.. ఓ మజిలీ ముగిసింది!!
గడిచిన ఏడాదిలో.. గడించిన అనుభవాలు!!
కొత్త కోరికలు.. కొత్త ఆశలతో కొత్త పొద్దును ఆహ్వానిద్దాం
సవాళ్లని స్వీకరిద్దాం శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి!! నిరాశ నుంచి ఆశా శిఖరానికి..
ప్రస్థానం సాగిద్దాం!!

కాలమనే నిరంతర ప్రవాహంలో.. ఎన్నెన్నో సుడులు, మలుపులు.. ఒక చోట సెలయేరులా పరిగెత్తితే, మరోచోట జలపాతంలా దూకుతుంది.. ఇంకోచోట పిల్ల కాల్వ అవుతుంది. మనిషి జీవితమూ అంతే.!! ముసురుకున్న చీకట్లను చీల్చుకుంటూ వెలుగు బాటను వెతుక్కుంటూ ముందుకు సాగిపోవాలి.. ఆశల తీరానికి చేరుదాం.. ఆనందాల మజిలీలో సేద తీరుదాం.. జిల్లా ప్రజలు కొత్త వత్సరానికి ఘన స్వాగతం పలికారు. అర్ధరాత్రి యువత సందడి చేసింది.. సమయం 12:00 కాగానే రహదారులపై చేరుకుని కేరింతలు కొట్టారు. కేకులు కోసి ఆనందాన్ని పంచుకున్నారు.

# పురం.. పట్టు పరిశ్రమకు వరం



హిందూపురం : హిందూపురం ప్రాంతం పట్టు పరిశ్రమ రంగానికి (మల్బరీ) ప్రసిద్ధి. ఇక్కడ రైతులు సాగుచేసే పంట మొదలు కొని పండించిన పట్టుగూళ్ల ఉత్పత్తులను స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే అమ్ముకోవడం.. వీటిని రీలర్లు తీసుకొని వివిధ రకాల పట్టుదారం తయారు చేయడం.. దారం ఉపయోగించి చేనేత కార్మికులు మగ్గాల సాయంతో చీర నేయడం. పట్టణంలోనే పట్టుచీరలను సామాన్య వ్యాపారులు విక్రయించడం.. ఆ తర్వాత బడా పారిశ్రామికవేత్తలు కాంచీపురం, బెంగుళూరు, చెన్నై, మైసూరు తదితర పెద్ద నగరాలకు ఎగుమతి చేసి...రోజుకు రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు చేపడుతూ లాభాలను ఆర్జిస్తున్నారు. రైతులు, గ్రామీణ కూలీలు, రీలర్లు, చేనేత కార్మికులు, వ్యాపారులతో పాటు ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వానికి పన్నుల రూపేణ ఆదాయ వనరుగా ఉంది.
కిరికెరలో పట్టు పరిశోధనాభివృద్ధి సంస్థ: బెంగుళూరు రహదారిలో కిరికెర గ్రామం వద్ద 70 ఎకరాల విస్తీర?ంలో 1995లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పట్టు పరిశోధనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే సీనియర్ శాస్త్రవేత్త ఒకరు డైరెక్టర్‌గా, ఐదుగురు శాస్త్రవేత్తలు పరిశోధనలతో మల్బరీ మొక్కలు, గుడ్లు ఇతరత్రా కొత్త వంగడాలు సృష్టించి.. ప్రయోగాత్మకంగా రైతులకు ఇస్తారు. మంచి దిగుబడులు వచ్చిన తర్వాత వాటిని రాష్ట్రంలోని ఇతర జిల్లాల రైతులకు చేరుస్తారు. ఇక్కడే పంట సాగుచేసి, పట్టుపురుగులను పెంపకం చేసి, అల్లిన గూళ్లను దిగుబడి రూపంలో గుర్తించడానికి 16మంది అధికార, అనధికార సిబ్బంది ఉన్నారు. 150 పట్టుపురుగుల జాతుల రకాలను సంరక్షిస్తారు. మల్బరీని ఆశించే చీడపురుగుల నియంత్రణకు మందులను కనుగొంటారు. డిగ్రీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థులకు పరిశోధనపై శిక్షణ ఇస్తారు.
**మార్కెట్:** హిందూపురంలో ఉన్న పట్టుగూళ్ల విక్రయ కేంద్రానికి రోజూ 4వేల క్వింటాళ్ల పట్టుగూళ్లను రైతులు తెచ్చి విక్రయిస్తారు.
రీలింగు యూనిట్లు: కొనుగోలు చేసిన గూళ్లను ఉడికించి పట్టుదారం తీయడానికి రీలర్లు స్థానికంగానే 20 రీలింగు యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు.
పట్టుచీరల తయారీ పరిశ్రమలు: ముద్దిరెడ్డిపల్లిలో పట్టుచీరల తయారీకి పారిశ్రామిక వ్యాపారవేత్తలు 30కుపైగా పరిశ్రమలు స్థాపించుకున్నారు. పరిసరాల్లో పెద్దరెడ్డిపల్లి, వీవర్స్‌కాలనీ, సోమందేపల్లి, తదితర చోట్లా పట్టుచీరల తయారీ మగ్గాలు వేల సంఖ్యలో ఉన్నాయి.
సాగు విస్తీర?ం: రాష్ట్రంలో 1.46 లక్షల ఎకరాల్లో మల్బరీ పంట సాగులో ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలోనే 54,146 ఎకరాల్లో సాగవడం గమనార్హం. హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో 30వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 80వేల రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

# అదిగో.. ఆశల వసంతం 2026



అనకాపల్లి : కొత్త సంవత్సరం ఎన్నెన్నో ఆశల వేదిక.. కొత్త అవకాశాలు, సవాళ్లను మోసుకుంటూ 2026 మన ముందుకు వచ్చేసింది. నూతన వత్సరం జిల్లా ప్రజలకు కొన్ని వరాలను తీసుకొచ్చింది. వీటిని సరిగ్గా వినియోగించుకోగలిగితే మరింత మందికి ప్రగతి కాంతులు అందుతాయి.
**పారిశ్రామిక వెలుగు...** అనకాపల్లి జిల్లాలో 2025లో పారిశ్రామికంగా కీలక అడుగులు పడ్డాయి. ఈ ఏడాది వాటిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో పలు ఒప్పందాలు జరిగాయి. ఇందులో భాగంగా కీలక సంస్థ అనకాపల్లిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయి. నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్ కంపెనీ ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇదే మండలంలో గ్లోబల్ టాయ్స్ పార్కు ఏర్పాటు పనులు ఈ ప్రారంభం కానున్నాయి. రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ సంస్థ సౌరవిద్యుత్తు పరికరాల తయారీ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాదే ఈ పరిశ్రమ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.
**చేరువలో చిరకాల స్వప్నం..** జిల్లా పరిధిలో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు పోలవరం ఎడమ కాలువ కాలువ పనులు చకచకా జరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం రూ. 331 కోట్లతో నిర్మాణాలు చేస్తున్నారు. ఇప్పటికే తుని-నర్సీపట్నం మధ్య అక్విడక్ట్ పనులు పూర్తయ్యాయి. తాండవ నదిపైనా నిర్మాణాలు పూర్తయ్యాయి. దీన్ని జిల్లాలోని కాలువకు అనుసంధానించేందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసి అన్నదాతలకు సాగునీరు అందించనున్నారు. ఇదే పూర్తయితే.. జిల్లాలోని వేలాది ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది.
**ఇక చకచకా..** అల్లూరి జిల్లా మీదుగా విజయనగరం నుంచి రాజమహేంద్రవరం వరకు 516-ఇ జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి అల్లూరి జిల్లాలోని అరకులోయ, పాడేరు మీదుగా వెళ్లనుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. హుకుంపేట దగ్గర బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అరకు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ పనులు అవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇవి పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో ఇకపై జిల్లా ప్రజలు, పర్యాటకులకు రాకపోకలకు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.
**ఎంఎస్ఎంఈలతో స్థానికులకు ఉపాధి..** ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇప్పటికే అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇంకా ఏర్పాటు చేయలేదు. భూములు కేటాయింపు దాదాపు అన్నిచోట్లా పూర్తిది. ఏపీఐఐసీ అధికారులు ఈ ఏడాది మౌలిక వసతులు కల్పిస్తే చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు ముందుకు రానున్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు కూడా ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి.

# రోగులకు అండగా... సేవలు మెండుగా!

నర్సీపట్నం : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగవుతున్నాయి. ఆధునిక వసతులు, నిపుణులైన వైద్యులు ఉండడంతో చాలామంది విశాఖపట్నం వెళ్లకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందుతున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో గతంలో నెలకు నాలుగైదు వందల ప్రసవాలు జరిగేవి. ప్రైవేటుగానూ ప్రసూతి సేవలు మెరుగుపడటంతో ఈ ఆసుపత్రికి ప్రసవాల కోసం వచ్చేవారు తగ్గుతున్నారు. పసికందులకు అవసరమైన వార్మర్లు, ఫొటో థెరపీ యూనిట్లు సైతం ప్రైవేట్ పిల్లల ఆసుపత్రుల్లో ఉంటున్నాయి. ఇటీవలి కాలంలోనే రెండు పిల్లల ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. మానసిక ఒత్తిడి, వ్యసనాలు గుండెకు ముప్పు తెస్తున్నాయి. హృద్రోగ సమస్యలకు గతంలో విశాఖపట్నం వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వారానికి ఒకరోజు విశాఖ నుంచి గుండెవైద్య నిపుణులు వస్తున్నారు. ఓ ప్రముఖ గుండె వైద్యనిపుణుడు త్వరలో పెదబొడ్డేపల్లి ఆసుపత్రిలో చికిత్సలు అందించనున్నారు. అన్ని వసతులతో ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. రేడియాలజిస్టు, న్యూట్రిషన్ నిపుణులు సైతం పట్టణంలో సేవలు అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఫిజియోథెరపీ ఆసుపత్రులు పెరిగాయి. నగరాల్లో మాదిరి 24 గంటలు అందుబాటులో ఉండే కార్పొరేట్ మందుల దుకాణాలు సైతం పలుచోట్ల వెలిశాయి. ఇటీవలి కాలంలో యువ వైద్యులు ఎక్కువగా ఆసుపత్రులు తెరిచారు. ప్రత్యేక సందరాలేను అనుసరించి ఉచిత వైద్య శిబిరాలు సైతం నిర్వహించి రోగులకు సాంత్వన కలిగిస్తున్నారు. ఎం.ఆర్.ఐ స్కాన్ సదుపాయంతో గతేడాది నుంచి ఓ ల్యాబ్ పనిచేస్తోంది. కొత్తగా మరిన్ని ల్యాబ్‌లు వచ్చాయి. గతంలో ఒకరిద్దరే ఎముకుల వైద్య నిపుణులు ఉండేవారు. వీరిసంఖ్య ఇప్పుడు పెరిగింది. నర్సీపట్నం మన్యం ముఖద్వారం ఉంది. ఇక్కడి వైద్యులపై నమ్మకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకేవీధి, చింతపల్లి, కొయ్యూరు



మండలాల నుంచి సైతం రోగులు వచ్చి ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. దంత, కంటివైద్యులు సైతం పెరిగారు. ఆధునిక యంత్రాలతో ఇప్పుడు ఈ వైద్యం అందుతోంది. నగరాల్లో మాదిరి బహుళ అంతస్తుల్లో కార్పొరేట్ మాదిరి ఆసుపత్రులు ఏర్పాటు కావడం గమనార్హం.

## శుచి.. రుచి.. ఆరోగ్యం

నూజివీడు : ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన ఆరోగ్యకమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో 'స్మార్ట్ కిచెన్'ను ఏర్పాటు చేశారు. హరేకృష? మూమెంట్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రైస్ స్టీమర్లను సిద్ధం చేశారు. ట్రయల్ రన్ నిర్వహించారు. ఇందులోనే ఇడ్లీ కూడా తయారవుతుంది. చట్నీ తయారీ, కూరగాయలు కోసే యంత్రాలు, గంటలో మూడు వేల దోసెలను వేసే యంత్రాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ కిచెన్‌లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తాజా కూరలు నాణ్యమైన ముడి పదార్థాలతో భోజనం తయారు చేస్తారు. ఆహార పదార్థాల నిల్వ నుంచి వడ్డింపు వరకు పరిశుభ్రత, ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తామని ఏవో లక్ష్మణరావు



పేర్కొన్నారు. వంటగది పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల అభిప్రాయాలను స్వీకరించి అవసరమైన మార్పులు చేస్తామన్నారు. అకడమిక్ డీన్ చిరంజీవి, శ్రీకాకుళం ఇన్‌ఛార్జి రఘు, హరేకృష? మూమెంట్ పర్యవేక్షకుడు జానకీరామ్ మాట్లాడుతూ 50 నిమిషాల్లో అయిదు వేల మందికి ఆహారం సిద్ధం అవుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రి కొలుసు పార్థసారథిలతో కలిసి వీటిని ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందుకు అనుగుణంగా ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

## చూసీ.. చూసీ.. సేతులెత్తేశారు!

కైకలూరు : జిల్లాలోని శిథిల వంతెనల చింత తీరడం లేదు. నిర్మించి మూడు దశాబ్దాలు గడిచిపోవడంతో సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. శ్లాబ్ నుంచి పెచ్చులూడి, పిల్లర్ల నుంచి రాళ్లు ఊడి పడుతున్నాయి. రక్షణ గోడలు బీటలు వారి, కూలిపోయి స్థితిలో ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేస్తే మరికొంత కాలం వినియోగించుకోవచ్చు. ఏళ్లుగా నూతన వంతెనలు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. అవి కూలితే గ్రామాల మధ్య బంధాలు తెగిపోతాయి. మండవల్లి పసలపూడి, చింతలపూడి, కొమ్మల్లమూడి, లేల్లాపూడి గ్రామాలను కలిపే గుడివాడ ఛానెల్‌పై 50 ఏళ్ల కిత్రం నిర్మించిన వంతెన గోడల్లోని ఇటుక రాళ్లు బయటకు రాలి పడుతున్నాయి. రేపో మాపో కూలేందుకు సిద్ధంగా ఉంది.
**ఆందోళన కలిగిస్తున్న వారధులు**
మండవల్లి మండలం భైరవపట్నం, ప్రత్తిపాడు, తక్కెళ్లపాడు గ్రామాలను కలిపే పోల్‌రాజ్ డ్రెయిన్‌పై వంతెన బీటలు వారి, రక్షణ గోడలు కూలిపోయాయి. ఈ వంతెన మీదుగా 15వేల మంది ప్రజలు వెళుతున్నారు. బ్రిటిష్ కాలంలో ఉంగుటూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన వారధి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇక్కడ ఉన్న టోల్‌గేట్ ను తప్పించుకోవడానికి చాలా మంది వాహనదారులు దీన్నే వినియోగిస్తున్నారు. 20 పంచాయతీలు ఉంగుటూరు వచ్చేందుకు ఇదే ఆధారం.



కైకలూరు కోరుకొల్లు ఏఎంసీ మార్గంలో పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థ కు చేరింది. నిత్యం 40 టన్నులకు పైగా ఆక్వా ఉత్పత్తులు, బియ్యం లోడులతో వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ఇది కూలితే రెండు మండలాల్లోని 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. జల వనరుల శాఖ డీఈ శిరీష, రోడ్లు భవనాలు డీఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ శిథిల వంతెనల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు.
**సామర్థ్యాన్ని మించి వాడడం వల్లే**
మూడు దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు తగ్గట్టుగా వంతెలను నిర్మించారు. ఇప్పుడు 20 నుంచి 50 టన్నుల సామర్థ్యంతో వాహనాలు ప్రయాణిస్తుండటంతో వాటి సామర్థ్యం దెబ్బతింటోంది. అధికారులు వంతెన సామర్థ్యం, వెళ్లాల్సిన టన్నుల పరిమాణం సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు.

## ఉద్యమ పథం.. ఉపాధికి ఊతం

అల్లూరు: శతాబ్దాలుగా జిల్లాలోని అల్లూరు తీరం ఉప్పు తయారీకి ప్రసిద్ధి. ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలుగుతోంది. దీనికి స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యం కూడా ఉంది. నాడు రైతులు నీటిని తోడి ఉప్పు పండించేవారు. నేడు యంత్రాల ద్వారా మడులకు నీరు పెట్టి తయారుచేస్తున్నారు. ఆహారం నుంచి పారిశ్రామిక కేంద్రాలకు అవసరమయ్యే దాన్ని కూడా ఉత్పత్తి చేస్తున్నారు. రాజుల కాలం నుంచి ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాల్లో తయారీ ఉన్నట్లు తెలుస్తోంది. ఉప్పు గల్లు అమ్ముకుని జీవనం సాగిద్దామనే సామెత నుంచి ఉప్పు కొటారులపై రూ. లక్షలు సంపాదించే స్థాయికి చేరారు. సుమారు 20 సంవత్సరాల క్రితం క్వింటాల్ రూ.20 ఉంటే నేడు రూ.400 వరకు ధరలు పెరిగాయి. ఉప్పు వినియోగం పెరగడం, తయారీ ప్రాంతం ఇతర అవసరాలకు వినియోగించడంతో ఈ పరిస్థితి వచ్చింది. రాజుల కాలంలో ఉప్పు తయారీ కేవలం ఒక వృత్తిగా సాగింది. బ్రిటిష్ పాలకుల కాలంలో పన్నులు వేయాలని అలోచన రావడంతో స్థానికంగా వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆందోళనలు ప్రారంభించారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారు. ఆసమయంలో ఆయన ఇక్కడికి వచ్చి ఉప్పు సేకరించారు. నాడు అల్లూరులోని బాపూజీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈప్రాంత ప్రజల్లో ఉద్యమ కాంక్షను రగిలించారు. పట్టువదలని ఉప్పు తయారీదారులు ఉద్యమం కొనసాగించారు.
స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్యం అనంతరం తయారీ మరింత పెరిగింది. ఇస్కపల్లిలో ఉప్పు కార్యాలయం కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం లీజు విధానంలో రైతులకు భూములు కేటాయించింది. దీంతో ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాలు తయారీ కేంద్రాలుగా మారాయి. గతంలో బికెనాల్ ద్వారా ఇస్కపల్లి నుంచి ఎక్కువగా ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం సుమారు ఆరు వేల ఎకరాల్లో ఉత్పత్తి అవుతోంది. ఆరంభంలో సుమారు 200 ఎకరాల్లో సాగయ్యేది. కాలక్రమంలో ఆరు వేల ఎకరాలకు చేరుకుంది. ప్రస్తుతం దేశంలోనే అల్లూరు తీర ప్రాంత ఉప్పునకు మంచి పేరుంది. ఇక్కడి నుంచి ఐదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 50 వేల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు.

## రూ.2 కోట్లతో శంకరమఠం అభివృద్ధి

తాడేపల్లిగూడెం : స్థానిక ఏలూరు రోడ్డు, చిన్న వంతెన దగ్గర గల శంకరమఠం, సర్వమంగళ అమ్మవారి ఆలయం అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మండప నిర్మాణ పనులు ఇటీవలే ప్రారంభించారు. ప్రతి సర్వమంగళ అమ్మవారికి నవావరణార్చన పేరుతో పూజలు నిర్వహిస్తుంటారు. ఈ పూజల్లో పాల్గొనడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. వారి సౌకర్యార్థం అమ్మవారి ఆలయం ఎదురుగా ముఖ మండపం నిర్మిస్తున్నామని.. మొత్తం రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఆలయ



ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వేమూరి రామం చెప్పారు.

ఆలయానికి సమీపంలో శంకరమఠానికి అనుసంధానంగా 'ముముక్షు భవనం' పేరుతో మూడంతస్తుల్లో వేద పాఠశాల నిర్మిస్తున్నారు. ఇందులో అర్చకుల గృహాలు,పాఠశాల, యాత్రికులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. అందులోనే ఉచిత అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వేద పాఠశాలకు ఎదురుగా ఉన్న స్థలంలో ఒక గోశాల కూడా నిర్మిస్తున్నామని.. ఇవన్నీ త్వరలో పూర్తి చేయాడానికి కృషి చేస్తున్నామని రామం వివరించారు.

## సింహపురికి పైవంతెనల శోభ

నెల్లూరు : నెల్లూరు నగరం చుట్టుపక్కల జాతీయ రహదారిపై నూతన వంతెనలు నిర్మాణంలో ఉన్నాయి. కొన్ని పూర్తి కానుండగా.. ఇంకొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ప్రమాదాలు తగ్గించేందుకు ఇవి దోహద పడనున్నాయి. కాగా పాత వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. నెల్లూరులో పెన్నానదిపై ప్రస్తుతం ఉన్న వంతెన 1954 నాటిది. ఇది శిథిలావస్థకు చేరడంతో రెండులైన్లతో కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 99.48 కోట్లతో చేపట్టిన నిర్మాణం అవాంతరాలను అధిగమిస్తూ చివరి దశకు చేరుకుంది. నూతన సంవత్సరం మార్చి చివరి నాటికి ప్రారంభించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్ 47 రోడ్డును బలోపేతం చేసేలా..

ప్రస్తుతం నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, వేదాయపాలెం, రైల్వేబ్రిడ్జి వాటి అనుసంధాన రోడ్లు, వంతెనలను బలోపేతం చేస్తూ పనులు సాగుతున్నాయి. ఇందుకోసం ఇరువైపులా వంతెనలపై రాకపోకలను ప్రస్తుతం నిలిపివేసి సుమారు రూ. 13.74 కోట్లతో పనులు చేస్తున్నారు. నూతన సంవత్సరం మార్చి తొలివారంలో పనులను పూర్తి చేయడానికి కసరత్తు జరుగుతోంది.



**చింతారెడ్డిపాలెం కూడలిలో అండర్‌పాస్**

తరచూ ప్రమాదాలు జరుగుతున్న చింతారెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారికి నూతన అండర్‌పాస్ మంజూరైంది. విజయవాడ, చెన్నై జాతీయ రహదారి కావడంతో ఇక్కడ రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నెల్లూరు ప్రజాప్రతినిధులు కేంద్ర అధికారులను ఒప్పించి నూతన అండర్‌పాస్ మంజూరు చేయించారు. రూ. 115 కోట్లతో పనులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియకు అధికారులు సిద్ధమయ్యారు.

**ఆరువరుసలతో..** జాతీయ ర.భ అధికారుల ఆధ్వర్యంలో నగరంలోని అయ్యప్ప ఆలయం దాటాక బుజ బుజనెల్లూరు వద్ద 5,(16)వ నెంబర్ జాతీయ రహదారిపై టీ జంక్షన్ వద్ద ఆరు వరుసల ఆకాశవంతెన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. 2024లో ప్రారంభమైన పనులకు రూ. 74.88 కోట్లు మంజూరయ్యాయి. దాదాపుగా 3.48 కిమీటర్లతో 50 మీటర్ల వెడల్పుతో పనులు చేస్తున్నారు. 2025 సెప్టెంబరుకే పూర్తి కావాల్సి ఉన్నా, వివిధ కారణాలతో ఆలస్యమవుతున్నాయి. ఈ పనులు కూడా నూతన సంవత్సరంలోనే పూర్తయి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

## అంతా ఆమోదమే..!

నెల్లూరు : 'ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులకు చెబుదామంటే.. ఫోన్ తీయడం లేదు.. వీటిపై వినతిపత్రాలు ఇస్తే.. కనీసం స్పందన లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రజల ముందు తలదించుకునే పరిస్థితి నెలకొంది' అని కార్పొరేటర్లు గగ్గోలు పెట్టారు. తమ డివిజన్లలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన 118 అంశాలతో మెయిన్ అజెండా, 53 సప్లిమెంటరీ, 16 టేబుల్ అజెండాలను ప్రవేశపెట్టి 187 తీర్మానాలను అజెండాగా ప్రకటించగా.. కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్న తర్వాత మొదటి సమావేశం కావడంతో కార్పొరేటర్లు అందరికీ సమయాన్ని కేటాయించారు. దీంతో తమ డివిజన్లలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

**ఆదాయం రూ.165 కోట్లు.. ఖర్చు రూ.120కోట్లు**నగరపాలకసంస్థ ఆదాయం, ఖర్చులను ఇన్‌ఛార్జి మేయర్ సభ్యులకు వివరించారు. కార్పొరేషన్‌కు రూ. 298 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంటే.. ఇప్పటి వరకు రూ. 77 కోట్లే వసూలయ్యాయని తెలిపారు. గత ఏడాది రూ. 165 కోట్లు ఆదాయం వస్తే.. రూ. 120కోట్లు ఖర్చు అయిందని వివరించారు. నెలకు జీతాలు, విద్యుత్తు బిల్లులు, యంత్రాలకు అద్దెలు రూ. 12.50కోట్లు అవుతున్నట్లు వివరించారు. నగరంలో అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు సంబంధిత కార్పొరేటర్లకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రస్తుతం వినియోగిస్తున్న అద్దె ట్రాక్టర్ల స్థానంలో ప్రభుత్వం 200 విద్యుత్తు ఆటోలను మంజూరు చేసిందన్నారు. కార్పొరేషన్ భాగస్వామ్యంతో నిర్వహించే పండగలకు కార్పొరేటర్లకు ప్రాధాన్యం ఇచ్చి భాగస్వామ్యం చేయాలని సూచించారు. అజెండాలోని అన్ని అంశాలు నగరాభివృద్ధికి రూపొందించబడ్డాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్, కోఆప్షన్ సభ్యులు చాట్ల నరసింహారావు, వహీదా, జమీర్, కమిషనర్ వైవో పాల్గొన్నారు.

# తీరం కంట్లో ఇసుక



మొగల్తూరు : సముద్ర తీరంలో అక్రమార్కులు సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో మొగల్తూరు మండలం పేరుపాలెంసౌత్ పరిధి మోళ్లపర్రు నుంచి నరసాపురం మండలం బియ్యపుతిప్ప వరకు 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో ఇసుక మేటలు తుపానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి తీర గ్రామాలకు సహజ రక్షణ కవచాల్లా ఉపయోగపడుతున్నాయి. కొన్నేళ్లకు ఈ ఇసుకకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

**ఆక్వా చెరువుల పేరిట..**

భవనాల పునాదులు, లేఅవుట్ల పూడికకు ట్రాక్టర్ ట్రక్కు ఇసుకను రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నారు. పలువురు ఆక్వా చెరువుల తవ్వకం పేరిట తీర ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్నారు. నరసాపురం మండలం చినమైనవానిలంక, కేపీపాలెంసౌత్, పేరుపాలెంసౌత్ గ్రామాల పరిధిలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతరం తవ్వకాలు జరుగుతున్నాయి. బీ మోళ్లపర్రు వద్ద ఉప్పుటేరు సముద్రంలో కలిసే ప్రాంతంలో ఇసుక భారీగా మేట వేసింది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు అక్కడ యంత్రాలతో తవ్వి తరలించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

**గ్రామాలకు ముప్పు**

వాతావరణ మార్పుల ప్రభావంతో రెండు దశాబ్దాలుగా సముద్రపోటు పెరుగుతుండటంతో తీర ప్రాంత గ్రామాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు తీరం వెంబడి మీటర్ల లోతు వరకు ఇసుకను తవ్వేస్తుండటంతో సమీప భూములు ఉప్పు కయ్యలుగా మారుతున్నాయి. గతంలో తీరప్రాంత గ్రామాల్లో ప్రజలు బావుల్లో నీటిని తాగేందుకు, ఇంటి అవసరాలకు వినియోగించేవారు. ఇసుక తవ్వకాలు, ఆక్వాచెరువుల ప్రభావంతో భూగర్భ జలాల్లో ఉప్పుశాతం పెరిగి అవి తాగేందుకు పనికిరావడం లేదు.

**చర్యలు చేపడతాం**

'సముద్రతీరంలో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.' అని మొగల్తూరు తహసీల్దారు కె.రాజకిశోర్ తెలిపారు.

## ప్రజా సమస్యలపై.. అక్షరమే అస్త్రమై!



పెనుగొండ : ప్రజా సమస్యలపై అక్షరాలే అస్త్రాలుగాలో ప్రచురితమైన కథనాలు యంత్రాంగాన్ని, పాలకులను కదిలించాయి. 2025లో నరసాపురం డివిజన్ పరిధిలో పలు సమస్యలకు కథనాలతో పరిష్కారం లభించింది. పెనుమంట్ర మండలంలో అల్పవిద్యుత్తు, స్తంభాలు దెబ్బతినడంతో తరచూ విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్న పరిస్థితులపై సెప్టెంబరులో ప్రచురితమైన కథనానికి యంత్రాంగం స్పందించింది. వివిధ ప్రదేశాల్లో కొత్తగా పరివర్తకాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. బ్రాహ్మణచెరువు- నౌదూరు ఆర్‌అండ్‌బీ రహదారి పాడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులపై పలు మార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించి ఉన్నతాధికారులకు నివేదించారు. నిధులు మంజూరు కావడంతో ఇటీవల రహదారుల పనులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు.

ఆచంట సీహెచ్‌సీ ప్రాంతంలో విద్యుత్తు సమస్యపైలో ప్రచురితమైన కథనాలకు వివిధ శాఖల అధికారులు స్పందించి సుమారు రూ. 5లక్షల ఖర్చుతో కొత్త పరివర్తకం ఏర్పాటు చేశారు.

నరసాపురం- మత్స్యపురి- భీమవరం ప్రధాన రహదారి సరిపల్లి- లిఖితపూడి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన తీరుపైలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రూ. 12 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయించారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట! పాలకొల్లు పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్తు పరివర్తకాలు ప్రమాదకరంగా ఉన్న తీరుపైలో ప్రచురితమైన కథనాలు ఆ శాఖ అధికారులు స్పందించారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ఆయన సూచనల మేరకు విద్యుత్తు శాఖ రక్షణ చర్యలకు నిధులు మంజూరు చేసింది. పాలకొల్లు ఎంఎంకేఎన్ఎం, బీవీఆర్ఎం బాలికల, బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాలలు, దేశాలమ్మ ఆలయం వెనుక, లయన్స్ నగర్, అచ్చుగట్లపాలెం ప్రాంతాల్లో 25 పరివర్తకాల చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. రూ. 12 లక్షలతో చేపట్టిన ఈ పనులను మే నెలలో పూర్తి చేశారు.

## అభివృద్ధి వెంట.. పరుగెడదాం

భీమవరం : కోటి ఆశలు మోసుకుంటూ కొత్త సంవత్సరం వచ్చేసింది. చేదు అనుభవాలు పాఠాలుగా, గత విజయాలు పునాదులుగా వేసుకుని మనో ధైర్యంతో జిల్లా ప్రగతికి ముందుకు సాగితే అన్నీ మంచి రోజులే. జిల్లా యంత్రాంగం కొత్త లక్ష్యాలు, ప్రణాళికలు నిర్దేశించుకోవాలి. ఆధునికత – సాంకేతికతతో పాటు నైపుణ్యాభివృద్ధి అందిపుచ్చుకుంటే అభివృద్ధి మన వెంటే.

**ఉన్నతికి శ్రీకారం**

డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలను ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త కింద తీర్చిదిద్దేందుకు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వ్యాపార స్థాపనకు, అభివృద్ధికి నమోదైన సంఘా'లకు రూ. 205 కోట్ల వరకు రుణాలు ఇప్పించారు. మరో 2700 గ్రూపులకు అందించేందుకు ప్రణాళిక చేశారు. నూతనంగా ఏర్పాటైన సంఘాలకు రూ. 15 వేలు, ఆదర్శవంతమైన మండల సమాఖ్యలకు రూ. 5 లక్షల రివాల్వింగ్ ఫండ్ కింద అందిస్తున్నారు.

**నైపుణ్య సిద్ధిరస్తు** ఉన్నత చదువులు పూర్తిచేసిన యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. పెదమైనవానిలంక లోని డిజిటల్ కేంద్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్ఈ), ఎన్‌ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సోలార్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నారు. ఇది కాకుండా ఏఐ, డ్రోన్లు, ఎలక్ట్రికల్ రంగాల్లో ఇచ్చే శిక్షణను అందిపుచ్చుకోవాలి.

**మీసం మెలేసిన రొయ్య** ప్రభుత్వం ఆక్వా రంగానికి ఊతమివ్వడానికి మేతలపై 5 శాతం తగ్గించడంతో పాటు, నాబార్డు సహాయం, నాణ్యమైన సీడ్ అందించడం, ఎగుమతులు పెంచేందుకు చర్యలు చేపట్టింది. చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి విద్యుత్తు రాయితీ, బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఆక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

**గోదావరి వాసికి స్వఛజేలం** ప్రజలకు స్వఛమైన తాగునీటిని



అందించనున్నాయి జల్‌జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాలు. జలనిధి పథకం (వాటర్ గ్రిడ్) ద్వారా విజ్జేశ్వరం నుంచి మంచినీటిని అందించే పనులు ప్రారంభమయ్యాయి. 16 మండలాల్లో 854 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ. 1400 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**పర్యాటక హారం**

ఆకివీడు మండలం దుంపగడపలో కాటన్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. ఉప్పుటేరులో బోటింగ్, పేరుపాలెం దగ్గర 9 కి.మీ. మేర విస్తరించి ఉన్న సాగర తీరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. పేరుపాలెం బీచ్, పెదమల్లం రిసార్ట్స్, యలమంచిలిలంక, చించినాడ, నరసాపురం గోదావరి తీర ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పుష్కరాల నేపథ్యంలో రూ. 1.8 కోట్లతో రేవుల సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

**పరిశ్రమయేవ జయతే**

పారిశ్రామికవేత్తల కోసం విస్సాకోడేరులో 9.78, లిఖితపూడిలో 9.09 ఎకరాలు సిద్ధం చేశారు. జీ ప్లస్ టు బహుళ అంతస్తుల భవనం నిర్మించి ప్లగ్ అండ్ ప్లే విధంగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు కల్పించనున్నారు. యలమంచిలిలో కొబ్బరి ఉత్పత్తుల మార్కెటింగ్, దువ్వలో ప్రింటింగ్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం ఒక్కో క్లస్టర్‌కు రూ. 10 కోట్లు మంజూరు చేయనున్నారు.

## తీరానికి మణిహారం.. ప్రగతికి బీజం

బిట్రగుంట: తీర ప్రాంతానికి ఫిషింగ్ హార్బర్ పెద్ద వెలుగు తెచ్చింది. 115.69 ఎకరాల విస్తీర్ణంలో రూ. 288.80 కోట్లతో ఏర్పాటుచేస్తున్నారు. ఇది దేశంలోనే పెద్ద ఫిషింగ్ హార్బర్ల జాబితాలో ఒకటిగా నిలవనుంది మూడు జిల్లాల్లో 25 వేల మంది ఉపాధికి ఆధారంగా మారనుంది బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో నిర్మిస్తున్న మత్స్య రేవు. కృషపట్నంలోని ఓడరేవు జాతీయ స్థాయిలో ఎదగడంతో ఆ ప్రాంతంలో చేపల వేటకు కష్టకాలం వచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మత్స్యకారులకు ఉపాధి తగ్గిపోయింది. దీంతో పొరుగు రాష్ట్రాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**వలసలకు చెల్లు..**

ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో చేపల వేట సాగించే మత్స్యకారులు వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశ స్థాయిలో గుర్తింపు పొందేలా ఫిషింగ్ హార్బర్‌లో వసతులు కల్పిస్తున్నారు. 1250 బోట్లు ఆగే జెట్టీ సిద్ధంగా ఉంది. 45 భవనాలు పూర్తి చేశారు. సోలార్ పార్క్ కూడా రానుంది. మత్స్యకారులకు సబ్సిడీతో మెకనైజ్డ్ బోట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏటా రూ. 800 కోట్ల మేరకు మత్స్య సంపద ఫిషింగ్ హార్బర్ నుంచి ఎగుమతులు జరిగే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు.

**అప్పుడే బీజం**

2014–19 సంవత్సరాల మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చేపల వేట సాగించే మత్స్యకారులకు ఉపాధి చూపాలన్న సంకల్పంతో జువ్వలదిన్నె పరిధిలోని చిప్పలేరు వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేసింది. రూ. 288.80 కోట్లతో డీప్మీఆర్ సిద్ధం చేసింది. ఆ తరువాత ప్రభుత్వం పనులు ప్రారంభించినా పూర్తి చేయలేకపోయింది. వైకాపా ప్రభుత్వంలో కొంత మేరకు జరిగాయి. అసంపూర్తి పనులకు తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది.



**మరో వరం**

పొట్టి శ్రీరాములు నడయాడిన గ్రామం జువ్వలదిన్నె. దీంతో చారిత్రక ప్రాంతంగా గుర్తింపు దక్కింది. ఈనేపథ్యంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కావడం ఈప్రాంతానికి మరో వరమైంది. ఈనేపథ్యంలో 2014–19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు ఈగ్రామాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దాలని నిర?యించారు. ఈమేరకు రూ. 110 కోట్లతో పనులు చేపట్టారు. గ్రామంలో స్మారకమందిరం తదితర పనులు ప్రారంభించారు. ఇవి చేస్తుండగానే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. ఇవి పూర్తి చేయాలని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ సీఎం దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. పూర్తి చేస్తే జువ్వలదిన్నెకు మరో వైభవం వస్తోంది. పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతుంది.

## దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు

పీలేరు : అన్నమయ్య జిల్లాలో మేజర్ పంచాయతీల్లో ముందు వరుసలో ఉన్న పీలేరు పంచాయతీ దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణం విస్తీర?ం పది కిలోమీటర్లు ఉంది. పంచాయతీ జనాభా 45 వేలు ఉండగా 20 మంది వార్డు సభ్యులున్నారు. ఏడాదికి పంచాయతీ అన్ని పన్నులు కలుపుకుని రూ. 4 కోట్లు ఆదాయం చేకూరుతుంది. పదివేలకుపైగా గృహాలు, 80 వీధులు ఉన్నాయి. 1922లో పంచాయతీగా ఏర్పడినా 1965లో మేజర్ పంచాయతీగా ఏర్పడింది. పట్టణ పరిశుభ్రత కోసం 40 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, రాయచోటి పట్టణాలకు 60 కిలోమీటర్ల మధ్యలో పీలేరు ఉండడంతో రోజు రోజుకు అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. విద్య, వైద్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతానికి ఆర్టీసీ డిపోతో పాటు, రైల్వే స్టేషన్ సౌకర్యం కూడా ఉంది. పీలేరు నుంచి ఇతర పట్టణాలకు రైలు సౌకర్యం అందుబాటులో ఉంది.

పంచాయతీ పరిధిలో మదనపల్లె మార్గంలో కామాటంపల్లె, చిత్తూరు మార్గంలో బందార్లపల్లె, చిన్నరెడ్డివారిపల్లె, తిరుపతి మార్గంలో కోటపల్లె, కడప మార్గంలో కావలిపల్లె ఉన్నాయి.

నేరాలను విచారించేందుకు పీలేరులో 1865లోనే జూనియర్ సివిల్ న్యాయస్థానం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, 11వ అదనపు జిల్లా న్యాయస్థానం, స్పెషల్ కోర్టులు ఉన్నాయి.


విద్యా పరంగా 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 34 ప్రైవేటు యూపీ, ఉన్నత పాఠశాలలు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మూడు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు సౌకర్యంగా ఐదు వసతి గృహాలున్నాయి.

పీలేరు పట్టణానికి తాగునీటి సౌకర్యం కోసం అయ్యపునాయుని చెరువు, కొత్తపల్లె చెరువులు ఉన్నాయి. ప్రజలకు సౌకర్యంగా 24 బోర్ల నుంచి నీటిని పంపింగ్ చేసి గొట్టాల ద్వారా సరఫరా చేస్తున్నారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటే పీలేరు పంచాయతీ పరిధిలోని బోర్లకు భూగరజేలాలు అభివృద్ధి చెందుతాయి.

పీలేరు ఆర్టీసీ డిపోలో 92 సర్వీసులు నడుస్తున్నాయి. పీలేరు నుంచి చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, మదనపల్లె, రాయచోటి పట్టణాలతో పాటు శ్రీశైలం, బెంగళూరు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. విద్యుత్తు ఈఈ కార్యాలయం, పంచాయతీరాజ్ డీఈ, నీటిపాదరులశాఖ డీఈ,. గృహనిర్మాణశాఖ డీఈ కార్యాలయాలున్నాయి. ఆధ్మాతికంగా కోటపల్లె, కడప మార్గంలో సూర్యనారాయణరెడ్డి నగర్‌లో రెండు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు, మదనపల్లె మార్గంలో శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, పట్టణంలో కాశీవిశ్వేరాలయం, శిర్డీ సాయిబాబా ఆలయం, అభయహస్త వినాయకస్వామి ఆలయం, శ్రీరామాలయం, కోదండ రామస్వామి ఆలయం, ఆసుపత్రి ఆవరణలో శ్రీరౌద్రాల అంకాళమ్మదేవత ఆలయాలున్నాయి.

## కళ్ళతోనే కవ్విస్తున్న కృతి శెట్టి.. ఫోటోలు వైరల్!


ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే హ్యాట్రిక్ అందుకొని ఊహించని విజయాన్ని సొంతం చేసుకున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో కృతి శెట్టి కూడా ఒకరు. శాండిల్ వుడ్ సినీ పరిశ్రమ నుండి అడుగుపెట్టిన ఈమె.. ప్రముఖ దిగ్గజ దర్శకుడు సుకుమార్ శిష్యుడిగా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న బుచ్చిబాబు సన తొలి పరిచయంలో దర్శకుడిగా వచ్చిన చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారానే హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది. ఇందులో బేబమ్మ పాత్రతో అందరి దృష్టిని ఆకట్టుకొని.. ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోయింది. అంతేకాదు తన అందంతో మాయ చేస్తూ ప్రేక్షకులను మెప్పించిన ఈమె.. కుర్రకారు ఫేవరెట్ హీరోయిన్గా మారిపోయింది. అంతేకాదు సొట్టబుగ్గల సుందరిగా ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది కృతి శెట్టి. ఈ సినిమా అందించిన సక్సెస్ తో నాని హీరోగా వచ్చిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో తన అద్భుతమైన నటనతో మెప్పించడమే కాకుండా ఇందులో బోల్డ్ గా నటించి అందరిని ఆశ్చర్యపరిచింది. ఆ తరువాత నాగార్జున, నాగచైతన్య కాంబినేషన్లో వచ్చిన 'సోగ్గాడే చిన్నినాయన' సీక్వెల్ 'బంగార్రాజు' సినిమాలో నాగచైతన్య సరసన నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.



అలా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ఏకంగా హ్యాట్రిక్ అందుకొని సక్సెస్ అయ్యింది. అయితే ఆ తర్వాత కాలంలో ఏమైందో తెలియదు కానీ కథల ఎంపిక విషయంలో కాస్త తడబడిందనే చెప్పాలి . అందులో భాగంగానే ఈమె నటించిన చాలా సినిమాలు ఈమెకు విజయాన్ని అందించలేదు. అలా సుధీర్ బాబుతో ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ వంటి చిత్రాలలో నటించింది. కానీ ఇవేవీ కూడా ఈమెకు విజయాన్ని అందించలేదు. ఇక మలయాళంలో తమిళ్ సినీ ఇండస్ట్రీలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న కృతి శెట్టికి సరైన అవకాశాలు మాత్రం రాలేదనే చెప్పాలి. ఇక ప్రస్తుతం తెలుగులో చివరిగా కార్తీ , సత్యరాజ్ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'అన్నగారు వస్తున్నారు' అనే సినిమాలో నటించింది . ఈ సినిమా కూడా ఈమెకు పెద్దగా సక్సెస్ ను అందించలేదు. సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తూ మరొకవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడింది. అందులో భాగంగానే గ్లామర్ ఒలకబోస్తున్న ఈమె ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మినీ డ్రెస్ ధరించిన ఈమె అందాలతో ఫాలోవర్స్ ను ఫిదా చేసే ప్రయత్నం చేసింది. కళ్ళతోనే కవ్విస్తూ మాయ చేస్తున్న ఈమె.. ఒకవైపు గ్లామర్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు దర్శక నిర్మాతల కంట్లో పడే ప్రయత్నం చేస్తున్న బేబమ్మకి కనీసం ఈసారైనా ఒక మంచి అవకాశం రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. దీనికి తోడు ఇటీవల చిరంజీవి - బాబి కాంబినేషన్లో వస్తున్న మెగా 158 సినిమాలో చిరంజీవికి కూతురుగా నటించబోతోంది అంటూ వార్తలు రాగా.. ఈ వార్తలను కొట్టిపారేసింది చిత్ర బృందం. మరి ఇప్పటికైనా కృతి శెట్టికి ఒక మంచి అవకాశం లభించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## వెంకటేష్ హీరోగా హిట్ మెషిన్ ఫిక్స్!

హిట్ మెషిన్ అనీల్ రావిపూడి 10వ సినిమా హీరో ఫిక్స్ అయిపోయాడా మరోసారి సీనియర్ స్టార్ తోనే ముందుకెళ్తున్నాడా అంటే అవుననే తెలుస్తోంది. ఇటీవలే -మ?న శంకర వరప్రసాద్ గారు- తో మరో బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. అనీల్ వరుసగా తొమ్మిది విజయాలతో ట్రిపుల్ హ్యాట్రిక్ నమోదు చేసాడు. రాజమౌళి తర్వాత ఆ రికార్డు అనీల్ దే. దీంతో పదవ సినిమా ఏ హీరోతో చేస్తాడు ఎలాంటి స్టోరీతో వస్తాడు అన్న చర్చ -ఎమ్ ఎస్ జీ- రిలీజ్ అనంతరమే మొదలైపోయింది. ఈ విషయంలో అనీల్ కూడా అభిమానుల్ని పెద్దగా గందరగోళానికి గురి చేయలేదు. రెండు వారాల విరామం అనంతరం ప్రాజెక్ట్ పనుల్లో బిజీ అవుతానని వెల్లడించాడు. అయితే హీరో ఎవరు అన్న దానిపై రకరకాల ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. బాలయ్య, చిరంజీవి, వెంకీలను ఇప్పటికే డైరెక్ట్ చేసిన నేపథ్యంలో తదుపరి హీరో కింగ్ నాగార్జున అవుతారని దాదాపు అంతా ఫిక్స్ అయిపోయారు. ఆయన కాకపోతే



పవర్ స్టార్ వపన్ కళ్యాణ్ తో ఛాన్స్ అందుకుంటాడని అనుకున్నారు. వీరిద్దరు కాకపోతే సమయం తీసుకున్నా చిరంజీవి ఎలాగూ వెంకటేష్ తో మల్టీస్టారర్ కు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చారు కాబట్టి ఆ కలయికలో చేస్తాడనుకున్నారు. కానీ అనీల్ అందరికీ ట్విస్ట్ ఇచ్చాడు. నాగార్జునతోనూ ముందుకెళ్లలేదు. పవన్ కళ్యాణ్ ని పట్టించుకోలేదు. మల్టీస్టారర్ చేయడం లేదు. కూల్ గా మరోసారి విక్టరీ వెంకటేష్ హీరోగా సినిమా చేయడానికి ఫిక్స్ అయ్యాడు. ఈ చిత్ర విషయమై ఇప్పటికే చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని తెలిసింది. ఇప్పటికే స్టోరీ లాక్ అయింది. అయితే ఆ కథను పూర్తి స్థాయిలో సిద్దం చేయాల్సి ఉంది. అందుకు అనీల్ కొంత సమయం తీసుకుంటున్నాడు. అన్ని ప?నులు పూర్తి చేసి జూన్ లో ప్రాజెక్ట్ ను ప్రారంభించాలని స్నాహాలు చేస్తున్నాడుట. అలాగే నిర్మాత కూడా సాహూ గారపాటిగా తెలిసింది. 2027 సంక్రాంతి కానుకగా చిత్రాన్ని రిలీజ్ చేయాలని అనీల్ ప్లాన్ చేసుకుంటున్నాడుట. ప్రస్తుతం వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో -ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47- తెరకెక్కుతోంది. దీంతో పాటు త్వరలో -దృశ్యం 3- షూటింగ్ కూడా మొదల వుతుంది. జూన్ లోగా గురూజీ సినిమా సూటింగ్ ఓ కొలిక్కి వస్తుంది. ఈ క్రమంలోనే అనీల్ జూన్ నుంచి షూట్ ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈవెంకటేష్- అనీల్ కాంబినేషన్ లో రిలీజ్ అయిన -సంక్రాంతికి వస్తున్నాం- బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే.




## 2026..మెగా నామ సంవత్సరం




2026 మెగా నామ సంవత్సం అందులో ఎలాంటి డౌట్ లేదు. ఆ విష?యాన్ని ఈ ఇయర్ స్టార్టింగ్లోనే నిజమని నిరూపించబడింది. మెగా ఫ్యాన్స్కి ఫుల్ జోష్ని అందించింది. ఈ ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి -మన శంకరవరప్రసాద్గారు- మూవీతో బరిలోకి దగడం..బాక్సాఫీస్ వద్ద భారీ బ్లాక్ బస్టర్ హిట్ని సొంతం చేసుకుని శుభారంభాన్ని అందించారు. అనిల్ రావిపూడి తెర?కెక్కించిన ఈ సినిమా జనవరి 12న విడుదలై సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ డే ఫస్ట్ షోతో యునానిమస్గా బ్లాక్ బస్టర్ టాక్ని సొంతం చేసుకున్న ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఇప్పటి వరకు రూ.300 కోట్ల మార్కుని దాటి విజయవంతంగా ప్ర?ద?ర్శింప?బ?డుతోంది. అంతే కాకుండా అత్యంత తక్కువ టైమ్లోనే ఈ ఏడాది ఈ ఫీట్ని సాధించిన తొలి ప్రాంతీయ సినిమాగా -మ?న శంకరవరప్రసాద్గారు- రికార్డు సాధించింది. ఈ మూవీ అందించిన సక్సెస్ జోష్లో ఉన్న మెగా అభిమానుల?కు ఈ ఏడాది బ్యాక్టు బ్యాక్ మెగా సర్ప్రైజ్లు రాబోతున్నాయి. దీంతో ఈ ఏడాది మెగా ఫ్యాన్స్కు మర్చిపోలేని ఏడాదిగా మారబోతోంది. అందుకే ఈ ఇయర్గా మెగా నామ సంవత్సరంగా అంతా అభివర్ణిస్తున్నారు. చిరు -మన శంకరవరప్రసాద్గారు-తో అందించిన శుభారంభాన్ని మిగతా మెగా హీరోలు కంటిన్యూ చేయబోతున్నారు. మార్చి 26న పవర్ స్టార్ పవన్ కల్యాణ్, హరీష్ శంకర్ల కాంబినేషన్లో రూపొందుతున్న -ఉస్తాద్ భగత్సింగ్- రాబోతోంది. ఇప్పటి వరకు విడుదలై ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్లో హంగామా సృష్టించడం ఖాయం అని స్పష్టమవుతోంది. ఇక ఈ మూవీ తరువాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్గా భావిస్తున్న -పెద్ది- రాబోతోంది. బుచ్చిబాబు సాన డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్గా నటిస్తుండగా కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ మే 1న రాబోతోంది. ఇక మెగాస్టార్ నటిస్తున్న మరో భారీ గ్రాఫికల్ మైథలాజికల్ డ్రామా -విశ్వంభర- జూలై 10న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మెగా హీరోలు బ్యాక్ టు బ్యాక్ ఒకే ఒక్క నెల తేడాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వీరితో పాటు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కూడా బరిలోకి దిగుతున్నాడు. తొలిసారి హారర్ థ్రిల్లర్ కథని ఎంచుకుని వరుణ్ తేజ్ నటిస్తున్న మూవీ -కొరియన్ కనకరాజు-. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సమ్మర్లో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఇటీవల విడుద?ల చేసిన టైటిల్ గ్లింప్స్తో అంచనాల్ని పెంచేసిన టీమ్ సమ్మర్కు వచ్చేస్తున్నామంటూ ప్రకటించింది. ఈ ఏడాది -మన శంకరవరప్రసాద్గారు-తో బ్లాక్ బస్టర్ని సొంతం చేసుకుని శుభారంభాన్ని అందించినట్టే మెగా హీరోలు పవన్ కల్యాణ్, రామ్ చరణ్, వరుణ్ తేజ్ బ్యాక్ టు బ్యాక్ సక్సెస్లని సొంతం చేసుకుంటారా అన్నది తెలియాలంటే మరి కొన్ని నెలలు వేచి చూడాల్సిందే.

## స్పిరిట్ ఓవర్సీస్ వేట.. నెవ్వర్ బిఫోర్..



రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద తిరుగులేని స్టార్డమ్ ని ఎంజాయ్ చేస్తున్నారు. రీసెంట్ గా రాజాసాబ్ తేడా కొట్టినా నెక్స్ట్ ప్రాజెక్టులపై ఎఫెక్ట్ పెద్దగా పడలేదని అర్థమవుతుంది. ప్రభాస్ సినిమా వస్తోందంటే చాలు బిజినెస్ వర్గాల్లో ఒక రకమైన ప్రకంపనలు మొదలవుతున్నాయి. ముఖ్యంగా క్రేజీ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో ప్రభాస్ చేయబోతున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుండి కేవలం సౌత్ లోనే కాకుండా నార్త్ ఇండియాలో కూడా భారీ బజ్ క్రియేట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉన్నా.. బిజినెస్ పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో ఉండే ఇంటెన్సిటీ.. ప్రభాస్ మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ షేక్ అవ్వడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఈ మూవీ థియేట్రికల్ హక్కుల కోసం అప్పుడే పోటీ మొదలైపోయింది. ఈ క్రేజ్ చూస్తుంటే ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఇది ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలిచేలా కనిపిస్తోంది. అసలు విషయం ఏంటంటే.. స్పిరిట్ ఓవర్సీస్ బిజినెస్ ఇప్పుడు ఇండస్ట్రీని షాక్ కి గురిచేస్తోంది. విదేశీ మార్కెట్ లో ఈ సినిమా హక్కుల కోసం డిస్ట్రిబ్యూటర్ల మధ్య ఊహించని డిమాండ్ నెలకొంది. ట్రేడ్ టాక్ ప్రకారం ఓవర్సీస్ హక్కుల కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఆఫర్లు వస్తున్నాయి. టాప్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమాను దక్కించుకోవడానికి ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ప్రభాస్ కు ఉన్న ఇంటర్నేషనల్ మార్కెట్ వల్లే ఈ స్థాయిలో క్రేజ్ ఏర్పడిందని చెప్పాలి. సందీప్ రెడ్డి వంగా గత సినిమాలు 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' ఓవర్సీస్ బాక్సాఫీస్ దగ్గర వండర్స్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు ఏకంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ తో పోలీస్ ఆఫీసర్ గా సినిమా తీస్తుండటంతో డిస్ట్రిబ్యూటర్లు ఎగబడుతున్నారు. ఎంత రేటు పెట్టి అయినా హక్కులు దక్కించుకుంటే లాంగ్ రన్ లో భారీ లాభాలు వస్తాయని వారి నమ్మకం. ఈ రేంజ్ కాంపిటీషన్ చూస్తుంటే స్పిరిట్ ఓవర్సీస్ బిజినెస్ ఒక రేంజ్ లో క్లోజ్ అయ్యేలా ఉంది. నేటి జనరేషన్ ఆడియన్స్ కు సందీప్ రెడ్డి వంగా మేకింగ్ స్టైల్ అంటే ఒక రకమైన క్రేజ్ ఉంది. రా అండ్ ఇంటెన్స్ డ్రామాను ఆయన ప్రెజెంట్ చేసే విధానం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ ప్రాజెక్ట్ పై యూత్ లో స్ట్రాంగ్ హైప్ ఉంది. ప్రభాస్ వింటేజ్ మాస్ లుక్ తో పాటు సందీప్ మార్క్ వైలెన్స్ ఈ సినిమాలో పీక్స్ లో ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అందుకే బిజినెస్ లెక్కలు కూడా అదే రేంజ్ లో ఉన్నాయి. 'స్పిరిట్' షూటింగ్ పూర్తి చేసుకుని థియేటర్లలోకి రావడానికి ఇంకా సమయం ఉన్నా.. బిజినెస్ వరల్డ్ లో మాత్రం ప్రభాస్ ప్రకంపనలు మొదలైపోయింది. ఓవర్సీస్ లో ఈ సినిమా సాధించబోయే రికార్డులు ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేస్తాయని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మరి ప్రభాస్ సందీప్ వంగా కాంబో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

## 'ఆ ప్రొడ్యూసర్ జూమ్ చేసి అలా అనేశారు'.. ఈషా ఎమోషనల్!

హీరోయిన్ ఈషా రెబ్బా తన కెరీర్ స్టార్టింగ్ లో ఎదుర్కొన్న బాడీ షేమింగ్ ఎక్స్పీరియన్స్ ను తలుచుకుని కాస్త ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతి జనవరి 23వ తేదీన థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతుండటంతో ప్రమోషన్లలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె గతంలో తనకు ఎదురైన ఒక చేదు సంఘటనను ప్రేక్షకులతో పంచుకున్నారు. సినిమాల్లోకి కొత్తగా అడుగుపెట్టిన రోజుల్లో ఒక నిర్మాత తన ఫోటోలను ల్యాప్ టాప్ లో జూమ్ చేసి చూసి, 'నీ మోచేయిలు డార్క్ గా ఉన్నాయి.. ఇంకా ఫెయిర్ గా ఉండాలి' అంటూ తన ముందే వ్యాఖ్యానించారని ఈషా రెబ్బా తెలిపారు. ఆ మాటలు తన మనసును చాలా బాధించాయని, దాని వల్ల కొంతకాలం వరకు తీవ్రంగా నిరుత్సాహానికి లోనయ్యానని చెప్పారు. ఆ సమయంలో ఆ వ్యక్తికి ఏం సమాధానం చెప్పాలో కూడా తెలియక మౌనంగా ఉండిపోయానని గుర్తు చేసుకున్నారు. అయితే



తన పుట్టుకతో వచ్చిన రంగును మార్చుకోలేనని, అయినా అప్పట్లో ఆ వ్యాఖ్యలు తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయని ఈషా పేర్కొన్నారు. అప్పుడు పరిశ్రమలో ఇలాంటి విషయాలు సాధారణమేనని కూడా తనకు తెలియదని చెప్పారు. అందుకే చాలా ఎమోషనల్ అయ్యానని చెప్పిన ఈషా.. ఆ తర్వాత తనను తాను అంగీకరించడం నేర్చుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు ఆ విషయాన్ని పాజిటివ్ గా తీసుకుంటున్నానని అన్నారు. అదే సమయంలో ఆ అనుభవమే తనను మరింత బలంగా మార్చిందని, ఇప్పుడు తన రూపాన్ని, తనను తాను గౌరవించుకోవడం తెలుసుకున్నానని ఈషా రెబ్బా చెప్పుకొచ్చారు. అయితే ఇలాంటి వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో చాలా మంది నటీనటులు ఎదుర్కొంటున్నారని, అయితే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని ఈషా సూచించారు. తన అనుభవాన్ని షేర్ చేయడం ద్వారా ఇతరులకు ధైర్యం కలగాలని ఆశిస్తున్నానని కూడా చెప్పారు. బాడీ షేమింగ్ వంటి సమస్యలపై ఈషా రెబ్బా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇక ఓం ఓం శాంతి సినిమా విషయానికి వస్తే.. ఏ.ఆర్. సజీవ్ దర్శకత్వం వహిస్తున్న మూవీలో ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్నారు. ఆయన భార్యగా ఈషా రెబ్బా యాక్ట్ చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో విడుదల కానున్న సినిమాపై మంచి అంచనాలున్నాయి. విడుదల తేదీ దగ్గర పడటంతో చిత్ర బృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. మరి ఈషాకు ఓం శాంతి శాంతి మూవీతో ఎలాంటి హిట్ దక్కుతుందో వేచి చూడాలి.

## ఆ యంగ్ హీరోకీ శ్రీలీల రెండవ నాయిక?

తెలుగు హీరోయిన్ శ్రీలీల టాలీవుడ్ లో సెలక్టివ్ గా వెళ్తోన్న సంగతి తెలిసిందే. మునుపటిలా గ్లామర్ పాత్రలకు ఒకే చెప్పడం లేదు. సెకెండ్ లీడ్స్ కు ఛాన్స్ తీసుకోవడం లేదు. పాత్రలో గొప్పతనం..ఔన్నత్యం చూసి సైన్ చేస్తుంది. పారితోషికం కోసం కాకుండా ఫీజ్ తక్కువగా వచ్చినా మంచి పాత్రలు మాత్రమే చేయాలని బలంగా డిసైడ్ ముందుకెళ్తోంది. ఈ క్రమంలో తెలుగు సినిమాల్ని వదులుకోవడానికి కూడా సిద్దంగా ఉంది. ఇప్పటికే తాను అనుకున్న ప్రణాళిక కూడా ఆచరణలోకి తీసుకొచ్చింది. దీనిలో భాగంగా బాలీవుడ్ లో చిన్న హీరోలతో పని చేయడానికి ఎంత మాత్రం వెనకడుగు వేయడం లేదు. సినిమాలో హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత ఉందంటే క?మిట్ అయిపోతుంది. ఇప్పటికే అమ్మడు హిందీలో రెండు సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. వాటి రిలీజ్ కు ముందే కొత్త అవకాశాలు కూడా బాగానే వస్తున్నాయి. అలాగని అమ్మడు కంగారు పడలేదు. మరో తప్పిదం జరగకుండా ఆచితూచి వ్యహరిస్తోంది. అలాగే తమిళ్



లో కూడా సినిమాలు కమిట్ అవుతోంది. తాజాగా కోలీవుడ్ హీరోం కం డైరెక్టర్ ప్రదీప్ రంగనాథ్ ఓ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నాడు. -లవ్ టుడే- తర్వాత మరోసారి కెప్టెన్ కుర్చీ ఎక్కుతున్నాడు. తానే హీరోగా నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్ర?మిది. ఇందులో హీరోయిన్ గా మీనాక్షి చౌదరిని ఎంపిక చేసాడు. తాజాగా సెకెండ్ లీడ్ కోసం శ్రీలీలను తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవలే శ్రీలీలకు స్టోరీ నేరేట్ చేసాడుట. పాత్ర నచ్చడంతో శ్రీలీల మ?రో ఆలోచన లేకుండా కమిట్ అయిందని తెలిసింది. శ్రీలీల ఇలా క?మిట్ అవ్వడం చూసి టాలీవుడ్ షాక్ అయింది. తెలుగు హీరోల్ని కాదని తమిళ సినిమాలకు సైన్ చేస్తుందా అన్న గుసాయింపు తెరపైకి వస్తోంది. అఖిల్ సినిమా -లెనిన్- లో ముందుగా హీరోయిన్ గా శ్రీలీలను ఎంచుకున్నారు. కానీ డేట్లు సర్దుబాటు కావడం లేదని లెనిన్ నుంచి తప్పుకుంది. అదే సమయంలో బాలీవుడ్ లో కొత్త ప్రాజెక్ట్ ల?కు సైన్ చేసింది. దీంతో శ్రీలీల కావాలనే తెలుగు సినిమాలకు క?మిట్ అవ్వడం లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ప్రదీప్ కి జోడీగా సెకెండ్ లీడ్ కి కూడా ఒకే చెప్పిందంటే శ్రీలీల పాత్రలను ఎంత బలంగా నమ్ముతుంది అన్నది అర్ధం పడుతుంది. ప్రదీప్ గత సినిమా -డ్రాగన్- లో సెకెండ్ లీడ్ పోషించిన కయాదు లోహార్ ఏ రేంజ్ లో ఫేమస్ అయిందో తెలిసిందే. రెండవ నాయిక అయినా సినిమా విజయం సాధించడం..పాత్ర గుర్తింపుతో మంచి అవకాశాలు అందుకుంటుంది. శ్రీలీల కూడా అలాంటి ఇన్నింగ్స్ కోసమే ఎదురు చూస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536